

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ 28-5-2026 గురువారం సంపుటి: 32
సంచిక: 117 పేజీలు: 10+4 వెల: 6.50

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

: fb.com/vaartha Digital



పట్టాలపైకి తొలి హైడ్రోజన్ రైలు 3
మమత ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజెపివైపు చూపు! 5


## 'సర్' చట్టబద్ధమే

ఎన్నికల్లో పాల్గొనేందుకే జాబితాల సవరణ

పౌరసత్వం రద్దు చేసే వాక్కు ఇసికి లేదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



**న్యూఢిల్లీ, మే 27:** ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ప్రక్రియను సుప్రీంకోర్టు సమర్థించింది. ఇదే విచారణలో పౌరసత్వంపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను సవాల్ చేస్తూ >>2

## నేడు సిద్ధరామయ్య రాజీనామా!



కర్ణాటకలో నాయకత్వ మార్పునకు సిద్ధం

ఇక డికె శివ కుమార్‌కు పగ్గాలు

ముగ్గురు డిప్యూటీ సిఎంలుండే అవకాశం

**న్యూఢిల్లీ, మే 27:** దక్షిణాదిలో కీలకమైన కర్ణాటకలో నాయకత్వ మార్పుపై కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలు ఫలించాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను రాజీనామాకు ఒప్పించారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్ గాంధీ, >>2

## మొక్కజొన్న రైతులకు 1173 కోట్లు విడుదల

### లక్షమంది రైతుల ఖాతాల్లో జమ

### జూన్ 3న కోహెడ మార్కెట్‌ను ప్రారంభించనున్న సిఎం

### వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** మొక్కజొన్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మొక్కజొన్న రైతులకు నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. లక్ష మంది రైతుల ఖాతాల్లో రెండు మూడు రోజుల్లో రూ. 1,173 కోట్లు జమ కానున్నట్లు వివరించారు. రాష్ట్రంలో గోడౌన్‌లతో పాటు ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా పొరుగు రాష్ట్రాల్లోని గోదాములు కూడా మొక్కజొన్నను తరలించినట్లు పేర్కొన్నారు. ఈ యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 338 మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు సుమారు 13.42 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను 2.42 లక్షల మంది రైతుల నుండి కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.3757 కోట్లను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున మొక్కజొన్న కొనుగోలు చేయడం ఇదే తొలిసారని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో వెనుకంజ వేసిన పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం కూడా మొక్కజొన్న కొనుగోలు చేయమని చేతులు ఎత్తేసిన సమయంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం రైతులకు భరోసాగా నిలిచిందని గుర్తు చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు తరలించిన మొక్కజొన్నతో పాటు ఇంకా సెంటర్లకు వస్తున్న పంటను కూడా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. జూన్ 3న కోహెడ్ మార్కెట్‌ను సిఎం ప్రారంభించనున్న నేపథ్యంలో కార్యక్రమ ఏర్పాట్లపై వివిధ శాఖల హెచ్‌వోడీలు, రాష్ట్ర స్థాయి అధికారులను నోడల్ అధికారులుగా నియమించినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## అన్ని గ్రామాలకు టిఫైబర్ ఇంటర్నెట్



టీఫైబర్ ప్రాజెక్టు అమలుపై బుధవారం కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి డి. శ్రీధర్ బాబు

### అమెండెడ్ భారత్‌నెట్ కార్యక్రమం కింద తెలంగాణలో ప్రాజెక్టు అమలు

### కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సిఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు విసి చర్చలు

### ఇక నిరంతరం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ లభ్యం

### పెండింగ్ నిధుల విడుదలపై హామీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ (ఏబిపి) కింద తెలంగాణలో టీఫైబర్ ప్రాజెక్టు అమలుపై కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, పరిశ్రమలు,ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రాం సజావుగా అమలు చేసే దిశగా ముఖ్యమంత్రి కొన్ని కీలక అంశాలను సింధియా దృష్టికి తీసుకువెళ్ళారు. అమలుకు సంబంధించిన ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదలను వేగవంతం చేయడం పై చర్చించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై కూడా కేంద్ర మంత్రి సింధియాతో ప్రస్తావించారు. వీటిపై సింధియా సానుకూలంగా స్వీకరించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్, ఉన్నతాధికారులు ఈ >>2


తుమ్మిడిహెట్టిపై చర్చలకు సమయం ఇవ్వండి 2
మహారాష్ట్ర సిఎంకు ముఖ్యమంత్రి రేవంత్ లేఖ


## ఇడ్లీ.. బోండా



### ఇంటర్‌లో విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్‌లో వెరైటీలు..

### వయసుకు తగిన పోషకాలు అందేలా రూపకల్పన

### మధ్యాహ్నా భోజనం.. బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు యేటా

### రూ.180 కోట్ల వ్యయం.. జూన్ 12న ప్రారంభం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** దోశ... పూరి.. మిల్లెట్ ఇడ్లీ... బోండా .. ఉప్మా.. ఇవి హోటల్ మెనూ కాదు.... ఇంటర్మీడియట్ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న బ్రేక్ ఫాస్ట్... చట్నీ, సాంబర్, మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మాతో ఇంటర్మీడియట్ విద్యార్థులకు రుచికరమైన, పోషకాలతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందనుంది. కీలకమైన ఇంటర్మీడియట్ దశలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన బలవర్ధక ఆహారం అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంకల్పించడంతో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతోంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇప్పటి వరకు దేశంలో పాఠశాల విద్యార్థులకే మధ్యాహ్నా భోజన పథకం అమలవుతోంది. కళాశాల విద్యార్థులకు ఏ రాష్ట్రంలోనూ మధ్యాహ్నా భోజన పథకం అమలు చేయడం లేదు. కానీ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థులకు సైతం మధ్యాహ్నా భోజనం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి >>2

## తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేస్తాం



### రైతాంగం ఆందోళన చెందవద్దు

### పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఒందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని సత్వరమే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామన్నారు. అకాల వర్షాలకు తడిసిన 9,214 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇప్పటికే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించినట్లు వెల్లడించారు. అకాల వర్షాలు సంభవించిన నేపథ్యంలో బుధవారం డిప్యూటి సిఎం భట్టి విక్రమార్కతో కలిసి కలెక్టర్లు, పోలీసు అధికారులు, రవాణాశాఖా ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తెలంగాణా రాష్ట్ర రైతాంగానికి నష్టం వాటిల్లే ఏ చర్యలను ప్రభుత్వం చూస్తూ ఊరుకొబోదన్నారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మరోసారి పునరుద్ఘాటించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం రికార్డ్ స్థాయిలో అదీ రబీ సీజన్‌లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించిందని ఆయన తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు 66.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేరగా అందులో 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. రైతులకు ఇప్పటివరకు 10,097 కోట్ల రూపాయలను చెల్లించినట్లు ఆయన వెల్లడించారు.

8.15 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందని వివరించారు. కొనుగోలు చేసిన 57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 44.67 లక్షల మెట్రిక్ టన్నులు సాధారణ రకాల ధాన్యం కాగా 12.33 లక్షల మెట్రిక్ టన్నులు సన్నాలని ఆయన వివరించారు. ఇసుక సరఫరా చేసే లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకు మళ్లించి సత్వరమే ధాన్యాన్ని మిల్లులకు రవాణ చేసేందుకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ముందెన్నడూ లేని రీతిలో 8575 కొనుగోలు కేంద్రా లను ప్రారంభించి రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుంటే రాజకీయాల కోసం ప్రతిపక్షాలు ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియను రార్ధాంతం చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.

## లేటుగా నైరుతి

### జూన్ 4న కేరళంకు రాక.. ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యం



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** భారత వాతావరణ కేంద్రం అంచనాలు పూర్తిగా తప్పాయి. సాధారణంగా ప్రతీయేట జూన్ 1న కేరళలోకి నైరుతి రుతుపవనాల సాంప్రదాయ ఆరంభంగా ప్రవేశిస్తుంటాయి. భారతదేశంలో అత్యంత కీలకమైన వాతావరణ వ్యవస్థ నైరుతి రుతుపవనాలు. ఇవి కేరళకు తాకి అక్కడ వర్షాలు కురిపించిన తర్వాత నాలుగు నెలల పాటు ఉత్తరం వైపు ఇతర రాష్ట్రాల వైపు తమ ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. ఇవి దేశ వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతం వర్షాన్ని అందిస్తాయి.

కానీ ప్రస్తుతం కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకేందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు. దాంతో రుతుపవనాలు జూన్ 1 కంటే మరికాస్త ఆలస్యం కానున్నాయి. అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని తాజాగా ఐఎండీ అంచనా వేస్తుంది. దక్షిణ తీర రాష్ట్రమైన కేరళలోనే రుతుపవనాలు మొదటగా ప్రవేశిస్తాయి. ఇది దేశమంతటికీ ఉపశమనం కలిగించేలా చల్లని గాలులు, వర్షాలు కురిపించే ప్రారంభ సంకేతం. ఎన్‌నినో ప్రభావంతో రుతుపవనాలు ఒక నిర్దిష్ట కాలపట్టిక ప్రకారం నడిచే రైలు కాదని తేలింది. రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించడానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు ఉంటాయి.

కేరళలోని 14 కేంద్రాల్లో కనీసం 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. అలాగే గాలి వేగం, మేఘాల సాంద్రత వంటివి కూడా అనుకూలంగా ఉండాలి. మే 25 నాటికి కేరళలో ఈ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని ఐఎండీ తెలిపింది. లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతాన్ని నమోదు చేయాలి. ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజ, ఎర్నాకుళం జిల్లాల్లో సాధారణంగా కురిసే తొలకరి జల్లులు మాత్రమే పడుతున్నాయి. రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండగా మరోవైపు దేశ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటున్నాయి.

## ఆకస్మిక వానతో అతలాకుతలం



### తడిసిముద్దయిన రైతన్న ఆశలు

### సిద్దిపేటలో రోడ్లపై విరిగిపడిన చెట్లు

### సిరిసిల్లలో ఎగిరిపోయిన టార్పాలిన్లు

### అచ్చంపేట, కరీంనగర్‌లో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

### తడిసిన ధాన్యాన్ని బేషరతుగా కొనాలని రైతుల డిమాండ్



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** మండే ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న జనానికి మంగళవారం అర్ధ రాత్రి కురిసిన వర్షం కాస్త చల్లదనంతో ఉపశమనం కలిగిస్తే ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు కురిసిన అదే అకాలవర్షం అన్నదాతలను నిండా ముంచేసింది. రెండు రోజులుగా ఎండలతో అల్లాడిపోయిన తెలుగు రాష్ట్రాల ప్రజలకు అర్ధరాత్రి వేళ వాతావరణం చల్లబడి ఉపశమనం లభించినప్పటికీ అవే వర్షాలు రైతన్నల గుండెల్లో మాత్రం మంటలు రేపాయి. పలు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో అకాల వర్షం కురిసింది. దీంతో మార్కెట్ యార్డుల్లో, రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటలు నీటిపాలయ్యాయి. ఆరుగాలం కష్టపడి, చెమటోడ్చి పండించిన పంట కళ్ల ముందే వరద పాలవడంతో రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారుల నిరక్ష్యం ఒకవైపు, ప్రకృతి కన్నెర >>2



బుధవారం తిరువనంతపురంలోని విజయన్ నివాసంలో సోదాలు పూర్తిచేసి వెళ్తున్న ఇడి అధికారుల వాహనాన్ని ధ్వంసం చేసిన నిరసనకారులు

## విజయన్ నివాసంలో ఇడి సోదాలు

### మనీలాండరింగ్ కేసులో 12 చోట్ల తనిఖీలు జరిపిన అధికారులు

### అడ్డుకొన్న సిపిఎం కార్యకర్తలు, ఘర్షణల్లో పలువురికి గాయాలు

**తిరువనంతపురం, మే 27:** మనీలాండరింగ్ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులుచేసారు. రాష్ట్రవ్యాప్తంగా 12 కీలక ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు జరుగుతుండడంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేగింది. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన కేంద్ర దర్యాప్తు సంస్థ అధికారులు ఉదయాన్నే ఈ మెరుపు సోదాలు చేపడుతున్నారు. ప్రస్తుత ప్రతిపక్ష నేతగా ఉన్న విజయన్‌కు చెందిన తిరువనంతపురంలోని అద్దె ఇల్లు, కన్నూరులోని సొంతనివాసంలో సోదాలు జరుగుతున్నాయి. >>2

## గాంధీభవన్‌లో బాహాబాహీ

### ఫిరోజ్‌ఖాన్‌ను కిందపడేసిన ఉస్మాన్ అల్‌హాజ్రీ

**హైదరాబాద్,మే27,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్,అజారుద్దీన్ ముందే బుధవారం కాంగ్రెస్ నేతలు బాహాబాహీకి దిగి రణరంగం సృష్టించడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.



బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో కాంగ్రెస్ నేతలు పరస్పరం ఘర్షణకు దిగడంతో వాతావరణం ఒక్కసారిగా రసాభాసగా మారింది. అజహరుద్దీన్ పక్కన కూర్చొనే అంశంతో కార్వాన్ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అల్ హజ్రా, ఫిరోజ్‌ఖాన్ మధ్య ప్రోటోకాల్ వివాదం మొదలైంది. ఫిరోజ్ ఖాన్, ఉస్మాన్ హాజారీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు ఆగ్రహంతో >>2

# తుమ్మిడిహెట్టిపై చర్చలకు సమయం ఇవ్వండి

## మహారాష్ట్ర సిఎంకు ముఖ్యమంత్రి రేవంత్ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే27:** తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు బుధవారం సాయంత్రం ఓ లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాల్సి ఉంది. మొదటి ప్రతిపాదనలో ఈ బ్యారేజ్ 152 మీటర్ల ఎత్తు నిర్మించాలనుకున్నారు. 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని కూడా మహారాష్ట్ర అప్పట్లో తెలిపింది. ఇటీవల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని పున: సమీక్షి ంచింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఉత్తర తెలంగాణ నీటి అవసరాలకు సరిపోదని నిపుణుల సూచనలతో అంచనాకు వచ్చింది. అందుకే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సాగునీరు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తుపై మరోసారి చర్చ అవసరమని సీఎం రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు. 148 మీటర్ల కంటే కొంత ఎక్కువ ఎఫ్ఆర్ఎల్ పరిశీలించినా, మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని సీఎం వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీటిని తెచ్చుకునే వీలుందని ప్రస్తావించారు మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్‌తో జరిగే సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారెజిని 152 మీటర్ల ఎత్తుతో కుదరని పక్షంలో 150 మీటర్ల ఎత్తుతో నిర్మాణానికి ఒప్పించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. 100 టీఎంసీల నీటి వినియోగమే లక్ష్యంగా సిఎం రేవంత్ ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం తుమ్మిడిహెట్టి బ్యారెజి నిర్మాణానికి మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుకు మాత్రమే అంగీకరించింది. అయితే ఆ ఎత్తుతో తగిన స్థాయిలో నీటి వినియోగం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఇరిగేషన్ నిపుణుల అంచనా ప్రకారం 150 మీటర్ల ఎత్తుతో బ్యారేజ్‌ను నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల గోదావరి జలాలను వినియోగించుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. అదే సమయంలో 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనతో పోలిస్తే 150 మీటర్ల ఎత్తుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం కూడా తక్కువగా ఉంటుందని సాంకేతిక నివేదికలు సూచిస్తున్నాయి. అవసరమైతే మహారాష్ట్ర ముంపు ప్రభావిత ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు కూడా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్‌కు సిఎం రేవంత్ హామీ ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణం ద్వారా ఆదిలాబాద్ సహా ఉత్తర తెలంగాణ ఎత్తైన ప్రాంతాలకు సాగునీరు, తాగునీటి సదుపాయం కల్పించడమే కాకుండా, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా నీటిని తరలించొచ్చని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది.



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన తమిళ సిఎం విజయ్

## ప్రధాని మోడీతో సిఎం విజయ్ భేటీ

**న్యూఢిల్లీ,మే 27:** తమిళనాడు ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ ఢిల్లీలో తొలిసారి జరుపుతున్న అధికారిక పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని సేవతీర్థ్‌లో బుధవారంనాడు కలుసుకున్నారు. ఉభయులూ 25 నిమిషాల సేపు సమావేశమయ్యారు. చోళుల కాలం నాటి రాగి శాసనాలకు పోలెండ్ నుంచి భారతదేశానికి రప్పించినందుకు మోడీకి విజయ్ కృతజ్ఞతలు తెలిపారు. కర్ణాటక ప్రకటించిన మేకేదాతు డ్యామ్ ప్రాజెక్టు, దిగువ ప్రాంతాలపై దాని ప్రభావాన్ని విజయ్ ప్రధాని దృష్టికి వెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ముందుగా రాష్ట్ర గీతం పాడేందుకు అనుమతించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం విజయ్‌నేరుగా తమిళనాడు హౌస్‌కు చేరుకోవడంతో గౌరవ వందనంతో ఆయనకు సాదర స్వాగతం లభించింది. తమిళనాడు సీఎంగా విజయ్ అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఢిల్లీకి రావడం ఇదే ప్రథమం.

## 'సర్' చట్ట బద్ధమే

>> దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం బుధవారం విచారణ జరిపింది. న్యాయస్థానం ఓటరు జాబితా నుంచి ఒక వ్యక్తి పేరును తొలగించినంత మాత్రాన అతని పౌరసత్వం రద్దయినట్లు కాదని స్పష్టంచేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీచేసింది. ఓటరు జాబితా సవరణ కేవలం ఎన్నికల్లో పాల్గొనేందుకు మాత్రమే పరిమితమని పేర్కొన్నది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బీహార్‌లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించిందని చెప్పలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేకానీ ఒక వ్యక్తి పౌరసత్వాన్ని నిర్ధారించే హక్కు ఈసీకి లేదని తెలిపింది. పౌరసత్వంపై అనుమానంతో ఓటరు జాబితాలో పేరు చేర్చాలా వద్దా అని నిర్ణయించే అధికారం మాత్రమే ఎన్నికల సంఘానికి ఉందని స్పష్టంచేసింది. ఓటరు జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను మాత్రం కేంద్ర హోంశాఖకు పంపాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఈ వివరాలను నాలుగు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలని తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈ తీర్పుతో గత కొంతకాలంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు తెరపడింది. కేంద్ర ప్రభుత్వం ఈ వివరాలను అందుకున్న తర్వాత పౌరసత్వ చట్టం 1955 ప్రకారం ఆయా వ్యక్తుల పౌరసత్వ క్లెయిములపై విచారణ జరపాలని కోర్టు సూచించింది. తదుపరి అసెంబ్లీ లేదా స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే ఈ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఒకవేళ విచారణలో వారు భారత పౌరులని తేలితే వెంటనే వారి పేర్లను మళ్లీ ఓటరు జాబితాలో పునరుద్ధరించాలని మార్గదర్శకాలు జారీ చేసింది.

## ఇడ్లీ.. బోండా

>> నిర్ణయం తీసుకున్నారు. ఫలితంగా దేశంలోనే తొలిసారి ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించనున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. ఇంటర్ విద్యార్థులకు ఎందుకు ప్రాధాన్యం...పెద్ద గ్రామాలు, మండల కేంద్రాల్లో ఉన్నత పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు పదో తరగతి వరకు ఎటువంటి ఆటంకం లేకుండా విద్యాభ్యాసం చేస్తున్నారు. జూనియర్ కళాశాలలు మండల కేంద్రాలు, ఆపై స్థాయి పట్టణాలు, నగరాల్లోనే ఉండడంతో గ్రామాలు, తండాలు, ఆదివాసీ గూడేల నుంచి విద్యార్థులు కళాశాలలకు వెళ్లడం కష్టమవుతోంది. ఉదయం సమయానికి బ్రేక్‌ఫాస్ట్ చేసే పరిస్థితి లేకపోవడం, బ్రేక్‌ఫాస్ట్ చేసిన మధ్యాహ్న భోజనం తీసుకెళ్లేందుకు సమయం లేకపోవడంతో అర్ధాకలితో విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ఈక్రమంలోనే చాలా మంది కళాశాల విద్యకు దూరమవుతున్నారు. దానికితోడు ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధికులు బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే.. ఆయా కుటుంబాల్లోని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదోతరగతి తర్వాత చదువు మానేసి పనులకు వెళుతున్నారు.. ఈ నేపథ్యంలో పదోతరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నారు. జాతీయ పోషకాహార సంస్థ సిఫార్సులకు అనుగుణంగా...ఇంటర్మీడియట్ చదివే వారి వయస్సు 15 నుంచి 18 మధ్య ఉంటుంది. ఇది కౌమార దశ.. విద్యార్థినీ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఎదిగే దశ.. ఈ వయస్సులో వారికి పోషకాలతో కూడిన ఆహారం అవసరం.. జాతీయ పోషకాహార సంస్థ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రూషన్) సిఫార్సుల ప్రకారం.. కౌమార దశలోని వారికి రోజుకు 1029 కిలో కేలరీలు 3032 గ్రాముల ప్రోటీన్ అవసరం. ఎన్ఐఎన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యార్థులకు తగినంతగా పోషకాలు అందించేలా బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకానికి రూపకల్పన చేసింది. ఎన్ఐఎన్ సిఫార్సుల మేరకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు అందించే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న పోషకాహారం లోపాలు, విటమిన్ లోపాలు, ఐరన్ డెఫిషీయన్సీని అధిగమించే అవకాశం ఉంటుంది.

## విజయన్ నివాసంలో ఇడి సోదాలు

>> మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ చర్యలు తీసుకుంటున్నారు. ఇవే కాకుండా సీఎంఆర్ఎల్ ఎండీ శశిధరన్ ఇల్లు, మాజీ మంత్రి మహమ్మద్ రియాజ్ నివాసాల్లోనూ విచారణ సాగుతోంది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అనే ప్రైవేట్ సంస్థ నుంచి విజయన్ కుమార్తె వీణా విజయన్ అక్రమంగా డబ్బులు పొందినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆమెకు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ఐటీ సంస్థ ఎలాంటి సేవలు అందించకపోయినా రూ.1.72 కోట్లు చెల్లించినట్లు సమాచారం. ఈ నిధుల బదిలీపైనే ఇప్పుడు ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసు విచారణను నిలిపివేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ యాజమాన్యం కేరళ హైకోర్టును ఆశ్రయించింది. అయితే హైకోర్టు సింగిల్ బెంచ్ ఆ పిటిషన్లను తోసిపుచ్చింది. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సమయం కావాలన్న కంపెనీ విజ్ఞప్తినీ న్యాయస్థానం తిరస్కరించడంతో ఈడీ అధికారులు రంగంలోకి దిగారు.

**ఇడిపై సిపిఎం కేడర్ ప్రతిఘటన!**

తిరువనంతపురంలో ఉన్న విజయన్ అద్దె ఇంటి ముందు ఇవాళ భారీ ఎత్తున సీపీఎం కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. బేకరీ జంక్షన్ వద్ద ఉన్న ఆ ఇంటి ముందు .. ఈడీ వాహనాన్ని సీపీఎం కార్యకర్తలు ధ్వంసం చేశారు. హెల్మెట్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, రాళ్లతో అటాక్ చేశారు. అక్కడ మోహరించిన సిబ్బందిపై దాడి చేశారు. ఈడీ సోదాలు కొనసాగిస్తున్న సమయంలో ఈ తతంగం జరిగింది. తనిఖీలు జరుగుతున్న సమయంలో ఉదయం నుంచి విజయన్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు ఇంట్లోనే ఉన్నారు. వందల సంఖ్యలో పార్టీ కార్యకర్తలు విజయన్ ఇంటికి దూసుకొచ్చారు. ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఇంటి ఆవరణలో రక్షణగా ఉన్న బలగాలపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. సీనియర్ సీపీఎం నేతలు వారిని అదుపులోకి తెచ్చారు.

## వారం - వర్జ్యం

28-05-2026, అధికజ్యేష్ఠ గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, మృగశిర కార్తె
ద్వాదశి ఉ.7.58
చిత్త ఉ.8.09
వర్జ్యం : మ.2.20-సా.4.06
దు.ఉ.9.55-ఉ.10.47,2)మ.3.07-మ.3.59
శుభసమయం : ఉ.8.00-8.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** అధికారులతో, సహోద్యోగులతో ఇష్టం లేకపోయినా స్నేహభావముతో మెలగుతారు. విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**వృషభం:** భూమి, వాహన, యంత్ర, గృహ సంబంధమైన కొనుగోలు ఒప్పందములు సానుకూలపడతాయి. బంధువుల కలయిక.

**మిథునం:** అధికారికముగా, సంపూర్ణముగా ప్రారంభించి, విజయపథములో నడిపించు యత్నములు కొద్దిగా వేచి ఉండాలి.

**కర్కాటకం:** సహోద్యోగులు, ఇతర సిబ్బందికి మీ మనస్తత్వము అర్థము గాక ప్రస్తుతము మిమ్ములను అంటిపెట్టుకునే ఉంటాయి.

**సింహం:** ఓ చోట వడ్డీ రాని స్థితిలో వేరొక చోట వడ్డీలను చెల్లిస్తూ ధనమును తెచ్చుకొని అసంతృప్తికి గురిఅవుతారు.

**కన్య :** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండటం మంచిది. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**తుల:** ఉన్నతాధికారుల నుండి అవసరమైన సహాయం అందకపోవచ్చును. ఆత్మీయులతో పుణ్యక్షేత్ర సందర్శనము చేసుకుంటారు.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులకు కావలసిన వాహన సౌకర్యము లభించక ఇబ్బందిని పడవలసి వస్తుంది. బంధువుల కలయిక.

**ధనుస్సు:** విద్యా సంబంధిత విషయములకును, ఉద్యోగ దరఖాస్తులను చేయు ప్రయత్నములకు మంచి ఫలితములు వస్తాయి.

**మకరం:** అంతము లేని ఆలోచనలతో మీ మనస్సు ఆందోళనలకు గురికావచ్చును. ధైర్యముగా ముందుకు వెళ్ళండి.

**కుంభం:** దూరప్రాంతముల నుండి వచ్చే వార్తల వలన మీ కార్యక్రమములు సానుకూలపడతాయి. వస్త్రలాభం కలదు.

**మీనం:** దైవానుగ్రహము లభించుట వలన మీరు ఏ కార్యక్రమములను చేపట్టినా ఎట్టి ఆటంకాలు లేకుండా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## గాంధీభవన్‌లో బాహాబాహీ

>> ఊగిపోతూ, చివరకు ఒకరి చొక్కాలు మరొకరు పట్టుకొని పరస్పరం దాడులతో నెట్టుకొన్నారు.ఉస్మాన్ అల్ హజ్రీని నెట్టివేయడంతో ఉస్మాన్ హాజారీ ఆవేశంతో వెంటనే ఫిరోర్‌ఖాన్‌ను చెంపదెబ్బ కొట్టడంతో కింద పడిపోయారు. మంత్రులు, సీనియర్ నేతల సమక్షంలోనే నేతలు భౌతిక దాడులకు దిగడం పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ సమక్షంలోనే ఈ గొడవ జరుగుతుండటంతో వారు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఇరువర్గాల నేతలు శాంతించ లేదు.ఈ గొడవ మరింత పెద్దది కాకుండా ఉండేందుకు అక్కడే ఉన్న సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు వెంటనే జోక్యం చేసుకుని ఇరువర్గాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే, ఆవేశంలో ఉన్న నేతలు వీహెచన్ను కూడా పక్కకు తోసేసేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కింది.పొట్లాకు దిగిన ఇద్దరిని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు ను కూడా పక్కకు నెట్టిసినారు. దీంతో వారు తీవ్ర అసహనానికి గురైనారు. అంతేకాదు సీనియర్ నేతల సమక్షంలోనే ఈ రసాభాస జరగడంతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు ఒక్కసారిగా షాక్కు గురయ్యాయి. వెంటనే అప్రమత్తమైన మిగతా కాంగ్రెస్ నాయకులు, భద్రతా సిబ్బంది మధ్యలో దూరి ఇరువర్గాలను విడదీయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. రసాబాసా సద్దుమణగక ముందే హాజారుద్దీన్ సమావేశం నుంచి నిష్క్రమించారు. పొన్నం ప్రభాకర్ సమావేశం ముగిసనట్లు ప్రకటించారు.

**గతొడవ సద్దుమణిగింది : పొన్నం**

"గాంధీ భవన్‌లో సర్ మ్యాపింగ్ పై జరిగిన సమావేశంలో కాంగ్రెస్ నాయకుల మధ్య చోటుచేసుకున్నది కేవలం చిన్న అపార్థమే తప్ప, బయట ప్రచారం జరుగుతున్నట్లుగా ఎలాంటి పెద్ద సంఘటన జరగలేదనీ మంత్రి పొన్నం ప్రభాకర్ వివరణ ఇచ్చారు ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం కేంద్ర ప్రభుత్వం సర్ పేరిట ఓటర్ జాబితాలోని పేర్లను అక్రమంగా తొలగించే ప్రయత్నాలు చేస్తుంది , అలాంటి చర్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేయాలని ,ప్రతి నియోజకవర్గంలో బిఎల్ఎలతో సమన్వయం చేసుకుని అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా అప్రమత్తంగా పనిచేయాలని నేతలకు సూచించడం జరిగిందనీ పార్టీ అంతర్గత విషయాలను వక్రీకరించి ప్రచారం చేయడం సరైంది కాదనీ తెలిపారు..ఫిరోజ్ ఖాన్ మరియు ఉస్మాన్ ఇద్దరూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న నాయకులనీ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల సమస్యలపై పోరాడే పార్టీ ,అనవసరంగా ఈ అంశంపై రాద్ధాంతం చేయడం మానుకోవాలనికోరారు. , సమావేశం జరిగిన కొద్ది నిమిషాల్లోనే ఇద్దరు నేతలు పరస్పరం మాట్లాడుకొని కౌగిలించుకుని కలిసిపోయారనీ ఆయన తెలిపారు .కాంగ్రెస్ పార్టీ ఐక్యతను దెబ్బతీయాలనే ఉద్దేశంతో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను మానుకోవాలనీ ఆయన కోరారు.



దేశంలోని మిగిలిన ప్రాంతాల కంటే ఒక రోజు ముందుగా బుధవారం జమ్మూలో ఈద్ అల్ అధా వేడుకలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

## వానతో అతలాకుతలం

>> ఇంకోవైపు కలిసి తమ పొట్ట గొట్టాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో అర్ధరాత్రి వర్షం దంచికొట్టింది. సిద్దిపేట (గజ్వేల్), రాజన్న సిరిసిల్ల, నాగర్‌కర్నూల్, కామారెడ్డి, సంగారెడ్డి, కరీంనగర్, యాదాద్రి జిల్లాల్లో జడివాన కురిసింది. వర్ష బీభత్సానికి కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ఆరబోసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులకు, ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్ కవర్లు ఎగిరిపోయాయి. ధాన్యం రాశులపై రైతులు కప్పిన టార్పలిన్ కవర్లు సైతం ఎగిరిపోవడంతో వడ్ల బస్తాలు పూర్తిగా నానిపోయాయి. మరికొన్ని ప్రాంతాల్లో ధాన్యపు రాశులు వరద నీటిలో కొట్టుకుపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ పరిసరాల్లో అత్యధికంగా 11 సెంటీమీటర్ల భారీ వర్షం నమోదైంది. సంగారెడ్డి జిల్లా హత్నూరలో అత్యధికంగా 6.1 సెంటీమీటర్లు, సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం అంగడి కిష్టాపూర్ లో 5 సెంటీమీటర్లు, మెదక్ జిల్లా నర్సాపూర్ పరిధిలోని కాగజ్ మద్దూరులో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నర్సాపూర్, తోప్రాన్, చేగుంట, రామాయంపేట పరిధిలోని కొనుగోలు కేంద్రాలన్నీ జలమయంగా మారాయి. అకస్మాత్తు తుఫాను తరహా భారీ వర్షానికి దుబ్బాక, చౌటుప్పల్, తుర్కపల్లి మార్కెట్ యార్డుల్లోని ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. గజ్వేల్ ఔటర్ రింగ్ రోడ్డు పక్కన రైతులు ఆరబెట్టిన వడ్లు వరద నీటిలో కొట్టుకుపోయాయి. అర్ధరాత్రి వేళ ఏం చేయాలో పాలుపోక, కళ్ళ ముందే కొట్టుకుపోతున్న కష్టాన్ని చూస్తూ రైతులు లబోదిబోమన్నారు. చివరకు తార్పాలిన్ పట్టాలు కప్పుదామన్నా, బలమైన గాలులకు అవి ఎగిరిపోవడంతో అన్నదాతలు నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న తోటలు కూడా ఈ గాలివానకు నేలకొరిగాయి. మరోపక్క కోత దశకు వచ్చిన మామిడి తోటలు కూడా ఈ గాలివానకు దెబ్బతిన్నాయి. కాయలు రాలిపోయి తోటల యజమానులకు కోలుకోలేని నష్టం వాటిల్లింది. "మార్కెట్ యార్డుకు వడ్లు తెచ్చి నెల రోజులు కావస్తోంది. గన్నీ బ్యాగులు ఉంటే లారీలు రావు. లారీలు ఉంటే గన్నీ బ్యాగులు ఉండవు. ఈ తిప్పలు పడలేక ట్రాక్టర్లలో లోడ్ చేద్దామన్నా ఇక్కడ ఖాళీ బండ్లే కనిపిస్తున్నాయి. తీరా ఇప్పుడు అకాల వర్షం ముంచేసింది. కింద నుంచి వరద నీరు వచ్చి ధాన్యం మొత్తం తడిసిపోయింది" అని రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అధికారులు సకాలంలో స్పందించి ధాన్యం కొనుగోలు చేసి ఉంటే వర్షానికి తమ ధాన్యం తడిసేది కాదని కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. పిల్లపాపలను వదిలేసి కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాస్తున్నా తమ బాధను పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు నిబంధనల పేరుతో తరుగు (తూకంలో కోత) తీసుకోకుండా, తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.కేవలం పంట నష్టమే కాకుండా, ఈదురు గాలుల వల్ల పలు చోట్ల చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో అర్ధరాత్రి పలు గ్రామాల్లో చీకట్లు అలుముకున్నాయి. జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

**ఆరెంజ్ అలర్ట్ జారీ...**

రైతులకు ఇప్పట్లో ఊరట లభించేలా కనిపించడం లేదు. రాష్ట్రంలో రాగల రోజుల్లో కూడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో పలు జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. నాగర్‌కర్నూల్, నల్గొండ, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనగాం, కామారెడ్డి, యాదాద్రి భువనగిరి, జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, రంగారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సూర్యాపేట, వరంగల్ హన్మకొండ, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గంటకు 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## నేడు సిద్ధ రామయ్య రాజీనామా!

>> కెసివేణుగోపాల్, రణదీప్ సూర్జేవాలలతో జరిగిన సుదీర్ఘ తర్జనబర్జనల అనంతరం వేరొకరికి అవకాశం ఇవ్వాలని సూచించారు. అయితే తన వర్గంలోని వారికి డిప్యూటి సీఎంలు ఉండాలని సిద్ధరామయ్య పట్టుబట్టారు. రాజ్యసభ ఎంపి పదవితోపాటు రాజ్యసభా పక్షనేతగా కూడా అవకాశం ఉంటుందన్న సంకేతాలు ఇవ్వడంతో సిద్ధరామయ్య మెత్తబడినట్లు తెలుస్తోంది. గురువారం రాష్ట్రగవర్నర్‌ను కలిసి రాజీనామాచేస్తారని ఆయన వర్గీయులే చెపుతున్నారు. అలాగే తన కేబినెట్ మంత్రులతో చివరిసారిగా ఉదయం జరిగే బ్రేక్‌ఫాస్ట్ ఈవెంట్‌లో కూడా పాల్గొంటారని తెలుస్తోంది. ఇక సీఎం పదవికి చూస్తే డిప్యూటి సిఎం డికె శివకుమార్‌తోపాటు కాంగ్రెస్ సీనియర్‌నేత దళిత ఎమ్మెల్యే జి పరమేశ్వర కూడా ఆశిస్తున్నారు. హైకమాండ్ సమీకరణాలను బట్టిచూస్తే 90శాతం శివకుమార్‌నే వరిస్తుందని ఇప్పటికే ఖరారయిందని తెలుస్తోంది. మే 30వ తేదీ శనివారంనాడు కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల తాజా సమాచారం. కొత్త మంత్రివర్గంలో ముగ్గురు ఉప ముఖ్య మంత్రులకు చోటు కల్పిస్తారని తెలుస్తోంది. వీరిలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన ఒకరు, ఓబీసీ వర్గానికి చెందిన మరొకరితో పాటు ఒక మహిళ ఉంటారు. కర్ణాటకలో నాయకత్వ మార్పునకు మార్గం సుగమం చేయాలని, జాతీయ స్థాయిలో కీలకమైన సంస్థాగత బాధ్యత చేపట్టాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను పార్టీ అధిష్ఠానం కోరినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. రాహుల్ గాంధీ నుంచి నేరుగా ఈ సందేశం రావడంతో సిద్ధరామయ్య సైతం పదవి నుంచి తప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఈనెల 28న అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్‌ను సిద్ధరామయ్య కోరారు. అదేరోజు తన రాజీనామా పత్రాన్ని అందజేసి, తన డిప్యూటీ డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమం చేస్తారు. గురువారంనాడు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని గవర్నర్‌ను ముఖ్యమంత్రి కోరిన మాట నిజమే అని సిద్ధరామయ్య సన్నిహితుడు ఒకరు తెలిపారు. సిద్ధరామయ్య పదవి నుంచి తప్పుకోనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో తన క్యాబినెట్ మంత్రులతో బ్రేక్‌ఫాస్ట్ మీట్‌ను ఉదయం ఏర్పాటు చేయనున్నట్టు అధికారిక వర్గాల సమాచారం. ఢిల్లీలో ఉన్న డీకే శివకుమార్ బుధవారం మధ్యాహ్నం బెంగళూరు చేరుకుని తిరిగి గురువారం హస్తినకు వెళ్తారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగే బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో పాల్గొనే అవకాశం ఉంది. శివకుమార్ సీఎంకావడంతోపాటు అదే సమయంలో మంత్రివర్గంలో కూడా భారీ మార్పులు, చేర్పులు జరగబోతున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం తన నిర్ణయాలనుకూడా రాష్ట్రనేతలకు తెలియజేసింది. గురువారం, మే 28న సిద్ధరామయ్య రాజీనామా చేస్తారు. మే 30న డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. సీఎంగా డీకేతోపాటు మంత్రులు కూడా ప్రమాణం చేస్తారు. ఇదే సమయంలో ముగ్గురిని డిప్యూటీ సీఎంలుగా తీసుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించిందని రాష్ట్రనేతలకు సంకేతాలందాయి. ఒక ఎస్సీ అభ్యర్థి, ఒక ఓబీసీ అభ్యర్థి, ఒక మహిళకు డిప్యూటీ సీఎం పదవులు ఇస్తారు. ఒక మైనారిటీకి కూడా డీసీఎంగా అవకాశం కల్పించే అవకాశం ఉంది. డిప్యూటీ సీఎం పదవుల విషయంలో ప్రస్తుతం కొందరి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. జి.పరమేశ్వర లేదా ప్రియాంక్ ఖర్గే (ఎస్సీ), యతీంద్ర సిద్ధరామయ్య (ఓబీసీ), ఎంబీ పాటిల్ లేదా ఈశ్వర్ ఖండ్రే (లింగాయత్), కేజీ జార్జ్ లేదా యూటీ ఖాదర్ లేదా జమీర్ అహ్మద్ ఖాన్ (మైనారిటీ) పేర్లను అధిష్టానం పరిశీలిస్తోంది. సిద్ధరామయ్య తనయుడికి డీసీఎం పదవి లేదా మంత్రివర్గంలో చోటు కల్పిస్తామన్న హైకమాండ్ హామీతో సిద్ధరామయ్య తనపట్టును సడలించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే సిద్ధరామయ్య గురువారం గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరారు. ఆయనను కలిసి తన రాజీనామా సమర్పిస్తారు. శనివారం కర్ణాటకలో డీకే ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. అయితేనాయకత్వ మార్పిడిపైనా, సీఎం అభ్యర్థిఎవరన్న అంశంపైనా కాంగ్రెస్ హైకమాండ్‌మాత్రం అధికారిక ప్రకటన ఏదీ విడుదలచేయలేదు.

## టిఫైబర్ ఇంటర్నెట్

>> వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ దార్శనికతపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ లక్ష్యం సాధించడానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ కోసం భవిష్యత్తును తీర్చిదిద్దే బలమైన నెట్‌వర్క్‌కోసం ఒక స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడం, కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకోవడంతో, నిజమైన డిజిటల్ తెలంగాణకు పునాది పడనుంది. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ వెన్నెముక వైపు నిర్ణయాత్మకంగా ముందుకు సాగుతోంది. టీ ఫైబర్ నెట్‌వర్క్ ప్రతి గ్రామ పంచాయతీని రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా అనుసంధానించనుంది. రింగ్ ఆర్కిటెక్చర్ ద్వారా ఒక మార్గం లో అంతరాయం ఏర్పడినా, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా సేవలు నిరంతరం కొనసాగుతాయి. తద్వారా గ్రామీణ తెలంగాణకు నిజమైన నిరంతర హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ అందనుంది.మొదటి దశలో దెబ్బతిన్న నెట్‌వర్క్ ఉన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీ పునరుద్ధరణ చేపట్టనున్నారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద ఈ గ్రామాలను ఆధునిక, భవిష్యత్తు అవసరాలకు సరిపడే ఫైబర్ మౌలిక సదుపాయాలతో రాష్ట్రంలోనిమిగతాప్రాంతాలతోసమానంగా అనుసంధానిస్తారు.

# పోలీసు కస్టడీకి బండి భగీరథ్

## మొదటి రోజు విచారణలో మొయినాబాద్ ఫాంహౌస్‌లో దర్యాప్తు



హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: మైనర్ బాలికపై లైంగికదాడి కేసుకు సంబంధించి నమోదైన ఫోక్సో కేసు లో నిందితుడుగా వున్న బండి భగీరథ్‌ను సిట్ అధి కారులు బుధవారం ఉదయం చర్లపల్లి జైలు నుంచి తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఉదయం పది గంటల సమ యంలో సిట్ అధికారులు జైలుకు వెళ్లి కోర్టు ఉత్తర్వులను జైలు అధికారులకు అందించి భగీరథ్‌ను తమ కస్టడీలోకి తీసుకుని నేరుగా గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం మొదట ఫోక్సో కేసు నమోదైన పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించి అక్కడ కొద్ది సేపు విచారించారు. అనంతరం భగీరథ్‌ను బాలికపై అస భ్యకరంగా ప్రవర్తించిన మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల అరణ్య ఫాంహౌస్‌కు తరలించారు. భగీరథ్‌పై మొ దట మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవ ర్తించినందుకు ఫోక్సో కేసు నమోదవడం తెలి సిందే. నిబంధనల మేరకు భగీరథ్ పై మొయి నాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమో దు కావా ల్సి వున్నా బాధిత బాలిక కొంపల్లి ప్రాంతంలో వుండడంతో ఆమె ఫిర్యాదు మేరకు పే ట్ బషీరాబాద్ స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. దీని తరువాత బాధిత బాలిక వాంగ్మూలం మేరకు భగీరథ్‌పై లైంగిక దాడికి సంబంధించిన సె క్షన్‌ను జోడించారు. దీని తరువాత పోలీసులకు దొరకకుండా పారిపోయిన భగీరథ్ హైకో ర్టులో మధ్యంతర బెయిల్‌కు యత్నించి విఫలమై వార ం రోజుల తరువాత అరెస్టయిన విదితమే. అప్పటి నుంచి భగీరథ్ చర్లపల్లి జైల్లో రిమాండు ఖైదీగా వున్నారు. కాగా ఈ కేసులో మరింత స మాచారం కోసం భగీరథ్ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకోగా అందులోని సమాచారం ధ్వంసం అయి వుండడంతో అతనిపై సాక్ష్యాలు, ఆధారాలను నాశనం చేసినందుకు మరో సెక్షన్‌ను జోడించారు. ఈ కేసులో మరింత సమాచారం రాబట్టేందుకు భగీరథ్‌ను వారం రోజుల కస్టడీ కి కోరగా మల్కాజిగిరి ఫోక్సో కోర్టు మూడు రోజులకు అనుమ తించింది. మొదటి రోజు బుధవారం ఏడు గంటలకు పైగా భగీరథ్‌ను సిట్ అధికారులు విచారించారు. విచారణలో భాగంగా మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో గల అరణ్య ఫాం హౌస్‌కు తరలించి అక్కడ నాలుగు గంట లకు పైగా ప్రశ్నించారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీన ఈ ఫాం హౌస్‌లో జరిగిన నూతన ఏడాది వేడుకల సందర్భంగా బాధిత బాలికతో భగీరథ్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆరోప ణలు రాగా ఇవి నిజమని పోలీసుల విచారణలో తేలడం తెలిసిందే. భగీరథ్‌ను విచారించే క్రమం లో ఫాం హౌస్ నిర్వాహకులతో పాటు పార్టీ జరిగిన సమయంలో వున్న వారిలో కొందరిని పోలీసులు పిలిపించి వారి సమక్షంలో దర్యాప్తు చే సినట్లు తెలిసింది. ఫాం హౌస్ నిర్వాహకులను భగీరథ్‌తో కలిపి ఒకసారి వేరు వేరుగా మరోసారి సిట్ అధికారులు విచారించినట్లు సమాచారం . ఫాం హౌస్‌లో అన్ని ప్రాంతాలకు భగీరథ్‌ను తీసుకువెళ్లి డిసెంబరు 31వ తేదీ రాత్రి ఏం జరిగిందని దానిపై అనేక కోణాల్లో ప్రశ్నించినట్లు తె లిసింది. సిట్ అధికారుల ప్రశ్నలకు భగీరథ్ మొదట సరైన సమాధానం ఇవ్వలేదని, అయితే పదే పదే ప్రశ్నించడంతో మౌనం వహించినట్లు స మాచారం. ఈ విచారణ తరువాత భగీరథ్‌కు వ్యతిరేకంగా కొన్ని సాక్ష్యాలు లభించినట్లు తెలిసింది. విచారణ సమయంలో ఫాం హౌ స్ వద్ద స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి ఇతరులు రాకుండా చూశారు. ఫాం హౌస్‌లో విచారణ తరువాత భగీరథ్‌ను నేరుగా షా పూర్‌నగర్‌లో గల సిట్ డిసిపి రితిరాజ్ కార్యాలయానికి తరలించారు. అక్కడ మరో రెండు గంటలకు పైగా విచారించి ఆ తరువాత పేట్ బషీరా బాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. భగీరథ్‌ను గురు, శుక్రవారాల్లో కూడా విచారిం చనున్నారు.

## బక్రీద్ సందర్భంగా మీర్‌ఆలం ఈద్‌గాహ్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ పురస్క రించుకుని గురువారం పాతబస్తీలోని మీర్ ఆలం ఈద్‌గాహ్ వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఆంక్షల వివరాలు ఇలా వున్నాయి.

1. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్‌ల నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వాహనాలను సమీపంలో కేటాయించిన పార్కింగ్ కేంద్రాలలో నిలపాల్సి వుంటుంది. ఈ సమయంలో ఈ మార్గాలలో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. 2. శివరాంపల్లి, హసన్‌నగర్ నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వాహనా లను సమీపంలో కేటాయించిన పార్కింగ్ కేం ద్రాలలో నిలపాల్సి వుంటుంది. ఈ సమయంలో ఈ మార్గాలలో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు.
3. కాలాపత్తర్, మీర్ ఆలం ట్యాంక్ ప్రాంతం నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వా హనాలను సమీపంలో కేటాయించి న పార్కింగ్ కేం ద్రాలలో నిలపాల్సి వుంటుంది. ఈ సమయంలో ఈ మార్గాలలో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. కాగా ఈద్‌గాహ్‌లో ప్రార్థనలు జరిగే సమయంలో ఈ సమయంలో ఆరాంఘర్ నుంచి పురానాపూల్ మార్గంలో రెండు వైపుల సాధారణ ట్రాఫిక్ ను నిలిపి వేస్తారు. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను ఇతర మార్గాలగుండా మళ్లిస్తారు. ఈద్ గాహ్ వద్ద ప్రార్థనలకు వచ్చేవారు ట్రాఫిక్ పోలీసులకు సహకరించా లని అత్యవ సర సమయంలో 9010203626 నంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు.

## సిఎం రేవంత్ బక్రీద్ శుభాకాంక్షలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27: త్యాగనిరతి, దైవభక్తికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్హా) పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి సిద్ధపడిన గొప్ప సంఘటనను స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈపండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని సీఎం గుర్తు చేశారు. బక్రీద్‌పండుగ మనిషికి త్యాగం, దాతృత్వం, విశ్వాసం, మానవ త్వం వంటి గొప్ప విలువలను గుర్తుచేస్తుందని అన్నారు. జీవితంలో ఎలాంటి కష్టాలు ఎదురైనా దేవుడిపై నమ్మకంతో సన్మార్గంలో ముందుకు సాగాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తోందని తెలిపారు. తమకు ఉన్నదాంట్లో కొం తైనా అవసరమైన వారికి పంచిపెట్టడం కన్నా గొప్ప దానం మరొకటి లేదనే స్ఫూర్తిని బక్రీద్ ప్రపంచానికి చాటిచెబుతోందని సిఎం పేర్కొన్నారు.

## పట్టాలపైకి దేశంలో తొలి హైడ్రోజెన్ రైలు

### హింద్ సోనిపట్ మార్గంలో పైలట్ రన్



న్యూఢిల్లీ, మే 27: దేశంలోనే తొలి హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాల జీతో నడిచే రైలును ప్రవేశపెట్టేందుకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. ఉత్తర రైల్వే పరిధిలోని జింద్‌సోనిపట్ మార్గంలో 10 బోగీలతో కూడిన ఈ హైడ్రోజన్ రైలును నడపనున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ రైలు గంటకు 75 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణిస్తుంది. దీనికోసం 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థను ఉపయో గిస్తున్నారు. ఈ టెక్నాలజీలో హైడ్రోజన్‌ను ఉపయోగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ ప్రక్రియలో కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలు వడుతుంది. దీంతో సంప్రదాయ ఇంధనాలతో పోలిస్తే కాలుష్యం పూర్తిగా ఉండదు. ఈ చొరవతో హైడ్రోజన్ టెక్నాలజీని రైల్వే రంగంలో పరీక్షిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి అతికొద్ది దేశాల సరసన భారత్ చేరింది. హర్యానాలోని జింద్‌సోనిపట్ మార్గాన్ని ఈ పైలట్ ప్రాజెక్టు కోసం ఎంపిక చేశారు. రైలుకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనాన్ని నింపేం దుకు జింద్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రీఫ్యూయలింగ్, నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో కంప్రెస్డ్ హైడ్రోజన్ గ్యాస్ నిల్వ, పంపిణీ కోసం పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (పీఈఎస్‌ఓ) నుంచి అవసరమైన లైసెన్సు కూడా లభించింది. ప్రయా ణికుల భద్రతకు రైల్వే అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జింద్‌లోని రీఫ్యూ యలింగ్ కేంద్రంలో హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లతో సహా పలు భద్రతా సెన్సార్లను ఏర్పాటు చేశారు. రైలు నిర్వహణ కోసం షకుర్‌బస్తీలో ఏర్పాటు చేయనున్న ఫెసిలిటీలో కూడా కఠినమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయనున్నారు.

# ఉల్లి రైతుల కన్నీరు



### దేశ వ్యాప్తంగా భారీగా పడిపోయిన ధర

### రహదారిపై ఉల్లిని పారబోసి రైతుల నిరసన

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: పంట చేతికొస్తే నట్టింట లక్ష్మి తాండవిస్తుందని ఆశపడిన ఉల్లి రైతులకు కన్నీరే మిగిలింది. ఎన్నో ఆశలతో ఉల్లి పంటను మార్కెట్‌కు తరలిస్తే పరిస్థితి తలకిం దులైంది. మార్కెట్‌లో ధరలను చూస్తే కనీసం పెట్టుబడి మేరకైనా ఆదాయం వచ్చే అవకాశం లేకపోవడంతో రెక్కలు ముక్కలు చేసుకుని రైతులు పండించిన ఉల్లిపాయలు చివరకు రోడ్డు పాలవుతున్నాయి. మార్కెట్‌లో ధరలు ఘోరంగా పడిపోవడంతో దేశవ్యాప్తంగా ఉల్లి రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. తెలంగాణతోపాటు, ఎపి, మహారాష్ట్రలో ఉల్లిసాగు చేసిన రైతుల పరి స్థితి దారుణంగా ఉంది. మహారాష్ట్రలోని గంగాపూర్ వ్యవసాయ మార్కెట్‌లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అక్కడ క్వింటాల్ ఉల్లి పాయలకు వ్యాపారులు కేవలం రూ.125 మాత్రమే పలుకుతోంది. అంటే కిలో ఉల్లిపాయ కేవలం రూపాయి పావలాగా ఉంది. ఈ ధర చూసిన రైతులకు గుండె ఆగినంత పనవుతోంది. కనీసం పొలం నుంచి మార్కెట్‌కు తీసుకురా వడానికి అయిన రవాణా ఖర్చులు కూడా వచ్చేలా లేకపోవడంతో రైతుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రైతులు గంగాపూర్–వైజాపూర్ జాతీయరహ దారిపై ఉల్లిపాయల బస్తాలను రోడ్డుపై పారబోసి తమ నిరసనను వ్యక్తంచేశారు. అటు నాసిక్‌లోని చంద్వాడులో కూడా గిట్టుబాటు ధర కోసం రైతు లు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు నిరస నకారులను అదుపులోకి తీసుకోవాల్సి వచ్చింది. అయితే మార్కెట్‌లో సామాన్యుడు ఉల్లిపాయలు కొనాలంటే మాత్రం భారీ ధరలు చెల్లించాల్సి వస్తోంది. రైతు దగ్గర తక్కువ ధరకే కొంటున్న దళారులు, వ్యాపారులు మార్కెట్‌లో మాత్రం అధిక ధరలకు అమ్ముకుంటూ లాభాలు దండు కుంటున్నారు.

అటు ఎక్కువ ధర పెట్టి కొనలేక వినియోగదారులు, ఇటు పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు నష్టపోతుంటే మధ్యలో దళారులు మాత్రం కోట్లు కూడబెడ తున్నారు. "మేము చెమటోడ్చి పండించిన పంటకు కనీస మద్దతు ధర కూడా కల్పించకపోతే మేము ఎలా బత కాలి?" అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభు త్వం తక్షణమే స్పందించి, ఉల్లి రైతులకు గిట్టు బాటు ధర కల్పించి ఆదుకోవాలని, దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా గ్రానైట్ వ్యాపారులపై ఇడి దాడులు

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: రాష్ట్రంలో గ్రానైట్ వ్యాపారులను కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్ ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఈడీ) మరోసారి టా ర్గెట్ చేసింది. ఆరు నెలల క్రితం ఒకసారి ఈడీ అధికారులు గ్రానైట్ వ్యాపారుల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేసి, భారీగా అక్రమాలను ర ట్టు చేయడం తెలిసిందే. ఈ సందర్భంగా అనేక మంది వ్యాపారులకు భారీగా జరిమానాలు విధించడం విదితమే. బుధవారం నాడు మళ్లీ ఇదే రీతిన ఈడీ అధికారులు దాడులు చేశారు హైద రాబాద్, కరీంనగర్‌లలోని ఎనిమిది ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. కరీంనగర్‌లో గ్రానైట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ఈ ప్రాంతంలో ఈడీ అధికారులు పలు బృందాలుగా ఏర్పడి సోదాలు జరిపారు. కాగా కొందరు వ్యా పారులు నకిలీ ఇన్ వాయిస్‌లతో గ్రానైట్‌ను తరలిస్తూ పన్నులను ఎగ్గొడుతున్నారని సమాచారం అందడంతో దీనికి సంబంధించిన గోల్‌మాల్‌ను రట్టు చేసేందుకు ఈడీ అధికారులు నిర్ణయించి ఈ దాడులు చేబట్టినట్లు సమాచారం. ఇదే సమయంలో నకిలీ ఇన్‌వాయిస్‌కు సంబం ధించి జిఎస్‌టి చెల్లింపు చేయక పోవడంపై ఓ వ్యాపారిని ఈడీఅధికారులు అదుపులోకి తీసుకుని విచారించగా గోల్‌మాల్ వ్యవహారం రట్ట యినట్లు తెలిసింది. నకిలీ ఇన్‌వాయిస్ బిల్లులతో కేంద్రానికి అందాల్సి న కోట్లాది రూపాయల పన్నులను వ్యాపారులు చెల్లించడం లేదని ఈడీ అధికారులకు ఆ ధారాలు అందినట్లు తెలిసింది. దీనిపై ఈడీ అధికారులు పలువురు వ్యాపారులకు నోటీసులు ఇచ్చి వారి నుంచి వివరణ కోరినట్లు సమాచారం.

# అకాల వర్షాలు.. అప్రమత్తం కండి


### అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27: వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో వర్షాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కల్లాల్లోని ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉం చాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తైన కేంద్రాల నుంచి టార్పాలిన్లను తరలించాలని అన్నారు. బలమైన ఈదురుగా లులు వీస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూ చించారు. ఇకపోతే గతరాత్రి నుంచి హైదరాబాద్ నగరం సహా రాష్ట్రాల్లోని పలు జిల్లాలో ఓ మోస్తరు నుంచి వర్షాలు నమోదయ్యాయి. ఆ అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతకొచ్చిన పంట కళ్ల ముందే తడిసి ముద్దవుతుంటే బోరున విలపిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని అనేక జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మహబూబ్‌నగర్ జిల్లా వ్యా ప్తంగా సగటుగా 11 సెం.మీ వర్షం నమోదైంది. అదేజిల్లాలో కొత్తమొలంగూరు,పారపల్లి, బూత్ పూర్ తదితర ప్రాంతాల్లో 11సెం.మీవర్షం నమో దైంది. అమరిచంతలో 9సెం.మీ. నమోదైంది.

# త్రిభాషా విధానంపై సుప్రీంలో పిటిషన్

### కేంద్రం, సిబిఎస్ఇకి నోటీసులు

### విచారణ జులై రెండో వారానికి వాయిదా



న్యూఢిల్లీ, మే 27: 2026–27 విద్యా సంవత్సరం నుంచి 9వ తరగతి విద్యార్థులకు మూడో భాషను తప్పనిసరి చేయాలన్న సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి)ల నుంచి "సమగ్ర స్పందన"ను సుప్రీంకోర్టు కోరింది. సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం నోటీసు జారీ చేసి, ఈ విషయాన్ని జులై రెండో వారానికి వాయిదా వేసింది. ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి అవసరమైన కార్యాచరణ సన్నద్ధతపై నివేదిక కావాలని ధర్మాసనం అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటికి తెలిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి, సర్క్యులర్ ప్రకారం విద్యార్థులు వచ్చే విద్యా సంవత్సరం నుంచే మూడు భాషలు చదవాల్సి ఉంటుందని సమర్పించారు. పాఠ్యపుస్తకాలు కూడా అందుబాటులో లేవని రోహత్గి తెలిపారు. సంబంధిత కేసులో హాజరైన సీనియర్ న్యాయ వాది కపిల్ సిబల్, ఈ విషయం ముఖ్యమైన రాజ్యాంగపరమైన అంశాలను లేవనెత్తుతోందని, ఇది ఒక "ఫెడరల్ సమస్య" కూడా అని సమ ర్పించారు. భాష అనేది వ్యక్తిగత ఎంపిక అని, దానిని బలవంతంగా రుద్దలేమని ఆయన సమర్పించారు. ఈ విషయాన్ని మొదట జూన్ 15న విచారణకు పెట్టాలని ధర్మాసనం ప్రతి పాదించింది. అయితే, ఏఎస్‌జీ అభ్యర్థన మేరకు, ధర్మాసనం దీనిని జులై రెండవ వారానికి వాయి దా వేసింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారం భమయ్యే జులై 1 నుంచి ఈ నిర్ణయాన్ని అమలు చేయవద్దని సిబిఎస్ఇని కోరాలని పిటిషనర్లు అభ్యర్థించారు. అయితే, ధర్మాసనం ఎలాంటి మధ్యంతర ఆదేశాలు జారీ చేయలేదు. "చూద్దాం," అని సిజెఐ అన్నారు.

# బాల్క సుమన్‌పై నాంపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని, సింగరేణి కార్యాలయాన్ని కాల్చి వేయాలని బిఆర్ఎ స్ నేత బాల్క సుమన్ తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకు లు చేసిన ఫిర్యాదుల మేరకు నాంపల్లి పోలీసులు సుమన్‌పై కేసు నమోదు చేశారు.

ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు మేరకు సుమన్ పై బుధవారం నాడు ఈ కేసు నమోదయ్యింది. మరోవైపు సుమన్‌పై రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయగా ఇందు కు సంబంధించి కొన్నిచోట్ల కేసులు నమోదయ్యాయి.

# ఆర్టీఏ కార్యాలయాల్లో ఎసిబి సోదాలు

## భారీగా అక్రమాల గుర్తింపు

హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త: జంట నగరాలు, శివార్లలోని రవాణా శాఖ ప్రాంతీయ కార్యాలయాల్లో ఎసిబి అధికారులు బుధవారం నా డు ఆకస్మికంగా తనిఖీలు చేబట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ తనిఖీ ల్లో ఆర్టీఏ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నట్లు వెలుగు చూసింది. ఏజెంట్ల ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు అక్రమంగా జరుగుతున్నట్లు ఎసిబి అధికారు లు గుర్తించారు. కొండాపూర్, మేడ్చల్ నాగోల్, ఉప్పల్ సహా మరో నాలుగుచోట్ల ఎసిబి అధికారులు ఏకకా లంలో దాడులు చేశారు. ఎసిబి డిఎ స్పిలు లక్ష్మీకాంత్ రెడ్డి, మజీద్ ఖాన్, శ్రీధర్‌ల ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. ఎసిబి అధికారుల సోదాల్లో వచ్చే నెలలో పాఠశాలలు మొ దలవనుండడంతో ప్రైవేటు పాఠశాలలకు సం బంధించిన బచ.స్సుల రిజిస్ట్రేషన్‌లు, వాటి ఫిట్‌నెస్ పరీక్షలు సైతం సవ్యంగా జరగడం లేదని ఎ సిబి అధికారులు గుర్తించారు. దాడుల సందర్భంగా ఆయా ఆర్టీఏ కార్యాలయాలలో వున్న ఏజెంట్లతో పాటు కొందరు అనుమానితులను ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. కాగా ఆర్టీఏ కార్యా లయాలలో వెలుగుచూసిన అక్రమాలపై ఎసిబి అధికారులు రవాణాశాఖ ఉ న్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

# ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

పభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27: బక్రీద్ (ఈద్‌ఉల్ ఆజ్హా) పవిత్ర దినం సందర్భంగా ముస్లిం సహోదరులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.త్యాగానికి,దానగుణానికి ప్రతీకగా, విశ్వవ్యాప్తంగా ఇస్లాం ఆరాధకులు జరుపుకునే పర్వదినం బక్రీద్ పండుగ అని కేసీఆర్ తెలిపారు. ధనవంతులు పేదలు అనే తరతమ బేధాలు లేకుండా, ప్రజల నడుమ శాంతి, సహనం సౌభ్రాతృత్వాన్ని బక్రీద్ పండుగ పెంపొందిస్తుందన్నారు.

ఈ పవిత్ర దినాన.. ధార్మికత, దైవచింతన ప్రతి మానవుడి హృదయంలో విరజిమ్మాలని కేసీఆర్ ఆకాంక్షి ంచారు.

గంగా జమున సంస్కృతికి ఆలవాలమైన తెలంగాణలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలనడుమ సోదర భావం ఐక్యత మరింత పెంపొందాలని కోరుకున్నారు.ప్రజలంతా సుఖ శాంతులతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండేలా దీవించాలని కేసీఆర్ దైవాన్ని ప్రార్థించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

టెండర్ నం. C/SG/36/604 తేది: 25.05.2026

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు టెండర్ల యొక్క ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా క్రింది పనులకు బహిరంగ టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.01. టెండరు నం. & తేది: C-SG-36-604, తేది: 22.05.2026, ముగింపు తేది: 15.06.2026, పని పేరు: SC డివిజన్‌లోని NZB-PDPL సెక్షన్‌లో, పొడవైన బ్లాక్ సెక్షన్‌లు మరియు 10000 TVUలు కంటే ఎక్కువ కలిగిన మూడు (3) LC గేట్ల (LC నం. 42, 24 & 15) ఇంటర్‌లాకింగ్‌కు సంబంధించిన సిగ్నలింగ్ ఏర్పాట్లు. సుమారు విలువ: రూ. 3,12,51,280.06/-, బిడ్ సెక్యూరిటీ/ బయానా: రూ. 625000/-.

తదుపరి వివరాలకు వెబ్‌సైట్ www.ireps.gov.in ను దర్శించండి.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్

ఇ-టెండర్ ప్రకటన

భారత రాష్ట్రపతి తరపున డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (నిర్వహణ) గుంటూరు వారు GEM పోర్టల్ https://gem.gov.in ద్వారా క్రింది ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

క్ర.సం.01. టెండరు రిఫరెన్స్ నం.: GEM/2026/B/7573090. తేది: 22.05.2026, టెండర్ టైటిల్: గుంటూరు డివిజన్: PGDP-VNUP-JNPD సెక్షన్‌లో 2 సంవత్సరాల కాలానికి విద్యుత్ సాధారణ సర్వీస్ ఆస్తుల యొక్క బ్రేక్‌డౌన్ అటెన్షన్, నిర్వహణ నిమిత్తం మానవ శక్తి యొక్క ఔట్ సోర్సింగ్. సుమారు విలువ: (రూ)లో, 38,10,697.09/-, బయానా రూ లో: 76,300.00. టెండర్ ఫారం ధర: (తిరిగి-ఇవ్వబడనిది) (రూ)లో: 0.

క్ర.సం.02. టెండరు రిఫరెన్స్ నం.: GEM/2026/B/7575347. తేది: 22.05.2026, టెండర్ టైటిల్: గుంటూరు డివిజన్: PGDP-VNUP-JNPD సెక్షన్‌లో 2 సంవత్సరాల కాలానికి విద్యుత్ సబ్ స్టేషన్‌లు మరియు డిపోల యొక్క ఆపరేషన్ మరియు మ్యేనింగ్ యొక్క అవుట్ సోర్సింగ్. సుమారు విలువ: (రూ) లో. 25,04,121.70. బయానా (రూ)లో: 50,100.00. టెండర్ ఫారం ధర: (తిరిగి-ఇవ్వబడనిది) (రూ)లో: 0.

క్ర.సం.1కు ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది, సమయం: 13.06.2026 సా.17.00గం. వరకు.

క్ర.సం.2కు ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేదీ మరియు సమయం: 15.06.2026 18.00గం. వరకు.

ఏ తదుపరి కమ్యూనికేషన్/సవరణ ఇ-పోర్టల్ https://gem.gov.inలో మాత్రమే ప్రచురించబడును.

డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/M/ గుంటూరు

ఇ-టెండర్ ప్రకటన నం. 48-Dy.CE/GS/GNT

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, గుంటూరు వారు క్రింద పేర్కొన్న పనికి 24.06.2026న 15.00గం. వరకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

క్ర.సం.01. టెండరు ID: 88, సెక్షన్: Dy.CE/GS/GNT. పని వివరణ: గుంటూరు: గుంటూరు–నంబూరు స్టేషన్‌ల మధ్య కిమీ 3/25-27 వద్ద LC No. 03కు బదులుగా 4-లేన్ ROB యొక్క GNT-KCC నిర్మాణం. సుమారు విలువ: (రూ). లో: 69,52,95,220.59/-. బయానా: రూ.1,39,05,900/-.

1. ఇ-బిడ్స్ ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేదీ: 24.06.2026న 15.00గం. వరకు. సవివర సమాచారానికి వెబ్‌సైట్ www.ireps.gov.in కు లాగాన్ అవ్వండి.
2. తదుపరి కమ్యూనికేషన్/సవరణ ఏదైనా ఇ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలుపబడును.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, గుంటూరు.

ఇ-టెండర్ ప్రకటన నం. 03/Dy.CSTE/C-1/SC/2026-27, తేది: 26.05.2026

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ సిగ్నల్ మరియు టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ (నిర్మాణం–1) దక్షిణ మధ్య రైల్వే, సికిందరాబాద్ వారు సమర్థ ప్రాధికారి అనుమతితో క్రింది పనికి 19.06.2026న 15.00గం. వరకు ఇ-టెండర్ (బహిరంగ) కోరుతున్నారు.

క్ర.సం.01. టెండరు నం. C-SG-C-36-5-234-2026. పనిపేరు: SC రైల్వే యొక్క PRLI-PBN డబ్లింగ్ పనితో సంబంధించిన PRLI-PBN సెక్షన్ మధ్య EIలో ఇన్-బిల్ట్-బ్లాక్‌కు డెడికేటెడ్ OFC ఏర్పాటు. సుమారు విలువ: (రూ). లో: 83247776.30పై./-, బిడ్ సెక్యూరిటీ (రూ)లో: 1665000/-. పూర్తి చేయు కాలం : 12 నెలలు.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్ సైట్ https://ireps.gov.in కు లాగిన్ అవ్వండి.
2. బిడ్ సెక్యూరిటీ చెల్లింపు ఇ-పేమెంట్ గేట్‌వే ద్వారా క్యాష్‌గా డిపాజిట్ చేయటంగానీ లేదా ఇండియాలోని షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్ నుండి బ్యాంక్ గ్యారంటీ బాండ్‌గా దాఖలు చేయవచ్చును.
3. టెండర్‌దారులు టెండర్ యొక్క ముగింపుకు ముందు 15 రోజుల కాలం టెండర్ దాఖలు కాలం ఆన్‌లైన్ వారి ఆఫర్‌లను దాఖలు చేయవచ్చును.
4. టెండర్ దాఖలు కాలం యొక్క ప్రారంభం యొక్క తేదీ వరకు (ఆన్‌లైన్ జారీ మాత్రమే) ఏదైనా సవరణను టెండర్‌దారులు పరిశీలించుకొనవలెను.

డిప్యూటీ చీఫ్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ (నిర్మాణం-1), సికిందరాబాద్.

టెండర్ ప్రకటన నం. B-E29-TRD-TNDR-09-2026-27 తేది: 22.05.2026

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ TrD, విజయవాడ వారు క్రింది పనులకు ఒక్కొక్కదానికి పేర్కొన్న తేదీన మరియు 15.00గం. వరకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

టెండరు నం.: B-E29-TRD-TNDR-09/2026-27, పని పేరు: విజయవాడ డివిజన్ యొక్క GDV-MTM సెక్షన్‌లో LC గేట్ 37 మరియు BZA-BVRM సెక్షన్‌లో మిడ్ సెక్షన్ మ్యేన్డ్ LC గేట్ నం.లు 69 మరియు 76 యొక్క ఇంటర్‌లాకింగ్ ప్రతిపాదనకు సంబంధించి ఆక్సిలరీ ట్రాన్స్‌ఫార్మర్‌లు (10/25KVA) యొక్క ఏర్పాటు. సుమారు విలువ: రూ. 30,57,940.00/-, బిడ్ సెక్యూరిటీ (బయానా)(రూ): 61,200/- పూర్తి చేయు కాలం : 12 నెలలు. ముగింపు తేదీ : 16.06.2026 టెండర్ ఫారం ధర-నిల్.

పూర్తి వివరాలు మరియు నిబంధనలకు మా సైట్ "www.ireps.gov.in" వద్ద వీక్షించండి.

N.B: తెరచు తేదీ ఒకవేళ సెలవు దినం అయితే, టెండర్ మర్నాటి పని రోజున తెరువబడును.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ TrD, విజయవాడ.

ఇ-టెండర్ నం. Dy.CE-GS-BZA-05-2026-27 తేది: 25.05.2026

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ వారు టెండరింగ్ యొక్క ఓపెన్ టెండరింగ్/సింగిల్ ప్యాకెట్/టూప్యాకెట్ సిస్టమ్‌లో క్రింది పనులకు ఇ-టెండర్ కోరుతున్నారు.

క్ర.సం.: 01 టెండర్ నం. మరియు తేదీ : Dy.CE-GS-BZA-05-2026-27 తేది: 25.05.2026. పని వివరణ: పని పేరు: BZA డివిజన్ -ELS (విజయవాడ)-HL బే యొక్క (KZJ ఎండ్) రెండు స్పాన్స్ యొక్క (2x17x9.5m) యొక్క విస్తరణ ప్రతిపాదన LL బే యొక్క (BZA ఎండ్) ఒక స్పాన్‌చే (1x17x9.5m) యొక్క విస్తరణ LL బే యొక్క (KZJ ఎండ్) ఒక స్పాన్‌చే (1x17x9.5m) యొక్క విస్తరణ ప్రస్తుతం వున్న సర్వీస్ బిల్డింగ్ కూల్చివేత (117x10m) కొత్త సర్వీస్ బిల్డింగ్ నిర్మాణం (127x10m) ప్రస్తుతం వున్న టాయిలెట్స్ కూల్చివేత మరియు చేతులు శుభ్రపరచుకొనే ఏరియాతో, 9.0x6.0m సైజ్ యొక్క కొత్త మరుగుదొడ్ల యొక్క నిర్మాణం, 200 మంది వినియోగదారులకు సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం. LL బేకు (VDF+ఐరొనైట్) ఇండస్ట్రియల్ రీ-ఫ్లోరింగ్ పూర్తిగా ట్రాక్ పనులు. IRPSM.ID నం.:- 11.06.42.23.1.47.007. టెండర్ విలువ(రూ): 164209642.18, బయానా (రూ): 3284200/-, పూర్తి చేయు కాలం: 12 నెలలు. టెండర్ ఫారం ధర (రూ): నిల్. ముగింపు తేదీ, సమయం: 17.06.2026, 15.00గం. వద్ద.

1. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్‌సైట్ https://ireps.gov.in కు లాగిన్ అవ్వండి.
2. టెండర్‌దారులు టెండర్ యొక్క ముగింపుకు ముందు కాలం 15 రోజులు కాలంలో టెండర్ దాఖలు/బిడ్డింగ్ సమయంలో ఆన్‌లైన్ వారి ఆఫర్‌లు దాఖలు చేయవచ్చును.
3. టెండర్ దాఖలు/బిడ్డింగ్ కాలం ప్రారంభం యొక్క తేదీ వరకు (ఆన్‌లైన్ మాత్రమే జారీ) ఏ సవరణ కోసమైనా టెండర్‌దారులు పరిశీలించుకొనవలెను.

డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, గతిశక్తి, విజయవాడ.

No.NW/148/WIII/టెండర్ ప్రకటన/2026-27, తేది: 22.05.2026

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్, సమన్వయం, నాందేడ్, దక్షిణ మధ్య రైల్వే వారు క్రింది పనులకు ఇ-టెండర్‌లు కోరుతున్నారు.

క్ర.సం.01. టెండరు నం: T-202627-3-022. అథారిటీ:- Co-ORd పని వివరణ: DEN/W/NED's పరిధి క్రింద, ADEN/AWB's పరిధి క్రింద, SSE/PWay/LSR & SSE/PWay/AWBలో క్రింద భద్రతా సంబంధిత ట్రాక్ పనులకు ప్రతిపాదన. టెండర్ విలువ (రూ)లో: 14990535.94. బయానా (రూ)లో: 299800.00. పూర్తి చేయు కాలం: తొమ్మిది నెలలు. టెండర్ ఫారం ధర (రూ)లో: 0

క్ర.సం.02. టెండరు నం: T-202627-1-023. అథారిటీ:- Co-ORd పని వివరణ: నాందేడ్ స్టేషన్ వద్ద ఒక సంవత్సరానికి రైల్వే OH ట్యాంక్స్‌లోనికి పంపింగ్ కలుపుకొని ప్రైవేట్ ఏజెన్సీచే రోడ్ ట్యాంకర్‌ల ద్వారా త్రాగునీరు రవాణా మరియు సరఫరా. టెండర్ విలువ (రూ)లో: 8648310.00. బయానా (రూ)లో: 173000.00. పూర్తి చేయు కాలం: పన్నెండు నెలలు. టెండర్ ఫారం ధర (రూ)లో: 0.

క్ర.సం.01. టెండరు నం: T-202627-3-022. ఇదే తరహా స్వభావం గల పని (50 లక్షలు పైగా విలువ కొరకు) ట్రాక్ నిర్వహణ పని కలిపి ఏ రైల్వే ట్రాక్ పని అయినా.

క్ర.సం.02. టెండరు నం: T-202627-1-023. ఇదే తరహా స్వభావం గల పని (50 లక్షలు పైగా విలువ కొరకు) ట్రాక్ పని/జోనల్ పని కాకుండా ఏ సివిల్ ఇంజనీరింగ్ పనులైనా.

పై టెండర్‌లు అన్నీ 18.06.2026, 15:00 గం. వద్ద ముగించబడతాయి. బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్‌సైట్ http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి.

A380 సీనియర్ DEN/Co-ord/నాందేడ్.

తదుపరి టెండరు నిబంధనలు /వివరములు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in చూడవచ్చును.



GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No: 22/2026-2027/SE(WS)/EE-II(WS) Dt: 26-05-2026

Number of works = 1 Value of work Rs.62.81 Lakhs

Downloading starting Date: 27-05-2026, Tender Closing Date: 10-06-2026.

Further Details at http://tender.apeprocurement.gov.in

O/o EE(WS) Cell No.9912255228

Sd/- Commissioner, GVMC



రెసిడ్యుయల్ షేర్ హోల్డర్‌ల యొక్క దృష్టి కొరకు ఎగ్జిట్ ఆఫర్

స్కూటర్స్ ఇండియా లిమిటెడ్

(భారత ప్రభుత్వ సంస్థ) కార్పొరేట్ ఐడెంటిటీ నంబర్: L25111UP1972GOI003599

రిజిస్టర్డ్ ఆఫీస్: 3/481, 1వ అంతస్తు, వికల్ప్ ఖండ్, గోమ్తీ నగర్, లక్నో, ఉత్తర్‌ప్రదేశ్, ఇండియా-226010, టెలిఫోన్ నం.0522-3119593

వెబ్‌సైట్: www.scootersindialimited.com, ఇ-మెయిల్ ఐడి: csscootersindia@gmail.com

ప్రదేశం : లక్నో
తేది : మే 28, 2026

వార్త


ఇతరులపై నీ ముందు నిందలు వేసేవాడు, పరుల వద్ద నీపై నిందలు వేయకుండా ఉండలేడు.

- సోక్రటీస్

# ప్రచండ వేసవి!

తెలుగు రాష్ట్రాలలో భానుడు ఉగ్రతాండవం చేస్తున్నాడు. ఎన్నో ప్రాణాలు వడదెబ్బకు నేలకూలాయి. ఇంతవరకు ఈ వారంలో 200 మంది బలైనట్లు లెక్కతేలాయి. తీవ్ర మయిన వడగాలులకు జనం విలవిల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత మరో రెండు మూడు రోజులుంటుందని అంచనా. అలా అని ఆకాశం నుంచి చుక్కనీరు పడదని కాదు. పడలేదని కాదు. అకాల వర్షాలు కూడా రైతును చాచికొడ్తున్నాయి. ఈ యేడాది నైరుతి రుతుపవనాల రాక కొంత ఆలస్యం కానున్నాయని వాతావరణశాఖ తేల్చి చెప్పేసింది. రెండు రోజుల నాడే రోహిణి కార్తె మొదలైంది. అంతకు మునుపే వడగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. ఒకపక్క ప్రకృతి సమతుల్యత లోపించినందునే ఎండా వాన బీభత్సానికి అటు ప్రాణనష్టం ఇటు పంట నష్టాలు ఎక్కువగానే ఉన్నాయి. ఎండల రీత్యా పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు వాతావరణ సంస్థ ముందస్తు అప్రమత్తతల వలన గర్భిణులు, వృద్ధులు, పిల్లలు ఇళ్లు దాటి బయటకు రాకపోవడం మంచిదయ్యింది. మే 26 నాటికే నైరుతి రుతుపవనాలు కేరళం రాష్ట్రాన్ని తాకాల్సి ఉన్నా వాతావరణ పరిస్థితులు కలిసి రాలేదు. అన్నీ కలిసొస్తే జూన్ 5లోగా కేరళంలోకి ప్రవేశించే అవకాశముంది. అక్కడ్నించి దాటి తెలుగు రాష్ట్రాలకు వచ్చే సరికి జూన్ 10 తేదీ వరకు పడ్తుంది. మంగళవారం సాయంత్రానికి తెలంగాణలోని పలుజిల్లాల్లో అకాల వర్షాలుకురిసాయి. ఈదురుగాలులు, వడగళ్ల వానలు వెంట తెచ్చాయి. ఇదేమీ వడగాల్పులకు ఉపశమనంగా అనిపించలేదు. ప్రజలకు ఒక దాని వెంట ఒక కష్టం తరుముకొచ్చినట్లుగానే భావించారు. బాధల తీరు ఎలాఉందంటే పలు ప్రాంతాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. మక్కరాశులు నీళ్ల మునిగాయి. ఉన్న పళంగా తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం వద్ద ఓ యువ భక్తురాలు కుప్పకూలి పడిపోయి తనువు చాలించింది. బుధవారం సంగారెడ్డి జిల్లాకు చెందిన సంగమేశ్వర్ (9)వడదెబ్బకు ఇంటి ముందే కుప్పకూలిపోయాడు. ఇలాంటి వడగాలుల వల్ల మృతి చెందిన ఉదంతాలు ఎన్నో నమోదయ్యాయి. ఈ పరిస్థితులు తట్టుకోలేమని తెలిసినా ఎండలో బయటికి వెళ్లిన వారు చావుదరికి చేరుకున్నారు. పగటి ఉష్ణోగ్రతల తాపంతో అల్లాడిన జనానికి రాత్రిళ్లు నిద్రపట్టడం లేదు. కనిష్ట ఉష్ణోగ్రతలు అనుకున్న చోటకూడా వేసవితాపం ఉక్కపోతకు గురిచేసింది. మామూలు రోజుల్లో అడపాదడపా వచ్చే చల్లగాలి కూడా ఈసారి కరవైంది. వేసవి దృష్ట్యా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. అంటే పశువులుకూడా వడదెబ్బకు గురయ్యాయి. దాదాపు 12.5శాతం పాల ఉత్పత్తిపై ఈ యేడాది దెబ్బ పడింది. తెలంగాణ రాష్ట్రంలో గత సీజన్ కన్నా ఈసారి 40శాతం మేరకు పాల ఉత్పత్తి తగ్గిపోయింది. ఎండాకాలం పచ్చగడ్డి దొరకదు. అది దొరికితేనే పాలదిగుబడి ఉంటుంది. కానీ కొరత రీత్యా పశువులకు సరిగా దాణా అందించలేకపోయారు. పాల కొరత, గిరాకీ రీత్యా అన్ని పాలసంస్థలు విక్రయ ధర పెంచేశాయి. ఎన్నో ప్రాంతాల్లో వర్షబీభత్సంతో రోడ్లపై భారీ వృక్షాలు పడిపోయాయి. విద్యుత్ అంతరాయం కనీసం 15 నిమిషాల వరకు ఉంది. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కుప్పలు, మక్కలు నీటిలో తడిసిపోయాయి. వాటిని ఎండబెట్టినా ఫలసాయం ప్రయోజనకరంగా ఉండదు. ప్రత్యేకించి హైదరాబాద్‌లో వాతావరణంలో తేమ విషయానికి వస్తే గాలిలో తేమ 50 శాతం వరకు ఉంటోంది. నైరుతి రుతుపవనాల రాక అంచనాలు దాటి జూన్ 2వ వారానికల్లా వచ్చే అవకాశాల రీత్యా ఈ పక్షం రోజుల పాటు వాతావరణంలోని తేమ మేరకు జనాన్ని ఇబ్బంది పెడుతుందోనన్న విషయంలో ప్రభుత్వ జాగరూకతతో వ్యవహరించింది. ఇదిలాఉండగా ప్రచండ గాలులను తట్టుకోలేని ప్రజలు అల్లాడిపోతున్న విషయం తెలిసిందే. ఎల్‌నినో కారణంగానే ప్రపంచ వాతావరణంలోని మార్పులు వచ్చాయని శాస్త్రజ్ఞులు చెబుతూనే ఉన్నారు. ఒకే చోట వేడిగాలులు ఏర్పడి అక్కడ అసహజ వాతావరణంలో ఇబ్బంది పెట్టే 'హీట్ డోమ్' ప్రక్రియతో కొన్ని ప్రాంతాల ప్రజలు అతలాకుతలం అయిపోతున్నారు. దీనివలననే యూరప్ దేశం అల్లాడిపోతోంది. ఈసారి గాలి వాన బీభత్సం మామూలుగా ఏం లేదు. ఐకెపి ధాన్యం కేంద్రాలలో ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. తోటపంటలు కూడా ఎందుకూ పనికిరాకుండాపోయాయి. అసలే ఈ యేడాది మామిడి కాపుబాగా తగ్గిపోయింది. ఉన్న కాపు నేలరాలింది. మరో 15 రోజుల పాటు పచ్చడి మామిడి కాయ వస్తుందో రాదో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఇవన్నీ రైతాంగానికి ఆర్థిక నష్టాలే. ఈ నష్టాలు పూడ్చుకునేవి కూడా కాదు. ఇక రేపొచ్చే రుతుపవనాలు ఎవరికి లాభం ఎంతెంత లాభమో కూడా బేరీజుచేసి చెప్పుకునే పరిస్థితి కూడాలేదు. అసమశీతోష్ణ పరిస్థితుల కారణంగా రైతుకు మిగిలేవి కష్టాలేనని స్పష్టంగా తెలుస్తోంది. వడగాలుల ప్రభావం ఏమాత్రం పెరిగినా రుతుపవనాల రాక మరింత ఆలస్యంఅయ్యే పరిస్థితి మంచిదికాదు. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల రీత్యా రుతుపవనాల కదలికల్లో వేగం తగ్గింది. ఈయేడాది వర్షాకాలంలో సాధారణం కన్నా తక్కువస్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులుండగా జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపై ఈ ప్రభావం పడ్తుందని మెరుపులు, పిడుగులు వస్తాయని వాతావరణ శాఖపేర్కొంది. వీటన్నిటికీ తోడు గాలిలో తేమ పడిపోయి వడగాల్పుల ప్రభావం ఎక్కువైంది. భూగర్భజలాల లోతుల్లో నీళ్ల అడుగింటిన కారణంగా మంచినీటికి కూడా కరవు ఏర్పడ్తోంది. ఏదిఏమైనా ఎప్పటికప్పుడు భూగర్భ నీటిలభ్యత విషయమై శాస్త్రీయ పరిశోధనలుద్వారా నీటి మట్టాలు పెరుగుదల శాశ్వతంగా మరమ్మత్తులు చేయించాల్సిన ఆవశ్యకత ఉంది.

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం, ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

విజయం వల్ల లాభాలు ఆశించేవారు ఆ విజయాన్ని పొందేందుకు తిప్పలు పడక తప్పదు.



డబ్ల్యు. ఎమర్సన్

## ప్రజావాక్కు



### నదిలో మునిగితే అంటు రోగాలు వస్తాయి

ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాజమండ్రిలో పుష్కరాల పనులుచూస్తూ ఈనీటిలో మునిగితే పుణ్యం కాదు రోగాలు వస్తాయి అని చెప్పటం అభినందనీయం. పవన్ కల్యాణ్ ఈ సంగతి మేము ఎప్పటి నుండో చెప్తున్నాం. లక్షలాది మంది నీటిలో మునిగితే మలమూత్రాలు అందులో వదులుతారు. స్నానం చేసేటప్పుడు మూత్రం వదలడం జీవ లక్షణం. మరి అలాంటి మురికి నీళ్లలో మునిగితే కచ్చితంగా అంటురోగాలు వస్తాయి. పురోహితవర్గం తమ బతుకు దెరువు కోసం పిండా కూళ్ళు పెడితే, చనిపోయిన వారు కాకి రూపంలో వచ్చి తింటారని ప్రజలను నమ్మించి పొట్టపోసుకుంటున్నారుతప్ప, అందులోఎలాంటి శాస్త్రీయతలేదు. నదులను కాలుష్యం చెయ్యటం ఎందుకు? కాలుష్య నివారణ కోసం కోట్ల రూపాయలు తగలెయ్యడం ఎందుకు ?

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఊహల్లో ఊరేగుతూ...

ఢిల్లీ మద్యం కేసులో కింది కోర్టు ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను కల్వకుంట్ల కవిత ఇంకా మరికొందరిని నిర్దోషులని తేల్చి వారందరికి క్లీన్ చీట్ ఇచ్చింది. అయితే ఈ కేసుని దర్యాప్తు చేస్తున్న సంస్థ హైకోర్టును ఆశ్రయించేటంతా కేజ్రీవాల్, కవితల కథ మళ్లీ మొదటికొచ్చినట్లయింది. వారు నోటీసులు అందుకున్నప్పుడల్లా కోర్టుకు వెళ్లవలసి ఉంటుంది. విచారణను ఎదుర్కోవలసి ఉంటుంది. కాళేశ్వరం విషయంలోనూ అలానే జరుగుతుంది. ఘోష్ కమిషన్ విచారణలో కొన్నిలోపాలు జరిగాయని చెప్పిందే కానీ ఘోష్ కమిషన్ తప్పుల తడక అని చెప్పలేదు.

- శాస్త్రి, హైదరాబాద్

### వెజిటబుల్ హాబ్

రాష్ట్రాలలో ఉండే బలమైన నదివ్యవస్థలు తెలంగాణ తీసుకుంటే కృష్ణ, గోదావరి ప్రాంతం, మధ్యప్రదేశ్ తీసుకుంటే ఛాంబల్ నది లోయ ప్రాంతం బీహార్ హార్యాన లాంటి రాష్ట్రాలలో విస్తరించిన గంగ, సింధు నది వ్యవస్థలు అక్కడి బలమైన పీఠభూములు. అక్కడ ఉన్న ఎర్ర నెల స్వభావం మొత్తంగా ఉన్న నెలల వైవిధ్యం అన్ని కలిపి భూ పరివేష్టిత రాష్ట్రాలకు ప్రత్యేక ఉపాధి హామీ ప్రణాళిక అవసరాన్ని తెలియచెప్తున్నది. ఇకపోతే తెలంగాణ కూడా భూపరివేష్టిత రాష్ట్రం కాబట్టి వెజిటేబుల్ హాబ్‌గా మార్చడానికి అవకాశం కల్పిస్తున్నాయి.

- భారత అవినాష్, జనగామ

### కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అవసరం

లీక్ అనే పదానికి పెద్దపులే భయపడినట్టు ఒక స్టోరీ గత పదవ తరగతి సిలబస్‌లో ఉండేది. టుఎర్ హ్యూమన్ అంటారు. కానీ ఎర్రర్ ఫ్రీక్వశ్చన్ పేపర్ ఇవ్వవలసిన బాధ్యత విద్యాశాఖ అందరి అధికారులపై ఉంటుంది. ఈరోజు నీట్ లీకేజ్, నిన్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారి నిర్వహించిన డిప్యూటీ డిఈవోస్. సెలెక్టెడ్ అభ్యర్థులను పరిశీలిస్తే ఇంచుమించు అది కూడా అలాంటి వ్యవహారమే అనిపిస్తుంది. తీగ లాగితే డొంకంతా కదులుతుంది. ఎవరు ముందు పడితే వారిని టార్గెట్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ డిఈఓస్ కోసం నిర్వహించిన మెయిన్ ఎగ్జామ్‌లో పన్నెండు మంది ఏఎస్ఓలు సెలెక్ట్ అవడం అనుమానాలకు తావిస్తూ ఉన్నది. ఆంధ్రయూనివర్సిటీ వారిని అయితే అంధేరా యూనివర్సిటీ అధికారులు అనవచ్చు. ఒకే క్వశ్చన్ పేపర్ ఇచ్చి రెగ్యులర్ వాళ్ళకి గ్రేస్ మార్కులు ఇస్తారు. బెటర్మెంట్ లేదా స్పెషల్ డ్రైవ్‌లో అదే క్వశ్చన్ పేపర్ వ్రాసిన వారికి ఎలాంటి గ్రేస్ మార్కులు ఇవ్వడం లేదు. భారతదేశం మొత్తం మీద కామన్ ఎడ్యుకేషన్ బోర్డు అత్యంత అవసరం. స్టేట్ బోర్డులు సెంట్రల్ బోర్డుకు ఎఫిలియేటెడ్‌గా ఉంటే సరిపోతుంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అధికారులకు వేతనం పెంచాలి

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన, జనగణనలో భాగంగా ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్న అధికారుల కష్టాలు అంత ఇంత కాదు. వేసవి సెలవుల్లో మండుటెండలో ఇంటింటికి తిరుగుతూకొందరు ప్రజలు సహకరించకపోయినా టార్గెట్‌ను సమర్థవంతంగా పూర్తి చేసుకుంటున్న ఉపాధ్యాయ అధికారులకు వేతనం పెంచి, వెసులుబాటు కల్పించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### హరిత ఇంధన ప్రాజెక్టు

భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న ఈసమయంలో ఇంధన అవసరాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ఇప్పటికీ దేశఇంధన వినియోగంలో బొగ్గు, చమురు, సహజ వాయువు వంటి సంప్రదాయ ఇంధనాలపైనే అధిక ఆధారపడుతున్న పరిస్థితి ఉంది. ఈ ఆధారపడుదల ఆర్థిక భారాన్ని మాత్రమే కాదు, పర్యావరణ కాలుష్యాన్నికూడా పెంచుతోంది. అందుకే దేశభవిష్యత్తు కోసం హరిత ఇంధన ప్రాజెక్టులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజల్లో అవగాహన పెంచి, పరిశ్రమలను హరిత ఇంధన వినియోగం వైపు మళ్లించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్


మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# విద్యార్థి మరణాలు సామాజిక సంక్షోభమే!

**విద్యార్థుల మరణాలను కేవలం వ్యక్తి గత విషాదాలుగా మాత్రమే చూడడం సరిపోదు. ఇది మొత్తం విద్యాసామాజిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే ఈపరిస్థితిని మార్చడానికి విద్యార్థి సంఘాలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు, అధికారులు, తల్లిదండ్రులు, సమాజం, ఇలా అందరూ కలసి వ్యవస్థాగత స్థాయిలో జోక్యంచేసుకోవాలి. విద్యను వ్యాపార పోటీ కేంద్రంగా కాకుండా మానవీయ విలువలు, సమాన అవకాశాలు, మానసికభద్రత కలిగిన సామాజిక హక్కుగా మలచాల్సిన అవసరంఉంది. విద్యార్థుల భావోద్వేగ ఆరోగ్యం, సామాజిక భద్రత, వివక్ష రహిత వాతావరణం, అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన విద్య ఇవన్నీ కలిసే ఈ విషాద పరిస్థితులకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపగలవు.**

పాపని నాగరాజు

మనదేశంలో జ్ఞానాన్ని అందించాల్సిన విద్యాసంస్థలు క్రమంగా ఒత్తిడి కేంద్రాలుగా మారుతున్నాయనే ఆందోళన ఇప్పుడు విద్యార్థుల స్వీయ మరణాల పెరుగుదల రూపంలో కనిపిస్తోంది. ఒకప్పుడు విద్యను వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి మార్గంగా భావించేవారు. కానీ కాలక్రమేణా విద్యా వ్యవస్థ మార్కులు, ర్యాంకులు, ఉద్యోగ పోటీ, కార్పొరేట్ కోచింగ్‌ల చుట్టూ తిరిగే ఒత్తిడి వ్యవస్థగా మారిపోయింది. ఈ మార్పుల ప్రభావం ఇప్పుడు విద్యార్థుల జీవితాలపై తీవ్రంగా పడుతోంది. 2024లో దేశవ్యాప్తంగా 14,488 మంది విద్యార్థులు స్వీయ మరణాలకు పాల్పడం కేవలం ఒక గణాంకాలు మాత్రమే కాదు, ఇదికుటుంబ వ్యవస్థ, విద్యా విధానం, సామాజిక అసమానతలు, మానసిక ఒత్తిళ్లపై స్పష్టమైన చర్చ అవసరమని గుర్తు చేస్తోంది. జాతీయ నేర గణాంకాల బ్యూరో గణాంకాల ప్రకారం గత పదేళ్లలో విద్యార్థుల మరణాలు గణనీయంగా పెరిగాయి. 2015లో 8,934గా ఉన్న ఈ సంఖ్య 2024 నాటికి 14,488కు చేరింది. ప్రతి సంఖ్య వెనుక ఒక కుటుంబం ఆగిపోయిన భవిష్యత్తు, నెరవేరని కలలు ఉన్నాయి. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఉన్నత విద్యాసంస్థల్లో కూడా ఇలాంటి ఘటనలు పెరుగుతుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మనదేశంలో రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన అవకాశాలతో విద్య అందాలని పేర్కొంటుంది. అందుకు భిన్నంగా విద్యా రంగంలో తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. ఆర్థికంగా బలమైన కుటుంబాలకు కార్పొరేట్ పాఠశాలలు, ఖరీదైన కోచింగ్ సెంటర్లు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక మార్గదర్శకత్వం అందుబాటులో ఉంటుండగా, పేద, గ్రామీణ శోషిత వర్గాల విద్యార్థులు పరిమిత వనరులతోనే తీవ్రమైన పోటీ ప్రపంచంలో నిలబడాల్సి వస్తోంది. ఈ అసమాన పరిస్థితుల్లో ఒకే రకమైన పరీక్షలు, ఒకే ప్రమాణాలు అమలవడం విద్యలో సమాన అవకాశాల ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థులు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, ఒంటరితనం, వివక్ష భావన వంటి అంశాలపై గతంలో అనేక కమిటీలు ఆందోళన వ్యక్తం చేశాయి. మెంటార్ వ్యవస్థ, కౌన్సెలింగ్ కేంద్రాలు, ఎర్లీవార్నింగ్ సిస్టమ్‌లను బలోపేతం చేయాలని సూచనలు వచ్చినప్పటికీ అమలు స్థాయిలో ఇంకా లోపాలు కనిపిస్తున్నాయనే అభిప్రాయాలు ఉన్నాయి. ఇదే సమయంలో విద్య క్రమంగా వ్యాపార రంగంగా మారడం వల్ల నాణ్యమైన విద్య చాలావరకు డబ్బున్న వర్గాలకే పరిమితమవుతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇప్పటి విద్యా వ్యవస్థలో విద్యార్థుల వ్యక్తిత్వం, ఆలోచనా సామర్థ్యం కంటే మార్కులు, ర్యాంకులకు అధిక ప్రాధాన్యం పెరుగుతోంది. పరీక్షలు అభ్యాస ప్రక్రియలో భాగంగా కాకుండా జీవితాన్ని



నిర్ణయించే దశలుగా మారుతున్నాయి. విఫలమయ్యేభయం, తల్లిదండ్రుల అంచనాలు, ఉపాధ్యాయుల ఒత్తిడి, సమాజపు పోలికలు కలిసి విద్యార్థులపై మానసిక భారం పెంచుతున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ విద్యా వ్యవస్థలో ఉదయం నుంచి రాత్రివరకు పరీక్షలు, కోచింగ్‌లు, ర్యాంకుల కోసం జరిగే పోటీ విద్యార్థుల విశ్రాంతి, సృజనాత్మకత, భావోద్వేగ సమతుల్యతపై ప్రభావం చూపుతోంది. మరోవైపు చాలా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ వ్యవస్థలు ఇంకా బలంగా ఏర్పడలేదు. విద్యార్థుల్లో డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సహాయం చేసే వ్యవస్థలు విస్తరించాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల తెలంగాణలో ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రతిపాదనపై చర్చ జరిగినప్పటికీ, అమలు వాయిదా పడటం విద్యా విధానాలపై ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రభావం ఎంతవరకు ఉందనే ప్రశ్నలను కూడా ముందుకు తెచ్చింది. ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు స్వయంగా ప్రైవేట్ లేదా కార్పొరేట్ విద్యాసంస్థలను నిర్వహిస్తున్న పరిస్థితుల్లో, అలాంటి వ్యవస్థలపై ప్రభుత్వం ఎంత నిష్పాక్షికంగా నియంత్రణ అమలు చేయగలదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విద్యను వ్యాపార రంగంగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాల్సిన అవసరం ఇలాంటి సందర్భాల్లో మరింత స్పష్టమవుతోంది. అదే సమయంలో కుటుంబాలు కూడా పిల్లలను ఇతరులతో పోల్చడం, మార్కులు, ఉద్యోగాలనే విజయ ప్రమాణాలుగా చూడడం వల్ల తెలియకుండానే ఒత్తిడిని పెంచుతున్నాయి. ఈ పరిస్థితి సమాజాన్ని ఒక కీలకమైన ఆలోచన వైపు తీసుకెళ్లాలి. మార్కులే జీవితం కాదని, ప్రతి విద్యార్థి ప్రతిభ ఒకే విధంగా ఉండదని అర్థం చేసుకోవాలి. ప్రతి పాఠశాలలో కౌన్సెలింగ్ వ్యవస్థలు బలోపేతం కావాలి. ఉన్నత విద్యాసంస్థల్లో మెంటార్ వ్యవస్థలు, విద్యార్థుల సహాయక కేంద్రాలు సమర్థంగా పనిచేయాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకో గల వాతావరణం నిర్మించాల్సిన అవసరం ఉంది. 14,488 మంది విద్యార్థుల మరణం కేవలం కొన్ని కుటుంబాల వ్యక్తిగత విషాదం మాత్రమే కాదు, ఇది విద్యావ్యవస్థ, సమాజం, పాలనా వ్యవస్థ కలిసి ఆలోచించాల్సిన ఒక స్పష్టమైన హెచ్చరిక. విద్యార్థుల మరణాలను కేవలం వ్యక్తి గత విషాదాలుగా మాత్రమే చూడడం సరిపోదు. ఇది మొత్తం విద్యా సామాజిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభంగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే ఈపరిస్థితిని మార్చడానికి విద్యార్థి సంఘాలు, మేధావులు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు, అధికారులు, తల్లిదండ్రులు, సమాజం, ఇలా అందరూ కలసి వ్యవస్థాగత స్థాయిలో జోక్యంచేసుకోవాలి. విద్యను వ్యాపార పోటీ కేంద్రంగా కాకుండా మానవీయ విలువలు, సమాన అవకాశాలు, మానసికభద్రత కలిగిన సామాజిక హక్కుగా మలచాల్సిన అవసరంఉంది. విద్యార్థుల భావోద్వేగఆరోగ్యం, సామాజిక భద్రత, వివక్ష రహిత వాతావరణం, అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన విద్య ఇవన్నీ కలిసే ఈ విషాద పరిస్థితులకు దీర్ఘకాలిక పరిష్కారాన్ని చూపగలవు. ●

# సహజ వాయువుపై ఏదీ 'సహజ న్యాయం'?

వి.వి.కే.సురేష్

సహజ వాయువు నిక్షేపాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లభ్యమవుతున్నాయి. కృష్ణా, గోదావరి డి6 బేసిన్‌లో రోజుకు సుమారు 21 వేల టన్నుల గ్యాస్ ఉత్పత్తి జరుగుతోంది. అయితే దీనివల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనం దక్కడం లేదు. కె.జి బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న మొత్తం సహజ వాయువును ఎప్పటి నుండో ఒక పెద్ద కంపెనీ తమ సొంత పైపులైన్ల ద్వారాగుజరాత్, మహారాష్ట్రలకు సరఫరా చేస్తోంది. తద్వారా ఆ కంపెనీ పెద్ద ఎత్తున లాభాలు గడిస్తోంది. సుమారు గత ఇరవై ఏళ్ల నుండి ఈ సమస్యపై చర్చ జరుగుతూనే ఉన్నది. ఆయిల్ డ్రిల్లింగ్ ఇక్కడ జరుగుతోంది. పర్యావరణ కాలుష్యం సమస్యతోపాటు గోదావరి జిల్లాల్లో నిరంతరం బ్లో అవుట్లు, ప్రమాదాలు వంటివి అనేకం సంభవిస్తున్నాయి. సహజ వనరులు ప్రజల సొత్తు. కానీ కష్టాలు, నష్టాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు భరిస్తుంటే, వారికి సహజ న్యాయం జరిగేలా చూడటంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఇప్పటికీ చిత్తశుద్ధి కొరవడింది. ఏ రాష్ట్రంలో చమురు నిక్షేపాలు ఉంటే ఆ రాష్ట్రానికి ఆ చమురు సంపదలో 50 శాతం ఇవ్వాలని ఏనాడో 12వ జాతీయ ఆర్థిక సంఘం స్పష్టంగా చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు సుమారుగా నాలుగు వేల టన్నులు. ఇక్కడ జరిగే సహజ వాయువు ఉత్పత్తిలో 50శాతం వాటాను కేటాయిస్తే, ఒక ప్రక్క రాష్ట్ర ప్రజల అవసరాలు తీరడంతో పాటు, విద్యుత్ ఉత్పత్తికి, గ్యాస్ ఆధారిత పరిశ్రమలకు లబ్ధిచేకూరుతుంది. ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రానికి న్యాయమైన వాటా దక్కేలా చూడాలి. మన దేశ రాజ్యాంగంలోని 297వ అధికరణం ప్రకారం సహజ వనరులు ప్రభుత్వం ఆస్తి. అంటే అది ప్రజల సంపద. అలాగే ఈ సహజ వనరుల ప్రయోజనం కూడా ప్రజలందరికీ కలిగేలా చూడాలని రాజ్యాంగంలోని అధికరణం 39(బి) స్పష్టంగా చెప్పింది. అసలు ఓ.ఎన్.జి.సి వంటి ప్రభుత్వ రంగ చమురు సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ బడా కార్పొరేట్ సంస్థలకు జాతీయ సంపదపై నియంత్రణలేని అధికారాన్ని, ఆధిపత్యాన్ని ఇవ్వడమే దేశ ప్రయోజనాలకు హానికరం. అనేక



దేశాలతో పాటు భారత్ కూడా చమురు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఇటీవల పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ధరలు మరింత పెరిగాయి. ఫలితంగా ఇతర నిత్యావసర వస్తువుల ధరలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయి. పశ్చిమాసియాలోని ప్రస్తుత ఉద్రిక్తతలు ఆందోళనకరంగా మారడమే ఈ సమస్యలకు ముఖ్య కారణం. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అహంకారపూరిత, ఏకపక్ష వైఖరి ప్రపంచ దేశాలకు పెను ముప్పుగా మారింది. రష్యానుండి మన దేశం చమురు కొనుగోలు చేస్తోందని నిందిస్తూ అదనంగా మరో 25 శాతం సుంకాలు విధించారు. దీంతో భారత్‌పై మొత్తం 50శాతం సుంకాలు విధించినట్లయింది. ప్రపంచ దేశాల స్వతంత్రత, సార్వభౌమాధికారంపై ట్రంప్ దాడి చేయడం గర్హనీయం. అమెరికన్ సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన సుంకాల విధింపును రద్దు చేసింది. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ అకస్మాత్తుగా ప్రారంభించిన యుద్ధం, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ చేసిన ఎదురుదాడితో మొత్తం చమురు రంగంపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికా, ఇజ్రాయిల్ అమానుష చర్యల వల్ల హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే చమురు రవాణాకు తీవ్రవిఘాతం ఏర్పడింది. పశ్చిమాసియాలో యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో, ఎలా ముగుస్తుందో అర్థం కాని పరిస్థితి ఇప్పటికీ నెలకొంది. ఈ నేపథ్యంలో కృష్ణా, గోదావరి బేసిన్‌లో సహజ వాయువు ఉత్పత్తి, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంమరోసారి చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర విభజన తర్వాత అనేక పారిశ్రామిక ఒప్పందాలు జరిగాయి. వీటి అమల్లో జాప్యం జరుగుతోంది. పరిశ్రమల స్థాపనకు విద్యుత్ సౌకర్యం అవసరం. అది కూడా చౌకగా అందచేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. బొగ్గు కంటే విద్యుత్ అందించడం చాలా తేలిక, చౌక కూడా. అంతేకాకుండా రాష్ట్రంలో ఉపాధి కొరత తీవ్రంగా నెలకొంది. ఇక్కడిసహజ వనరులను కైవసం చేసుకుని ప్రైవేట్ సంస్థ ఇతర రాష్ట్రాలకు అమ్ముకుని లాభాలు దండుకుంటోంది. ప్రత్యేకహోదా, ప్రత్యేక ప్యాకేజీల విషయంలో చేసిన వాగ్దానాల అమలులో ఇప్పటికే రాష్ట్రానికి అన్యాయం జరిగింది. కనీసం కె.జి బేసిన్ సహజ వాయువు ఉత్పత్తిలోనైనా 50 శాతం వాటా మనకు లభించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ ప్రయత్నం చేయాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. అఖిలపక్ష బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పెద్దలను ఒప్పించాలి. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గ్యాస్అత్యంత చౌకగా దొరుకుతుంది. కాబట్టి రాష్ట్ర ప్రజల హక్కులను, ప్రయోజనాలను కాపాడేందుకు కృషి వెంటనే చేపట్టాలి. ●

# పథకాల అమలుతో ఆత్మనిర్భరత బలోపేతం

డాక్టర్. పి.ఎస్. చారి

రెండువేల ఇరవైలో భారత ప్రభుత్వం ప్రారంభించిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారాన్నితగ్గించడం భారతదేశాన్ని ప్రపంచస్థాయి తయారీ కేంద్రంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆత్మనిర్భర్భారత్ దృష్టితో ఈపథకం పెట్టుబడులు, ఎగుమతులు, ఉపాధి సృష్టి, సాంకేతిక అభివృద్ధిని ప్రోత్సహిస్తోంది. భారత ప్రభుత్వం స్వయం సమృద్ధిని ప్రోత్సహించడం కోసం ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్‌లు, వస్త్రాలు, టెలికాం, సౌర శక్తి వంటి14 ముఖ్యరంగాల కోసం ప్రభుత్వం సుమారు 1.97లక్షల కోట్లను కేటాయించింది. ఈపథకం 2లక్షల కోట్లకుపైగా పెట్టుబడులను ఆకర్షించి, 18.7 లక్షల కోట్లకు పైగా అదనపు ఉత్పత్తి విలువను సృష్టించింది. అధిక పారిశ్రామిక ఉత్పత్తి ద్వారా భారతదేశ తయారీ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచి స్థూలదేశీయ ఉత్పత్తి వృద్ధికి ఇది దోహదపడింది. దేశవ్యాప్తంగా ప్రత్యక్ష, పరోక్షంగా 12.6 లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. ఆపిల్, శామ్‌సంగ్ వంటి కంపెనీలు భారతదేశంలో ఉత్పత్తిని విస్తరించడంతో భారతప్రపంచంలోని ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కేంద్రాలలో ఒకటిగా మారింది. మొబైల్ఫోన్ ఎగుమతులు 1.5 లక్షల కోట్లను దాటడంతో విదేశీమారక ఆదాయం గణనీయంగా పెరిగింది. పిఎల్ఐ పథకం కింద మొత్తం ఎగుమతులు 8లక్షల కోట్లను మించి, భారత దేశ వాణిజ్య పనితీరును మెరుగుపరిచాయి. ఔషధరంగంలో భారత్ దేశీయ ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారాన్ని తగ్గించింది. ఆటోమొబైల్ (పిఎల్ఐ) పథకం ఎలక్ట్రిక్ వాహనాల తయారీని, అధునాతన సాంకేతిక ఉత్పత్తిని ప్రోత్సహించింది. టెలికాం పరికరాల తయారీ కూడా పెరిగి విదేశీ దిగుమతులు తగ్గించడానికి సహాయపడింది. వివిధరాష్ట్రాల్లో 1,300కిపైగా తయారీ యూనిట్లు స్థాపించబడి ప్రాంతీయ పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించాయి. ఈ పథకం స్థానిక సరఫరా దారులు, అనుబంధ పరిశ్రమలకు అవకాశాలు కల్పించి చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతు ఇచ్చింది. స్థానిక ఉత్పత్తి, ఆవిష్కరణ, ఎగుమతులు, ఉపాధిని ప్రోత్సహించడం ద్వారా ఈపథకం భారత ఆర్థికవృద్ధిని బలోపేతం చేసి దేశాన్ని ఆత్మనిర్భర్భారత్ లక్ష్యానికి మరింత దగ్గర చేసింది. ఈ పథకం పరిధి లోని 14రంగాలలో, ఎలక్ట్రానిక్స్ రంగం అత్యుత్తమ ఫలితాలు చూపింది. ముఖ్యంగా మొబైల్ ఫోన్ల తయారీలో భారత ప్రపంచంలో రెండవ అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీ దేశంగా మారింది. 2024-25లో ఎగుమతులు 1.5లక్షల కోట్లను దాటాయి. ఆపిల్, శామ్‌సంగ్ వంటి కంపెనీలు భారత దేశంలో తమ ఉత్పత్తిని గణనీయంగా విస్తరించాయి. ఔషధ రంగం కూడా వైద్యపరికరాల దేశీయ ఉత్పత్తిని పెంచి, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించడం ద్వారా మంచి విజయాలు చూపింది. ఆటోమొబైల్, ఆటోభాగాల రంగం ఎలక్ట్రిక్



వాహనాల తయారీ, ఆధునిక ఆటోమోటివ్ సాంకేతికత పెట్టుబడుల పెరుగుదల కారణంగా వేగంగా అభివృద్ధి చెందింది. టెలికాం రంగం దేశీయంగా టెలికాం పరికరాల ఉత్పత్తిలో విజయాన్ని సాధించి, భారత్ దిగుమతులను తగ్గించడంలో, డిజిటల్ మౌలికసదుపాయాలను బలోపేతం చేయడంలో సహాయపడింది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం ప్రాసెస్డ్ ఆహారపదార్థాల ఎగుమతులను పెంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిని సృష్టించింది. వస్త్రరంగం, ముఖ్యంగా టెక్నికల్ టెక్స్‌టైల్స్, కొత్తపెట్టుబడులను ఆకర్షించి ఎగుమతి పోటీతత్వాన్ని మెరుగుపరిచింది. సౌరప్యానెల్ మాడ్యూల్ తయారీ కూడా ఈపథకం కింద వేగంగా విస్తరించి పునరుత్పాదక శక్తి లక్ష్యాలకు తోడ్పడుతున్నాయి. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం పథకం గణనీయమైన విజయాన్ని సాధించినప్పటికీ, ఇది అనేక ప్రధాన సవాళ్లను కూడా ఎదుర్కొంటోంది. ముఖ్యమైన సవాళ్లలో ఒకటి అనేక రంగాల్లో అమలులో, ప్రాజెక్ట్ అనుమతుల్లో జాప్యం. సౌర తయారీ రంగంలో, 2025 నాటికి లక్ష్యంగా పెట్టిన 65 గిగావాట్ సామర్థ్యంలో కేవలం సుమారు 31 గిగావాట్ మాత్రమే అమలులోకి వచ్చింది. సెమీకండక్టర్లు, సౌర ప్యానెల్, అధునాతన బ్యాటరీల వంటి రంగాల్లో అధిక మూలధన పెట్టుబడి అవసరాలు మరో సమస్యగాఉన్నాయి. అనేక సంస్థలు ప్రోత్సాహకాలు పొందడానికి అవసరమైన కఠినమైన డొమెస్టిక్వాల్యూ అడిషన్ నిబంధనలను పాటించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఆటోమొబైల్ ప్రోత్సాహక పథకంలో, స్థానికీకరణ అవసరాల కారణంగా 84 అర్హత కలిగిన కంపెనీలలో కేవలం 16కంపెనీలు మాత్రమే ప్రోత్సాహకాలకు అర్హత సాధించాయి. ఎలక్ట్రానిక్స్, సౌరతయారీ వంటిరంగాల్లో ముడిపదార్థాలు భాగాలకోసం, ముఖ్యంగా చైనామీద దిగుమతి ఆధారితత కొనసాగుతోంది. తరచుగా మారే విధానాలు, వాణిజ్య విధాన అనిశ్చితి పెట్టుబడిదారుల విశ్వాసాన్ని కూడా ప్రభావితంచేస్తున్నాయి. సౌరప్రోత్సాహక పథకం 2025 మధ్య నాటికి తన పాలిసిలికాన్ సామర్థ్య లక్ష్యంలో కేవలం 14శాతం మాత్రమే సాధించింది. ఇది అప్‌స్ట్రీమ్ తయారీ వృద్ధిబలహీనంగా ఉందని సూచిస్తుంది. భూమి సేకరణ జాప్యాలు, లాజిస్టిక్స్ ఖర్చులు, తగిన విద్యుత్ సరఫరాలేకపోవడం వంటి మౌలిక సదుపాయ సమస్యలు పారిశ్రామిక విస్తరణను నెమ్మదించిస్తున్నాయి. కొందరు నిపుణులు కొన్నిరంగాల్లో ఉద్యోగాల సృష్టి అంచనాలకంటే తక్కువగా ఉందని కూడా అభిప్రాయపడుతున్నారు. కాబట్టి తయారీ, ఎగుమతులను పెంచినప్పటికీ, ఈపథకం అమలు జాప్యాలు, దిగుమతి ఆధారితత, అధిక ఖర్చులు, నియమాల అనుసరణ సమస్యలు మౌలిక సదుపాయాల లోపాలు వంటి సవాళ్లను ఇంకా ఎదుర్కొంటోంది. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం అనుమతి ప్రక్రియలను సరళీకరించి, పరిశ్రమలకు ప్రోత్సాహకాలను వేగంగా విడుదల చేయడం నిర్ధారించాలి. చిన్న సంస్థలుసరఫరా శృంఖలాల్లో పాల్గొని దేశీయ విలువ జోడింపును పెంచేందుకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మరింత మద్దతు ఇవ్వాలి. ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్, సౌర రంగాల్లో స్థానిక భాగాల తయారీని ప్రోత్సహించడం ద్వారా దిగుమతి ముడి పదార్థాలపై ఆధారాన్ని భారత్ తగ్గించాలి. రవాణా, లాజిస్టిక్స్, పోర్టులు, విద్యుత్ సరఫరావంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంద్వారా పరిశ్రమలు ఉత్పత్తి ఖర్చులను తగ్గించగలవు. అధునాతన తయారీ రంగాల కోసం అత్యంత నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని తయారు చేయడానికి ప్రభుత్వం నైపుణ్య అభివృద్ధి, సాంకేతిక శిక్షణలో మరింత పెట్టుబడి పెట్టాలి. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచేందుకు స్థిరమైన వాణిజ్య విధానాలు, దీర్ఘకాలిక విధాన స్పష్టత అవసరం. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను సాధించవచ్చు. ●




## ఎబోలా వైరస్‌కు వ్యాక్సిన్ తెచ్చామన్న రష్యా!

**మాస్కో, మే 27:** ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎబోలా కొత్త వేరియంట్‌కు రష్యా వ్యాక్సిన్‌ను ఆవిష్కరించింది. కాంగో, ఉగాండా దేశాల్లో బుండిబుగ్యో అనే కొత్త రకం ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతుండటంతో ఈ ప్రాణాంతక వేరియంట్‌కు ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు పొందిన టీకా లేదు. తాజాగా రష్యా తెచ్చిన కొత్త ఆవిష్కరణకు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం సెంట్రల్ ఆఫ్రికా దేశాల్లో బుండిబుగ్యో ఎబోలా రకం తీవ్ర కలకలం రేపుతోంది. కాంగోలో దీని తీవ్రత అత్యంత ప్రమాదకర స్థాయికి చేరినట్లు డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. ఇప్పటికే అక్కడ వందలాది మంది ఈ వైరస్ బారిన పడ్డారు. డజన్ల కొద్దీ మరణాలు సంభవించడంతో అంతటా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు అందుబాటులో ఉన్న ఎబోలా వ్యాక్సిన్లు కేవలం జైర్ అనే పాత వేరియంట్‌పై మాత్రమే పనిచేస్తుండటంతో ఈ కొత్త ముప్పును అడ్డుకోవడం వైద్య నిపుణులకు సవాలుగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రష్యా ఆరోగ్య శాఖ మంత్రి మిఖాయిల్ మురాష్కో ఈ ప్రకటన చేశారు. తమ దేశ పరిశోధకులు తయారు చేసిన కొత్త టీకా ఈ అరుదైన బుండిబుగ్యో వేరియంట్ నుంచి పూర్తి రక్షణ కల్పిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీనితో పాటు ఆఫ్రికా దేశాలకు ఎబోలా నిర్ధారణ కిట్లు, అవసరమైన వైద్య సాయాన్ని అందిస్తామని రష్యా రాయబార కార్యాలయం తెలిపింది. ప్రస్తుతం బ్రిటన్, అమెరికా పరిశోధకులు కూడా ఈ వైరస్‌కు విరుగుడు కనిపెట్టే పనిలో నిమగ్నమయ్యారు. రష్యా ఆవిష్కరణపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొన్నప్పటికీ అంతర్జాతీయ ఆరోగ్య నిపుణులు మాత్రం కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన క్లినికల్ ట్రయల్స్ డేటాను రష్యా ఇంకా బహిరంగంగా వెల్లడించలేదు. ప్రజల్లోకి ఈ టీకాను విస్తృతంగా తీసుకెళ్లడానికి ముందు మనుషులపై ప్రయోగాలు, శాస్త్రీయ విశ్లేషణలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అనుమతులు తప్పనిసరని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అప్పటివరకు వైరస్ నిర్ధారణ, రోగుల ఐసోలేషన్ వంటి నివారణ చర్యలే ప్రధాన ఆయుధాలని పేర్కొంటున్నారు.

## దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు 31 మంది మృతి



**బీరూట్, మే 27:** శాంతి చర్చలతో త్వరలోనే పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలుకుతుందని ఆశించిన వారికి నిరాశే ఎదురవుతున్నది. ఓ వైపు శాంతి చర్చలు జరుగుతుండగానే ఇరాన్‌లోని దక్షిణ ప్రాంతాలపై అమెరికా తీవ్ర దాడులకు దిగింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. దక్షిణ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మైన్స్ అమర్చుతున్న పడవలపై తాము ఆత్మరక్షణ దాడులు నిర్వహించినట్టు అమెరికా సైన్యం తెలిపింది. తాజాగా ఇజ్రాయెల్‌లెబనాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో పలువురు చిన్నారులతో సహా కనీసం 31 మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అర్ధరాత్రి గాజాపై ఇజ్రాయెల్ రెండు చోట్ల వైమానిక దాడులక పాల్పడింది. ఈ దాడుల్లో ముగ్గురు పాలస్తీనియన్లు మరణించగా 12 మంది గాపడ్డారు. ఏప్రిల్‌లో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత జరిగిన అతి పెద్ద దాడి ఇదేనని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు తమ సరిహద్దు ప్రాంతాలపై రాకెట్లు ప్రయోగించారని , దానికి ప్రతిస్పందనగానే ఈ దాడులు నిర్వహించినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇజ్రాయెల్ దళాలను తమ యోధులు సమర్దవంతంగా ఎదుర్కొన్నారని హిజ్బుల్లా తెలిపింది. వైమానిక దాడులు, ఫిరంగి కాల్పుల తర్వాత జౌతర్ అల్‌షర్కియా వైపు దూసుకొస్తున్న ఇజ్రాయెల్ దళాన్ని హిజ్బుల్లా యోధులు వెనక్కి తరిమికొట్టారని ఆ సాయుధ బృందం పేర్కొంది. ఆ పట్టణంలో ఇజ్రాయెల్ దళాలపై జరిగిన వరుస డ్రోన్, రాకెట్ దాడులకు తామే బాధ్యులమని స్పష్టం చేసింది.

# మమత ఎమ్మెల్యేలు, ఎంపిలు బిజెపిలోకి!

### - దాదాపు 70 మంది తమతో టచ్‌లో ఉన్నారంటున్న బిజెపి ఎంపి సౌమిత్రఖాన్



**కోల్‌కత్తా, మే 27:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కలకలం రేగుతోంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కి చెందిన దాదాపు 50 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, బీజేపీ కేంద్ర నాయకత్వం పచ్చజెండా ఊపితే వారంతా కాషాయ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ ఎంపీ సౌమిత్రఖాన్ బుధవారం సంచలన ప్రకటన చేశారు. ఒకవేళ వీరందరినీ చేర్చుకోవాలని బీజేపీ నిర్ణయిస్తే తృణమూల్ కాంగ్రెస్ ఒక రాజకీయ శక్తిగా ఉనికినే కోల్పోతుందని ఆయన పేర్కొన్నారు. సౌమిత్రఖాన్ చేసిన ఈ వ్యాఖ్యలను తృణమూల్ సీనియర్ ఎంపీ సౌగతా రాయ్ పూర్తిగా ఖండించారు. ఇదంతా అబద్ధమని, బీజేపీ ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని కొట్టిపారేశారు. ఇదే సమయంలో సౌమిత్రఖాన్ టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనను ఒక పాపిగా అభివర్ణిస్తూ, పాపం చేసిన వారు జైలుకు వెళ్లక తప్పదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఆయన ఇంటి ముందు బుల్డోజర్ సిద్ధంగా ఉందని, గతంలో బీజేపీ కార్యకర్తల ఇళ్లను కూల్చివేయించినందుకు ఆయన తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఘాటుగా విమర్శించారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు మండుతున్నాయి. అవినీతి ఆరోపణలు, అంతర్గత విభేదాల నడుమ బారాసత్ టీఎంసీ ఎంపీ కాకొలి ఘోష్ దస్తీదార్, ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలో జరిగిన ఒక అధికారిక సమీక్షా సమావేశానికి హాజరుకావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల లోక్‌సభలో టీఎంసీ చీఫ్ విప్ పదవి నుంచి తొలగించబడిన కాకొలి ఘోష్, ఆ తర్వాత బారాసత్ పార్టీ అధ్యక్ష పదవికి కూడా రాజీనామా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆమెకు వైకేటగిరీ భద్రతను కల్పించడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీలకు చెందిన దాదాపు 100 మంది కౌన్సిలర్లు ఇటీవల రాజీనామా చేయడం తృణమూల్ పునాదులను కదిలిస్తోంది. భట్పరా మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ రేబా రాహా సహా 35 మంది కౌన్సిలర్లలో 30 మంది వైదొలిగారు. హాలిసహర్‌లో 16 మంది, కాంచ్రాపారలో 14 మంది కౌన్సిలర్లు రాజీనామాలు సమర్పించారు. కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హాకీమ్ కూడా తన పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మున్సిపల్ వ్యవహారాల మంత్రి అగ్నిమిత్ర పాల్ ఇప్పటికే కౌన్సిలర్లు రాని మున్సిపాలిటీలకు అడ్మినిస్ట్రేటర్లను నియమిస్తామని ప్రకటించారు.

దీనికి తోడు మున్సిపల్ నియామకాల అవినీతి కేసులో మాజీ మంత్రి సుజిత్ బోస్ అరెస్ట్ కావడం, పలువురు నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థల నిఘా కొనసాగుతుండటం టీఎంసీని తీవ్ర స్వీయరక్షణలోకి నెట్టేసింది.

## చంద్రుడిపై నాసా శాశ్వత మానవబేస్!

### 2028 నాటికి చంద్రునిపైకి నాసా వ్యోమగాములు!

**టెక్సాస్, మే 27:** చంద్రుడు మీదకు రోవర్లను పంపిన నాసా ఇప్పుడు అక్కడ శాశ్వత మానవ బేస్‌ను ఏర్పాటు చేసే కసరత్తులుప్రారంభించింది. కొత్తగా మూడు మిషన్లు చేపట్టనున్నట్లు నాసా వెల్లడించింది. నాసా అడ్మినిస్ట్రేటర్ జేర్డ్ ఐజాక్‌మాన్ మాట్లాడుతూ పర్మనెంట్ బేస్‌ను చంద్రుడిపై నిర్మించేందుకు సుమారు 20 బిలియన్ల డాలర్లు ఖర్చు అవుతోందన్నారు. లూనార్ రోవర్లు, డ్రోన్లను అక్కడ ఏర్పాటు చేయనున్నారు. ప్రమాదకరమైన వాతావరణంలో ప్రయోగాలు నిర్వహించే రీతిలో అక్కడ ఏర్పాట్లను కల్పించనున్నారు. చందమామపైకి మళ్లీ అమెరికా వెళ్తోందని, బయట ప్రపంచంలో మానవుడు ఏర్పాటు చేసుకోబోతున్న తొలి మానవ బేస్ ఇదే అన్నారు. 2028 నాటికి చంద్రుడిపై ఆస్ట్రోనాట్లను దింపాలని నాసా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దానికి తగిన ప్రణాళికలతో నాసా ముందుకు వెళ్తున్నది. బ్లూ ఆర్జిన్స్ కు చెందిన బ్లూ మూన్ మార్క్ 1 ఎండ్యూరెన్స్ ల్యాండర్‌ను పంపనున్నారు. మూన్ బేస్1 మిషన్‌లో భాగంగా ఆ ల్యాండర్ చంద్రుడిపై దిగనున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఆ ప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి. షాకల్టన్ కనెక్టింగ్ రిడ్జ్ ప్రాంతంలో ల్యాండర్‌ను దింపనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆర్టెమిస్2 మిషన్‌లో భాగంగా నలుగురు ఆస్ట్రోనాట్లు చంద్రుడిని చుట్టి వచ్చిన విషయం తెలిసిందే. మూన్ బేస్ 2 మిషన్‌లో సుమారు 1100 పౌండ్ల కార్గోను పంపనున్నారు. ఆస్ట్రోబోటిక్ గ్రిఫిన్ ల్యాండర్ ద్వారా డెలివరీ చేస్తారు. ఇక మూన్ బేస్ 3 మిషన్‌లో భాగంగా లూనార్ వెర్టిక్స్ ను పంపనున్నారు. చంద్రుడిపై ఉన్న గురుత్వాకర్షణ గురించి ఆ మిషన్ స్టడీ చేస్తుంది. ఈ ప్రయోగంలో యురోపియన్, కొరియన్ స్పేస్ ఏజెన్సీ పేలోడ్స్ కూడా వెళ్తాయి. మూడు దశల ప్రోగ్రామ్ ద్వారా రాబోయే మూడేళ్లలో చంద్రుడి ఉపరితలాన్ని నాసా సిద్ధం చేయనున్నది. చంద్రుడి ఉపరితలంపై తిరిగే ఓ వాహనాన్ని కూడా నాసా సిద్ధం చేస్తున్నది. లూనార్ సర్ఫేస్‌పై ఆస్ట్రోనాట్స్ తిరిగే అవకాశాలు ఉంటాయి. మూన్ బేస్ రెండో ఫేజ్‌లో 2029 నుంచి 2032 మధ్య పర్మనెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించనున్నారు. దీనిలో భాగంగా ఓ పవర్ గ్రిడ్‌ను నిర్మిస్తారు. 2032 నుంచి మూడో దశను చేపడతామని నాసా డైరెక్టర్ వెల్లడించారు.

### ఆశారాంబాపూ వెంటనే లొంగిపోవాలని ఆదేశం

## కిందికోర్టు జీవితఖైదు శిక్షను సమర్థించిన హైకోర్టు

**జైపూర్, మే 27:** రాజస్థాన్‌కు చెందిన స్వయం ప్రకటిత ఆధ్యాత్మిక గురువు ఆశారాం బాపూకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మైనర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో కింది కోర్టు విధించిన జీవిత ఖైదును రాజస్థాన్ హైకోర్టు సమర్థించింది. ఆయన దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. ప్రస్తుతం మధ్యంతర వైద్య బెయిల్‌పై బయట ఉన్న 86 ఏళ్ల ఆశారాం వెంటనే అధికారుల ఎదుట లొంగిపోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇదే కేసులో సహ నిందితులుగా ఉన్న శిల్పి, శరత్‌చంద్‌లను నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు విముక్తి కల్పించింది. జస్టిస్ అరుణ్ మోంగా, జస్టిస్ యోగేంద్ర కుమార్ పురోహిత్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. 2013 ఆగస్టులో జోధ్‌పూర్‌లోని తన ఆశ్రమంలో మైనర్ బాలికపై ఆశారాం లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సుదీర్ఘ విచారణ అనంతరం జోధ్‌పూర్‌లోని ప్రత్యేక పోక్సో కోర్టు 2018 ఏప్రిల్ 25న ఆశారాంను దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఆశారాం హైకోర్టును ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై 2026 ఫిబ్రవరి 16 నుంచి ఏప్రిల్ 20 వరకు హైకోర్టు రోజువారీ విచారణ జరిపి, తీర్పును రిజర్వ్ చేసి బుధవారం తుది తీర్పును వెల్లడించింది. ప్రాసిక్యూషన్, బాధితురాలి తరఫు న్యాయవాది పి.సి. సోలంకి ఈ వాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. పోక్సో చట్టం ప్రకారం బాధితురాలి వాంగ్మూలమే శిక్ష విధించడానికి సరిపోతుందని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు పలుమార్లు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. కేసును తప్పుదోవ పట్టించేందుకు సాక్షులపై దాడులు, హత్యలు జరిగాయని కూడా వారు కోర్టుకు తెలిపారు. ఆశారాం ఇప్పటికే గుజరాత్‌లోని గాంధీనగర్ ఆశ్రమంలో మరో మహిళపై అత్యాచారం కేసులో దోషిగా తేలి జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. ఆ కేసులో 2023 జనవరిలో ఆయనకు శిక్ష పడింది.

## ఉగాండా నుంచి వచ్చిన మహిళకు ఎబోలా పరీక్షలు

### వైరాలజీ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు ధ్రువీకరణ

**బెంగళూరు, మే 27:** ఆఫ్రికా దేశాల లో వేగంగా వ్యాపిస్తున్న ఎబోలా వైరస్ పై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. ఈ క్రమంలో కర్ణాటక రాజధాని బెంగళూరులో ఎబోలా కలకలం రేగింది. ఉగాండానుంచి వచ్చిన మహిళలో ఎబోలా వ్యాధి లక్షణాలు కనిపించాయి. దాంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 28 ఏళ్ల ఉగాండా మహిళ ఈ నెల 23న కెంపెగౌడ విమానాశ్రయంలో దిగారు. అయితే ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు అధికారులు విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సదరు ఉగాండా మహిళకు కూడా స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. దాంతో ఆ మహిళలో ఎబోలా వ్యాధికి సంబంధించి తేలికపాటి లక్షణాలను గుర్తించారు. వెంటనే ముందుజాగ్రత్త చర్యగా ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఆమె శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపించారు. పంపిస్తే ఆమెకు నెగిటివ్ రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం ఆ మహిళ ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కర్ణాటక ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి రిత్విక్ రంజన్ పాండే దీనిపై మాట్లాడారు. ప్రస్తుతం ఆ మహిళ వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉందన్నారు. ఆమెలో కన్పించిన లక్షణాలు ఎబోలాకు సంబంధించినవేనా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేమని చెప్పారు.

## సంక్షిప్తంగా..

### గేమింగ్ టైకూన్ హత్యకేసులో మాజీ సిఇఒకు ఉరిశిక్ష అమలు

**బీజింగ్,మే 27:** గేమింగ్ టైకూన్, బిలియనీర్ లిన్ క్వి హత్య కేసులో మాజీ సీఈవో జూ యావోకు చైనా అధికారులు మరణశిక్ష అమలు చేశారు. లిన్‌కు విషం ఇచ్చి చంపినట్లు జూ యావోపై ఆరోపణలు ఉన్నాయి. 3 బాడీ ప్రాబ్లం అనే సైన్స్ ఫిక్షన్ సిరీస్ విషయంలో ఇద్దరి మధ్య విబేధాలు తలెత్తాయి. అయితే ఆ సమయంలో యోజూ గేమ్స్ వ్యవస్థాపకుడు లిన్‌కు విషం ఇచ్చి యావో హత్యకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.

యావోను ఈనెల 21వ తేదీన ఉరి తీసినట్లు చైనా అధికారులు వెల్లడించారు.

లిన్ హత్య కేసు చైనావ్యాప్తంగా పెను సంచలనం రేపింది.

### ఉమ్మడి పౌరస్మృతి బిల్లుకు అసోం అసెంబ్లీ ఆమోదం



**గువాహతి, మే 27:** వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన ఉమ్మడి పౌరస్మృతి యూసీసి బిల్లును అసోం అసెంబ్లీ ఆమోదించింది. ప్రతిపక్షాల నిరసనల మధ్య బిల్లు బుధవారం ఆమోదం పొందింది. ఈ బిల్లును కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు పొలిటికల్ ఎజెండా బిల్లుగా పేర్కొన్నాయి. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఈ బిల్లును విస్తృత సంప్రదింపుల కోసం ఎంపిక చేసిన కమిటీకి పంపాలని కూడా ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. యూసీసీని అమలు చేస్తున్న మూడో రాష్ట్రంగా అసోం నిలిచింది. ఇప్పటివరకూ ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాలు యూసీసీని ఆమోదించి అమలు చేస్తున్నాయి. అసోంలో ఐదు రోజుల ప్రత్యేక అసెంబ్లీని హిమంత బిశ్వ శర్మ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వహిస్తోంది.

### ఎనిమిది గంటలకు పైగా గాల్లోనే ఎయిరిండియా చక్కర్లు

**న్యూఢిల్లీ, మే 27:** 230 మంది ప్రయాణికులతో శాన్‌ఫ్రాన్సిస్కో వెళుతున్న ఎయిరిండియా విమానం, ఎనిమిది గంటలకు పైగా గాలిలో ప్రయాణించిన తర్వాత ఢిల్లీకి తిరిగి వచ్చింది. సాంకేతిక సమస్య కారణంగా ఆ విమానం చైనా గగనతలం నుంచి ఢిల్లీకి తిరిగివచ్చింది. విమాన సంస్థ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 777-300 ఈఆర్ బుధవారం శాన్‌ఫ్రాన్సిస్కోకు బయలుదేరింది.

విమానం చైనా గగనతలంలో ఉండగానే సాంకేతిక లోపం తలెత్తడంతో 8 గంటలు గాల్లోనే చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి తిరిగి ఢిల్లీకి బయలుదేరింది.

### గుజరాత్‌లో రూ.1000 కోట్లకు పైగా కొకైన్ సీజ్!



**గాంధీనగర్, మే 27:** మాదక ద్రవ్యాల రవాణాపై కేంద్రం ఉక్కుపాదం మోపింది. తాజాగా గుజరాత్‌లోని కచ్ తీరంలో భారీ మొత్తంలో కొకైన్ దొరికింది. దాని విలువ రూ.1000 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. పాకిస్థాన్‌లోని ఖాసిం పోర్టు నుంచి ఒక యూరోపియన్ నౌక కచ్ తీరానికి వచ్చింది. ఈ నౌకలో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుజరాత్ ఉగ్రవాద నిరోధక దళం, భారత కోస్ట్‌గార్డ్ అధికారులు గమనించారు. నౌకలోంచి కొన్ని సంచులను సముద్రంలోకి విసిరేయడాన్ని గుర్తించారు. దీంతో వెంటనే అధికారులు రంగంలోకి దిగి ఆ సంచులను స్వాధీనం చేసుకుని పరీక్షించగా అవి కొకైన్ అని తేలింది. దాదాపు 100 కిలోలకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

### పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాభరణాలు అదృశ్యం

**తిరువనంతపురం, మే 27:** తిరువనంత పురం లోని ప్రసిద్ధ పద్మనాభస్వామి ఆలయంలో బంగారం, వజ్రాల ఆభరణాలు అదృశ్యం కావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేరళ డిజిపి వెల్లడించడంతో ఆలయ భద్రతపై భక్తుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్వామి ఆభరణాలు కనిపించకుండా పోయాయని కేరళ హోం శాఖ సెక్రటరీకి డిజిపి సమర్పించిన నివేదిక చర్చనీయాంశమైంది. డిజిపి నివేదిక ప్రకారం ఆలయం నుంచి సుమారు 78 గ్రాముల బంగారు, వజ్రాల ఆభరణాలు అదృశ్యమయ్యాయి. వాటిలో వైరమ్ నామంగా పిలువబడే వజ్రాల ఆభరణం కూడా ఉంది. అధికారిక రికార్డుల ప్రకారం వైరమ్ నామాన్ని మరమ్మతుల కోసం కొన్ని నెలల కిందట ఆలయం నుంచి బయటకు తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత దానిని తిరిగి తీసుకురాలేదు.

అదే విధంగా ఆరు నెలల కిందట ఆలయం నుంచి తీసుకెళ్లిన బంగారు దీపం కూడా కనిపించకుండా పోయింది.

### ప్రభుత్వనేతలకు కునుకు లేకుండాచేస్తున్న కాక్రోచ్ జనతాపార్టీ!

**న్యూఢిల్లీ, మే 27:** భారతదేశ రాజకీయ ముఖచిత్రంలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అనే ఒక సరికొత్త సోషల్ మీడియా ఉద్యమం ప్రభుత్వ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. బొద్దింక అమెరికా యూనివర్సిటీలో ఉండే ఒక సాధారణ కమ్యూనికేషన్ స్ట్రాటజిస్ట్ అభిజీత్ దిప్కే ప్రారంభించిన ఈ వ్యంగ్య ఉద్యమం ఇటు అధికార శ్రేణుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) దేశంలోని నిరుద్యోగ యువతను ఉద్దేశించి చేసిన బొద్దింక వ్యాఖ్యలే ఈ తిరుగుబాటుకు కారణమయ్యాయి. తమను హేళన చేసినట్లు భావించిన లక్షలాది మంది నిరుద్యోగ యువత ఈ కాక్రోచ్ జనతా పార్టీ పేరిట నెట్టింట ఒక్కటయ్యారు. విచిత్రమేమిటంటే ఈ సీజేపీకి ఎలాంటి ఆఫీసు, లీడర్, క్యాడర్ లేవు. కేవలం సైబర్ ప్రపంచంలో సాగుతున్న ఈ ఉద్యమాన్ని చూసి కేంద్రం ఎందుకు ఉలిక్కిపడుతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రభుత్వం ప్రకటనల ద్వారా నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, ఆర్థిక వైఫల్యాలను కప్పిపుచ్చి తమకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోంది.

# చిన్నారులపై ప్రిస్కూళ్లు, డేకేర్‌సెంటర్లలో లైంగిక దాడులు

### దేశవ్యాప్తంగా దర్యాప్తు చేపట్టిన ఫ్రాన్స్ సర్కార్




**ప్యారిస్, మే 27:** ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో అత్యంత కలకలం రేపుతున్న చిన్నారుల లైంగిక వేధింపుల కుంభకోణం ఇప్పుడు ఆ దేశాన్ని వణికిస్తోంది. పాఠశాలలు, డేకేర్ సెంటర్లలో చిన్న పిల్లలను పర్యవేక్షించే బాధ్యత కలిగిన సిబ్బంది చిన్నారులపై హింసకు పాల్పడటమే కాకుండా లైంగిక దాడులు, అత్యాచారాలకు ఒడిగట్టారనే ఆరోపణలపై అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. రాజధాని నగర వ్యాప్తంగా దాదాపు 84 ప్రిస్కూళ్లు, 20 ప్రైమరీ స్కూళ్లు, 10 డేకేర్ సెంటర్లలో ఈ దర్యాప్తు కొనసాగుతోందని పారిస్ ప్రాసిక్యూటర్ లోర్ బెక్యువా వెల్లడించారు. సుమారు వందమందికిపైగా ఈ బాధితులున్నారు. ఇది కొంతకాలంగా కొనసాగుతున్నట్లు అంచనా. లంచ్ బ్రేక్‌లు, విరామ సమయాలు, పిల్లలు నిద్రపోయే వేళల్లో వారిని చూసుకునే స్కూల్ మానిటర్లే ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరు నేషనల్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ద్వారా కాకుండా స్థానిక సంస్థల ద్వారా నియమితులైన వారని తెలుస్తోంది. పిల్లలపై అరవడం, జుట్టు పట్టుకుని లాగడం, ఆహారం ఇవ్వకపోవడంతో పాటు లైంగిక వేధింపులకు గురిచేశారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదులపై అధికారులు స్పందించడానికి నెలల సమయం పట్టిందని బాధితుల తరఫు న్యాయవాదులు పేర్కొంటున్నారు. ఈ స్కాండల్‌కు సంబంధించిన ఒక ప్రధాన కేసు విచారణ ఈ వారంలో పారిస్ కోర్టులో ప్రారంభం కావడంతో ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. 36 ఏళ్ల స్కూల్ అసిస్టెంట్ డేవిడ్ 3 నుంచి 5 ఏళ్ల వయసున్న ఐదుగురు ప్రీ స్కూల్ చిన్నారులపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు ఇద్దరు మహిళా సహోద్యోగులను వేధించాడనే ఆరోపణలపై కోర్టుకు హాజరయ్యాడు. ఆరోపణలను తిరస్కరిస్తున్నప్పటికీ, చిన్నారులను తన ఒళ్లో కూర్చోబెట్టుకోవడం వంటి నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ కేసులో నిందితుడిపై నేరం రుజువైతే 10 ఏళ్ల జైలు, 1.50లక్షలయూరోలజరిమానా పడుతుందన్నారు.

## సిబిఎస్ఇ ఫలితాల్లో భారీ అవకతవకలు - జుడీషియల్ విచారణ జరిపించాలి

### - లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ డిమాండ్ - కోఎంప్ట్‌కు సిబిఎస్ఇ కాంట్రాక్టు ఎందుకిచ్చారని నిలదీత

**న్యూఢిల్లీ, మే 27:** సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలు "భారీ అవకతవకల"తో మలినమయ్యాయని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ "మొత్తం కుంభకోణం" వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీసేందుకు స్వతంత్ర న్యాయ విచారణ, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోఎంప్ట్‌కు సిబిఎస్ఇ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కోఎంప్ట్ యాజమాన్యానికీ, మోడీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం అసలు ఎలాంటిదని కూడా ఆయన ప్రశ్నించారు. "సిబిఎస్ఇ పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో మకిలిపడ్డాయి, దీంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు" అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "ఇక ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ విషయానికొస్తే? ఎప్పటిలాగే సమాధానాలు లేవు, జవాబుదారీతనం లేదు, సిగ్గు లేదు" అని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు దుయ్యబట్టారు. ఈ బాధ్యత అప్పగించిన 'కోఎంప్ట్' సంస్థ, గతంలో 2019లో తెలంగాణలో 'గ్లోబరేనా' పేరుతో పనిచేస్తూ ఇలాంటి దుష్కార్యాలకే పాల్పడిందని రాహుల్ ఆరోపించారు. పేరు మారినా ఉద్దేశం మారలేదు, దాని స్వభావం కూడా మారలేదని ఆయన అన్నారు. దాని చరిత్ర బహిరంగంగానే ఉన్నప్పటికీ, లెక్కచేయకుండా కాంట్రాక్టును అప్పగించారని రాహుల్ ఆరోపించారు. 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అలాంటి సంస్థకు అప్పగించారని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. "ఇది పొరపాటు కాదు ఇది పథకం ప్రకారం చేసిన కుట్ర," అని ఆయన మండిపడ్డారు. సిబిఎస్ఇ కాంట్రాక్టును కోఎంప్ట్‌కు ఎందుకు, ఎవరి ఆదేశాల మేరకు ఇచ్చారు? ఈ కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడానికి ఏ నిర్దిష్ట నియమ నిబంధనలను ఉల్లంఘించారు? గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు కోఎంప్ట్ గతంలో వివాదాల్లో చిక్కుకున్నప్పటికీ, ఈ విషయం సిబిఎస్ఇకి ఎలా తెలియకుండా పోయింది? నేపథ్య తనిఖీలు ఎందుకు నిర్వహించలేదు? కోఎంప్ట్ యాజమాన్యానికీ, మోడీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం అసలు స్వరూపం ఏమిటి? అని రాహుల్ గాంధీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజాన్ని వెలికితీసి, అసలు దోషులను బయటపెట్టడానికి తక్షణమే ఒక స్వతంత్ర న్యాయ విచారణను, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (ఎస్ఐటి) ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నాము" అని కాంగ్రెస్ అధినేత అన్నారు. "సిబిఎస్ఇ పరీక్షలు రాస్తున్న మన జెన్ జెడ్ మిత్రులకు మీ కష్టఫలాలను గానీ, మీ భవిష్యత్తును గానీ ఎవరూ దొంగిలించలేరు.

# జూరాలకు అకాల జలకళ

## పెరిగిన వరద ప్రవాహం

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ఎండ తీవ్రతతో అడుగంటిపోతున్న కృష్ణమ్మ ఒడిలోకి అకాల వర్షాలు సరికొత్త ఆశలను మోసుకొచ్చాయి. జూరాల ప్రాజెక్టు ఎగువన (పరివాహక ప్రాంతాల్లో) కురిసిన అకాల వర్షాల కారణంగా జలాశయానికి వరద నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి ప్రస్తుతం 1,550 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఎండల తీవ్రతకు ఎండిపోతున్న జలాశయానికి ఈ ప్రవాహం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పాలి. జూరాల ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు. అయితే ప్రస్తుతం జలాశయంలో 4.325 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇందులో డెడ్ స్టోరేజ్ కాకుండా, కేవలం 0.618 టీఎంసీల నీటిని మాత్రమే తాగునీటి అవసరాలకు, ఇతర అత్యవసర అవసరాలకు వాడుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. మండుటెండల్లో తాగునీటి ఎద్దడి రాకుండా చూసేందుకు ఈ స్వల్ప వరద నీరు కొంతవరకు దోహదపడుతుందని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. ఎగువన వర్షాలు ఇలాగే కొనసాగితే ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది.



బుధవారం న్యూఢిల్లీలో జాతీయ బిసి కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

## జాతీయ బిసి కమిషన్ చైర్మన్‌కు ఆర్.కృష్ణయ్య బృందం వినతి

**హైదరాబాద్ మే 27 ప్రభాతవార్త :** కేంద్రంలో బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి బడ్జెట్ కేటాయింపులను రూ.2 లక్షల కోట్లకు పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతిని కలిసి సుదీర్ఘంగా చర్చించి, వినతిపత్రం సమర్పించింది. ఈ చర్చల్లో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పెరికె సురేష్, ఆశిష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. దేశంలో 56శాతం జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ లేకపోవడం వల్లే ఆయా కులాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందడం లేదని ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో అమలు చేస్తున్న విధంగానే దేశమంతటా హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను వర్తింపజేసేలా జాతీయ బీసీ కమిషన్ కేంద్రానికి రాజ్యాంగబద్ధమైన సిఫార్సు చేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. **కేంద్రానికి సిఫార్సు చేస్తాం: కమిషన్ చైర్మన్ హామీ:** బీసీ నేతలు సమర్పించిన డిమాండ్లు అత్యంత న్యాయమైనవని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాధ్వి నిరంజన్ జ్యోతి సానుకూలంగా స్పందించారు. ఈ అంశాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు వుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, గురుకుల పాఠశాలల విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రతినిధి బృందానికి స్పష్టం చేశారు.

# రైతు సమస్యలపై రాజకీయాలు వద్దు

## రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రైతుల సమస్యలను కేంద్రంగా చేసుకొని ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని రైతు కమిషన్ సూచించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కమిషన్ చైర్మన్ కొదండరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని రోజులుగా వడ్లు, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తోందని తెలిపారు. బాసటగా నిలబడాల్సిన రాజకీయ నాయకులు రైతులను మానసికంగా దెబ్బతీసేలా, రెచ్చగొట్టేలా మాట్లాడడం సరికాదన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్నప్పటికీ మద్దతు ధరల వ్యవస్థలో ఉన్న 23 పంటల కొనుగోళ్ల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదన్నారు. నకిలీ విత్తనాల విషయంలో ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని తెలిపారు. దేశంలో విత్తనోత్పత్తిలో తెలంగాణ వాటా 40శాతం నుంచి 45 శాతం వరకు ఉందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ కాలంలో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం తీసుకురావడం వల్ల కంపెనీలకే అధికారం వెళ్లిపోయిందని, ఇది పెద్ద తప్పిదమని విమర్శించారు. సాధారణంగా కొత్త విత్తనాలను వ్యవసాయశాఖ ధృవీకరించి సర్టిఫికేషన్ ఇచ్చిన తర్వాతే రైతులకు విక్రయించాల్సి ఉంటుందని చెప్పారు. నకిలీ విత్తన మాఫియా నుంచి రైతులను రక్షించేలా కఠినమైన జీవో తీసుకురావాల్సిన అవసరం ఉందని కమిషన్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్ల వ్యవస్థ 2014 నుంచే దెబ్బతిన్నదని, రైస్ మిల్లర్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల సమస్యలు పెరిగాయని చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. కొనుగోళ్ల తర్వాత ధాన్యం నిర్వహణ బాధ్యత కూడా రైస్ మిల్లులదేనని తెలిపారు. పంటల మార్పిడిపై ఈ ఏడాది జనవరిలోనే ముఖ్యమంత్రిని కలిసి వివరించినట్లు చెప్పారు. పంటల మార్పిడిపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కమిషన్ సూచించినట్లు తెలిపారు. రైతుల ఆదాయం పెరిగే విధంగా పంటల వైవిధ్యీకరణపై ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కేవీఎన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# పంచశీలతో ప్రపంచదేశాల శాంతికి బీజం వేసిన నెహ్రూ

## ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్,మే 27,ప్రభాతవార్త:** పంచశీలతో ప్రపంచాదేశాల శాంతికి బీజం వేసి దేశంను తటస్థంగా నిలిపి అన్ని దేశాలతో సఖ్యతగా పెంపొందించుకొన్న గొప్పనాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావుఅన్నారు. బుధవారం గాంధీభవన్‌లో భారత మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళ్ళ అర్పించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ నెహ్రూ దేశం స్వావలంభన కోసం పంచవర్ష ప్రణాళికలు రూపొందించి వ్యవసాయం,పారిశ్రామిక అభివృద్ధికి బాటలు వేశారని గుర్తుచేశారు. దేశం అభివృద్ధికి పునాది పటిష్టంగా వేయడమే కాకుండా దేశంలో ప్రజాస్వామిక వాతావరణము మరింత పరిఢవిల్లడానికి రాజ్యాంగాన్ని చక్కగారూపొందిం చేందుకు బాబా సాహెబ్ అంబెద్కర్‌కు బాధ్యతలు అప్పగించారని గుర్తుచేశారు. భారత దేశం సమాఖ్యస్ఫూర్తితో అభివృద్ధి చెందాలని ఆయన వేసిన బాటలు వేశారని కీర్తించారు. రాజ్యాంగం,సమాఖ్యస్ఫూర్తి ఇప్పుడుప్రమాదంలో పడ్డాయని నెహ్రూ ఆశయాలు కొనసాగించేందుకు ప్రతి ఒక్కరు ప్రతిన పూనాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంతుల శామ్‌మోహన్ తోపాటు అనేకమంది పాల్గొన్నారు.

# జూన్ 2ను అపాయింటెడ్ డేగా ప్రకటించండి

## ఆర్టిసి కార్మిక జెఎసి వినతి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ముందుగా కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ఆ తర్వాత ప్రభుత్వంలో ఆర్టిసి విలీన ప్రక్రియను ప్రారంభిస్తామని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పడం సమంజసం కాదని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం తామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి యాదగిరి అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వ పెద్దలను కలిసి చర్చిస్తామని తెలిపారు. అన్ని కార్మిక సంఘాల ఏకాభిప్రాయాన్ని ప్రభుత్వం గౌరవించాలని, ఈ విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకొని జూన్ రెండో తారీఖున అపాయింటెడ్ డేగా ప్రకటన చేసి కార్మికులకు తీపి కబురు అందించాలని కోరారు.

# పంచాయతీ సిబ్బందికి ఒకటినే జీతాలు

## గ్రామ ఆదాయం ఇకపై పంచాయతీ బ్యాంకు ఖాతాలోనే

## సిఎం ఆదేశం మేరకు అధికారుల తదుపరి చర్యలు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ సిబ్బందికి ఇకపైన ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు అందనున్నాయి. రెగ్యులర్ ఉద్యోగులకు మాత్రమే కాకుండా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం సకాలంలో వేతనాలు అందనున్నాయి. ఈ కేటగిరీలో పనిచేస్తున్న అన్ని శాఖల్లోని ఉద్యోగులకు కూడా ఒకటో తేదీనే జీతాలు ఇచ్చేలా ట్రెజరీ డిపార్ట్ మెంటుకు సైతం తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. సంక్షేమం, గ్రామీణాభివృద్ధి సంస్థల బలోపేతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. పంచాయ తీరాజ్, గ్రామీ ణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉద్యో గుల వేతనాలు, పంచాయతీల స్వయం ప్రతిపత్తి, సామాజిక పెన్షన్ల పంపిణీపై అధికారులకు ఈ మేరకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ నిర్ణయం కారణంగా పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంటులోని సుమారు 50 వేల మంది సిబ్బందికి ప్రతి నెలా ఫస్ట్ తారీఖునే జీతాలు అం దుతాయి. ఇందు కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.50కోట్ల నిధులను కేటాయించనున్నది. 'ఐఏ ఎస్ అధికారులకు నెలనెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామపంచాయతీ సిబ్బందికి కూడా అదే రోజున వేతనాలు అందాలి. సిబ్బంది జీతాల చెల్లింపుల్లో ఒక్కరోజు ఆలస్యమైనా సహించేది లేదు.'అని సీఎం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గ్రామపంచాయతీల ఆర్థిక స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గతంలో తెచ్చిన నిబంధనను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ఇకపై ట్రెజరీ ఖాతాలో కాకుండా, నేరుగా బ్యాంకు ఖాతాలోకే జమచేసే విధంగా చట్ట సవరణ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల స్థానిక సంస్థలకు నిధుల వినియోగంలో మరింత స్వేచ్ఛ చేకూర నుంది.

# శవరాజకీయాలతో ప్రభుత్వంపై బిఆర్ఎస్ కుట్రలు

## వారి ఆందోళనకు రైతుల మద్దతు లేదు: ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదారబాద్,మే27,ప్రభాతవార్త:** శవాల మీద పేలాలు ఏరుకునే తరహాలో బిఆర్ఎస్ రాజకీయం చేయడంతోపాటు రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వంపై కుట్ర పన్నుతున్నారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. బుధవారం బాల్కసుమన్ పై చర్యలు తీసుకో వాలని డిజిపికి ప్రభుత్వ విప్‌లు, బల్మూర్ వెంకట్, అద్దంకి ఫిర్యాదు చేసిన అనంతరం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ బాల్క సుమన్ వ్యాఖ్యలను డిజిపి సుమోటోగా తీసుకొని కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలనీ డిమాండ్ చేశారు. బాల్క సుమన్ లాంటి వ్యక్తులు సమాజం లో ఉండటం అంత మంచిది కాదనీ అభిప్రాయపడ్డారు. నేరం చేయడం ఎంతో తప్పో, దానిని ప్రోత్సహించేలా మాట్లాడటం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం కూడా అంతే నేరమనీ ఆయన అభిప్రాయపడ్డారు. బాల్క సుమన్ ఓ సంఘ విద్రోహ శక్తిగా మాట్లాడారనీ, ఆయన ప్రవృత్తి మొదటి నుంచి నేర ప్రవృత్తేననీ, తన రాజకీయ ఎదుగుదల, స్వార్థం కోసం ఎంతో మంది జీవితాలను పణంగా పెట్టించాడనీ ఆరోపించారు. బిఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఇలాంటి రెచ్చగొట్టే నాయకుల వైఖరీపై ఆలోచన చేయాలనీ మీ జీవితాలతో వారు రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారనీ హితవు చెప్పారు. ఉద్యమ సమయంలోనూ ఎంతో మంది ఉసురుపోసుకున్నారు. ధాన్యం కొను గోళ్ల ఆందోళనలు రైతుల మసుగులో బిఆర్ఎస్ నేతలే చేస్తూ ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి కుట్ర



బుధవారం డిజిపి ఆనంద్‌కు ఫిర్యాదు చేస్తున్న బల్మూరి వెంకట్,అద్దంకిదయాకర్

పనుతున్నారనీ ఆవేదన చెందారు. బిఆర్ఎస్ నేతల ఆందోళనకు ప్రజల, రైతుల మద్దతు లేదనీ ఆయన అన్నారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ బాల్కసుమన్ తన సోదరుడని పిలుస్తుంటాడని ఆయన ఇప్పటికైనా తీవ్రవాదివలే మాట్లాడిన బాల్కసుమన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలనీ కోరారు. బాల్కసుమన్ పదవి ,అధికార దాహంతో ప్రజలు పట్టించుకోవట్లేదు అనే ఉద్దేశంతో టిఆర్ఎస్ కార్యకర్తలను రెచ్చగొడుతుండనీ ఈ విషయంలో కెసిఆర్ మౌనంగా ఉండడం సరైన పద్ధతి కాదు అని అన్నారు. కెసిఆర్ ,కెటిఆర్‌లకు తెలంగాణ పట్ల చిత్తశుద్ధి ఉండి, ప్రజల బాగుండాలంటే తక్షణమే బాల్క సుమన్‌ను పార్టీ నుండి సస్పెండ్ చేయాలి ప్రభుత్వ ఆస్తులు తగలబెట్టాలి రైలు పట్టాలని తగలబెట్టండి, కొయ్యం డని అని మాట్లాడిన బాల్క సుమన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు.

**బాల్క సుమన్ వ్యాఖ్యలపై సిఐడిచే విచారణ?**

**సుమన్‌కు పోలీసుల నోటీసులు?**

ఇదిలావుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని బిఆర్ఎస్ నేత బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా బు ధవారం నాడు అనేక పోలీసు స్టేషన్లలో కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయడంతో దీనిపై సిఐడి చేత విచారణ చేయంచాలని సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది. బాల్క సుమన్ వ్యాఖ్యలపై అందిన ఫిర్యాదులపై పలుచోట్ల పోలీసులు కేసు నమోదు చేయడంతో మొత్తం వ్యవహారంపై సిఐడి చేత విచారణ చేయించాలని సర్కారు నిర్ణయిం చినట్లుగా తెలిసింది. ఇందుకు సంబంధించి బల్కా సుమన్‌కు నోటీసులు జారీ చేసి ఆయ న నుంచి వివరణ తీసుకున్న తరువాత తదుపరి చర్యలు తీసుకోవాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం.

# అప్పుల భారానికి కుటుంబం బలి

## ముగ్గురిని చంపి తాను ఉరేసుకొని ఆత్మహత్య: వనపర్తి జిల్లా సలకలాపూర్‌లో ఘటన

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 27, ప్రభాతవార్త:** అప్పు భారంతో కుటుంబ సభ్యులను నీటి సంపులో ముంచి..తాను ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర మండలం డోకూరు గ్రామానికి చెందిన గంగల నర్సింహులు (40)మామిడి తోటలు లీజుకు తీసుకొని పండ్ల వ్యాపారం చేసేవాడు. ఆరు సంవత్సరాల క్రితం స్వగ్రామంలో అప్పులు ఎక్కువై గణపురం మండలంలోని సలకలాపూర్ గ్రామానికి సమీపంలో భీమవరానికి చెందిన శ్రీనివాసరావు మామిడి తోటను లీజుకు తీసుకొని అక్కడే రేకుల షెడ్డులో భార్యా పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఏడాది క్రితం తను చేసిన అప్పులు 70 లక్షలు దాటడంతో కోర్టుకు వెళ్లాడు. గ్రామస్తులు సర్ది చెప్పడంతో అప్పుల వారికి కొంత మొత్తం చెల్లించి మిగతా డబ్బులు తర్వాత ఇస్తానని చెప్పి గ్రామాన్ని వదిలిపెట్టాడు.

ఇటీవల మళ్లీ అప్పుల వారి బాధలు ఎక్కువ కావడంతో వారి బాధలు భరించలేక బుధవారం మధ్య రాత్రి తర్వాత తన భార్య ఎల్లమ్మ (36),కుమారుడు సాయి నిహాల్ (15)కూతురు సాహితీశ్రీ (13) ముగ్గురిని తోటలో ఉన్న సంపులో తాళ్లతో కట్టి పడేసి చంపాడు. ఈ విషయం గద్వాలలో ఉన్న తన బావమరిది వెంకటేష్‌కు రాత్రి ఒంటిగంట యాభై నిమిషాలకు ఫోన్ చేసి మీ చెల్లిని పిల్లలను చంపేశానని స్వగ్రామంనుండి అప్పుల వారి బాధలు ఎక్కువయ్యాయని వాళ్ళు తనను బూతు మాటలతో వేధిస్తున్నారని నేను ఉరి వేసుకొని చనిపోతున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. దీంతో తన బావమరిది బంధువులకు సమాచారం ఇచ్చి వెంటనే బయలుదేరారు. రాత్రంతా భారీ వర్షం కురుస్తుండటంతో సలకలాపూర్ గ్రామానికి తెల్ల వారు జామున 6 గంటలకు చేరుకున్నారు. అప్ప టికే తన బావమరిది తన నివాసం ఉంటున్న రేకుల షెడ్డులో ఉరేసుకొని చనిపోయాడు. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో పోలీ సులు సంఘటన స్థలానికి చేరుకొని డిఎస్పి గిరి ధర్ ఆధ్వర్యంలో సిఐ రాంబాబు ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసుకొని పంచ నామ నిర్వహించారు అనంతరం శవాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

# భారీగా తహసీల్దార్ల బదలీ

## 12 మందికి స్థాన చలనం

## తక్షణమే కొత్త పోస్టుల్లో చేరాలని ఆదేశాలు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** తెలంగాణ రెవెన్యూ శాఖలో పరిపాలనా విభాగానికి సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెద్ద ఎత్తున తహసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. ఏకంగా 12 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్ అధికారికంగా ఆదేశాలు ఇచ్చారు. పరిపాలనా సౌలభ్యం కోసమే ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన తహసీల్దార్లు అందరూ కూడా ఎలాంటి ఆలస్యం చేయకుండా, వెంటనే తమకు కేటాయించిన కొత్త ప్రాంతాలలో విధుల్లో చేరి ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌తోపాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. నూతన ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహశీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితోపాటు జనగామ తహశీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్‌రెడ్డి (సూర్యాపేట)ను సిద్దిపేట ఎస్డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం)ను నల్గొండ ఎస్డీసీగా, జి. కుమార స్వామి (పెద్దపల్లి)ను సిరిసిల్ల ఎస్డీసీగా, ఎన్. వెంకట్‌రెడ్డి (కరీంనగర్)ను కరీంనగర్ ఎస్డీసీ (ఎల్ఏ)గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. కాగా.. ఇటీవల ఏసీబీ తనిఖీల్లో తహసీల్దార్లు పట్టుబడిన వేళ. ఈ బదిలీల ప్రక్రియ రెవెన్యూ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది.

## బదలీ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారులు: తెలంగాణ ఉద్యోగుల జెఎసి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను బదిలీ చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సాక్షాత్తు కొంత మంది ఉన్నతాధికారులు లక్ష్య పెట్టకుండా, తమ ఇష్టారీతిన వ్యవహరిస్తుండటాన్ని తెలంగాణ ఉద్యోగుల జెఎసి తీవ్రంగా ఖండించింది. జివో నంబరు 38 ద్వారా ప్రభుత్వం బదిలీలను ఎలా చేయాలో మార్గదర్శకాలు విడుదల చేసినా..కొన్ని శాఖల్లో ఉన్నతాధికారులు తమకు తోచినట్లు ఉత్తర్వులకు వక్ర భాష్యం చెబుతూ నిర్ణయాలు తీసుకుం టున్నారని ఆరోపించింది.

ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్నా కొన్ని శాఖల ఉన్నతాధికారులు ఇందుకు భిన్నంగా వ్యవహరి స్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ప్రభుత్వం పట్ల ఉద్యోగుల్లో వ్యతిరేక భావనను పెంపొందించే విధంగా ఉద్దేశ పూరితంగా వ్యవహరిస్తున్నారని తప్పుబట్టింది. ఆర్థికశాఖలోని కొన్ని విభాగాలు, ఆయుష్, సంక్షే మశాఖల అధికారులు నాలుగు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్నవారితోపాటు 3 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని కూడా బదిలీ చేస్తామనడం ప్రభుత్వ నిబంధనలకు వక్ర భాష్యం చెప్పడమేనని జెఎసి నేతలు స్పష్టం చేశారు.

# 65శాతం మేర ధాన్యం కొనుగోళ్లు పూర్తి

## ఇప్పటి వరకు 58 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ

## వెల్లడించిన రాష్ట్ర పౌరసరఫరాలశాఖ

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యాసంగి/రబి సీజన్ ధాన్యం కొనుగోళ్లు 65శాతం మేర పూర్తయ్యాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పేర్కొంది. ఈ విషయమై బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించింది. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు 8 లక్షల మంది రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి రూ.10, 002 కోట్ల చెల్లింపులను నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసినట్లు పేర్కొంది. ఈ యాసంగిలో నిర్ణయించిన మేరకు 8575 కొనుగోలు కేంద్రాలకు అన్నింటిని తెరిచి పూరిస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నట్లు వెల్లడించింది. మొత్తంగా అత్యధిక కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, వేగవంతమైన చెల్లింపులు, పారదర్శకమైన సేకరణ విధానాలతో ఈ ఏడాది ప్రభుత్వం రికార్డుస్థాయి కొనుగోళ్లను చేపడుతోందని పౌరసరఫరాలశాఖ స్పష్టం చేసింది.

# తెలంగాణ ప్రజలపై ఆంధ్ర నాయకుల పెత్తనం తగదు

## కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ ఆగ్రహం

**హైదరాబాద్,మే27,ప్రభాతవార్త:** రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ రావును అరెస్ట్ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసులు సిద్ధం అవ్వడంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచ జ్ఞాని అయిన నాగేశ్వర్‌రావు పై ఆంధ్రాపోలీసులు కేసులు పెడతారా అని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు జూబ్లీహిల్స్‌లో పని ఏంటని ప్రశ్నించారు. ఆంధ్రా అరాచకపాలన తెలంగాణ మేధావులపై చేస్తామంటే నడవదు అని హెచ్చరించారు. ఆంధ్రకు ఒక్క తెలంగాణ వ్యక్తి కూడా బతుకుదెరువు కోసం వలస పోడని కానీ వారు తెలంగాణకు వస్తూనే ఉన్నారని వ్యాఖ్యానించారు. అరవై ఏళ్లపాటు కొల్లగొట్టి తెలంగాణ తెచ్చు కుంటే మళ్లీ హైదరాబాద్ వచ్చి ఆగం చేయాలని చూస్తున్నారా అంటూ ప్రశ్నించారు. పోలీసులతో భయపెట్టాలనుకుంటే ఆంధ్రా నాయకులకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజల నుంచి మరోసారి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

# అర్హుల ఓట్లను తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలి

## బిఎల్ఎలతో సమన్వయంగా ఉంటూ సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి: హైదరాబాద్ ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,మే 27 ప్రభాతవార్త:** అర్హులైన ఓటర్లను తొలగించడానికి సర్ పేరిట జరుగుతున్న కసరత్తును కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ వయోజనులందరికి ఓటుహక్కు ఉండేలా చూసుకోవాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఇందిరా భవన్ లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సర్ మ్యాపింగ్ పై సమావేశంలో ముఖ్య అతిథి గాహైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరైనారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సర్ పేరిట ఓటర్ జాబితాలోని పేర్లను అక్రమంగా తొలగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. పారదర్శకంగా జరిగే ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే ఏ చర్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గంలో బిఎల్ఏ లతో సమన్వయం చేసుకుని అర్హత కలిగిన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగించకుండా అప్రమత్తంగా పని చేయాలని నేతలకు సూచించారు. ప్రతి నియోజకవర్గంలో బిఎల్ఏ తో అర్హత ఉన్న ఓటర్లను జాబితా నుండి తొలగించకుండా కాంగ్రెస్ ప్రజల పక్షాన నిలబడాలి అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వి హనుమంత్ రావు, ప్రభుత్వ విప్ లు అద్దంకి దయాకర్ , బల్మూరి వెంకట్ , రాజ్యసభ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ , ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ ,డిసిసి అధ్యక్షులు మోత రోహిత్ , దీపక్ జాన్ , నియోజకవర్గ ఇన్చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రేపు టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం

## ఉదయం పదిన్నరకు సర్‌పై బిఎల్ఎ శిక్షణ శిబిరం

**హైదరాబాద్,మే27,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం నాలుగున్నరకు ఇందిరాభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ అధ్యక్షతన జరుగుతోంది. ఈ సమావేశంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడినడ ఎఐసిసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్,మంత్రులు, కమిటీ సభ్యులు పాల్గొంటారు. ప్రత్యేక సమగ్ర ఓటర్లజాబితాసవరణ అంశంపై బూత్ లెవల్ ఏజెంట్లకు శుక్రవారం ఉదయం పదిన్నరకు శిక్షణా తరగతులు కూడా మొదలు పెడుతారు. 14 రాష్ట్రాలలో సర్ తో ఓట్లు చోరి చేసి ఎన్నికల ఫలితాలు ఎలా తారుమారు చేశారో వివరించబోతున్నారు. బెంగాల్‌లో రాజకీయ సమీకరణాలు సర్ కారణంగా మారిపోయి అధికారంలోకి రావాల్సిన పార్టీ ఓడిపోయిన తీరు బిఎల్ఎలకు తెలిపి క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన అప్రమత్తతను వివరిస్తారు. బీదలు ఓట్లు తొలగిస్తే సరైన డాక్యుమెంట్లు ఇవ్వలేరని కాబట్టి మూడు నెలల సమయం ఇవ్వాలని అంతేకాకుండా మూడు సార్లు ఇంటికి వెళ్ళి ప్రతి ఇంటిని పరిశీలిస్తోందా లేదా వెరిఫికేషన్ సజావుగా సాగిందా లేదా చూడాలని బిఎల్ఎలకు వివించే అవకాశం ఉంది. దేశం బయట ఉన్నారని ఓట్లను తొలిగించే ప్రమాదం ఉందని వాటిపై కూడా బిఎల్ఎలను అప్రమత్తం చేయనున్నారు. లౌకిక వాదం నమ్ముకొన్న ఏ ఓటరు ఓటును తొలగించకుండా బిఎల్ఎలకు తర్ఫీదు ఇచ్చేలా ఈ శిక్షణను రూపొందించారు. కర్నాటక చిలుమే కుంభకోణం నకిలీ బిఎల్ఓ మోసపూరిత రిజిస్ట్రేషన్ వివిధ రాష్ట్రాలలో అనుసరించిన అక్రమ విధానాలను ఒక పాఠ్యాంశంగా అధ్యయనం చేసి తగిన రక్షణలు తీసుకొనేలా బిఎల్ఎలకు శిక్షణ ఇవ్వనున్నారు.

# జూన్ 1న సిఎం క్యాంపు కార్యాలయ ముట్టడి

## తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసి పిలుపు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లులు రావలసిన మాజీ సర్పంచులంతా జూన్ 1న ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసి వ్యవస్థాపక అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 31 నెలలు అవు తున్నా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్యకు దిగుతుం డడంతో మాజీ సర్పంచులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ మేరకు సిఎం క్యాంపు కార్యాలయ ముట్టడి పోస్టర్‌ను మాజి మంత్రి హరీ ష్‌రావు చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరింపచేశారు. మానసిక, ఆర్థిక ఇబ్బందులతో అనేక మంది మాజీ సర్పంచులు ఆందోళన చెం దుతు న్నారని, కొంతమంది సర్పంచులు ఆత్మహత్య కూడా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్‌నుంచి డబ్బులు విడుదల చేయక పోవడంతో అనేకమందిమనస్థాపానికి గురై ఆర్థికఇబ్బందులతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ సమస్యలు రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు వినిపించాలంటే ఆమె క్యాంపుకార్యాలయం ముట్టడించాల్సిందేనన్నారు.

# కొత్తగా 75 సబ్‌స్టేషన్లు

## 33కేవీ, 11 కేవీ లైన్లపై ప్రత్యేక దృష్టి

## టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ వి పాటిల్

**హైదరాబాద్, మే 27,ప్రభాతవార్త:** డిస్కం పరిధిలో కొత్తగా మరో 75 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా 33కేవీ, 11కేవీ లైన్లపై ప్రత్యేక దృష్టి సారించామని, స్టోర్ మెటీరి యల్ పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండీ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ మేరకు బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఈదురు గాలులతో కూడిన వర్షాలను సైతం తట్టుకుని నిలబడే విధంగా విద్యుత్ లైన్లను తీర్చిదిద్దుతున్నామన్నారు. అధిక లోడు తో ఇబ్బంది పడుతున్న సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, డీటీఆర్‌లను గుర్తించి, వాటి స్థానంలో అదనపు సామర్థ్యంతో డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే స్టోర్స్ నుంచి మెటిరియల్ డ్రా చేసి, ఆ తర్వాత దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని విద్యుత్ స్టోర్స్ నుంచి డ్రా చేసిన మెటిరియల్‌కు, క్షేత్రస్థాయిలో వినియోగిస్తున్న మెటిరియల్‌కు మధ్య పొంతన ఉండటం లేదన్నారు. ఈనేపథ్యంలోనే విద్యుత్ స్టోర్స్‌పై నిఘా పెట్టి డ్రా చేసిన మెటిరియల్‌పై పక్కాగా ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అండర్‌గ్రౌండ్ కేబుళ్ల కొరతను నివారించేందుకు ఇప్పటికే ఆయా వెండర్ కంపెనీల నుంచి టెండర్లు ఆహ్వానించామని త్వ రలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. ఈఆర్‌సీ నిబంధనల మేరకు ఎలాంటి వివాదం లేని గ్రామం కంఠం భూముల్లోని నిర్మాణాలు సహా నోటరీ డాక్యుమెంట్ దరఖాస్తులకు సైతం కనెక్షన్లు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.కానీ పది మీటర్ల ఎత్తు దాటిన భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఖచ్చితంగా కావాలని 10మీటర్ల లోపు ఉన్న భవనాలకు ఓసీలు అవసరం లేదన్నారు.


## న్యాయవాది మొయిజుద్దీన్ హత్య కేసులో

# హంతకులు ఉపయోగించిన కారు లభ్యం

### స్పందించిన రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్.

**హైదరాబాద్(కార్వాన్), మే 27 ప్రభాతవార్త:** నగరంలో సంచలనం మారిన న్యాయవాది మొయిజుద్దీన్ హత్య కేసులో హంతకులు ఉపయోగించిన స్కార్పియో కారు ఇబ్రహీంపట్నం బై పాస్ రోడ్ లో లభ్యమైంది. నగర నడి బొడ్డున గల మాసాబ్ ట్యాంక్ శాంతి నగర్ కు చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది, వక్ఫ్ బోర్డు ప్యానెల్ అడ్వకేట్ ఖాజా మొయిజుద్దీన్ ఇటీవల సంచలనం సృష్టించిన హత్యోదంతం ద్వారా వార్తల్లో నిలిచారు. ఎవరికి అనుమానంరాకుండదని స్కార్పియో కారుతో ఢీకొట్టించి దారుణానికి ఒడిగట్టి, ఈ కేసుకు సంబంధించి మొదట ఈ ఘటనను రోడ్డు ప్రమాదం (హిట్ అండ్ రన్)లా చిత్రీకరించాలని నిందితులు భావించారు. కానీ భూ వివాదాలు, వక్ఫ్ బోర్డు భూముల పరిరక్షణ కేసులకు సంబంధించి ఆయన ప్రత్యర్థులు పక్కా ప్లాన్ ప్రకారం ఆయన్ను హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు గోవాలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా, ఇందులో వినయ్ అనే వ్యక్తి కారు నడిపినట్లు పోలీస్ లు గుర్తించారు. వక్ఫ్ బోర్డు భూముల కబ్జాలకు సంబంధించిన వివాదాలేఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్.హెచ్ఆర్.సి) కూడా కేసు నమోదు చేసిందని సమాచారం.





**మొహిజుద్దీన్ లొంగదీసుకునే యత్నం:** తీవ్రస్థాయిలో బెదిరింపులకు దిగడంతోపాటు ఆ భూ వివాదం కేసు నుంచి వైదొలిగితే రూ.2 కోట్లు ఇస్తామంటూ మొహిజుద్దీన్ కు ఆఫర్ చేశారు. అయితే రాజీ పడబోనని చెప్పడంతో మొయిజుద్దీన్ను హత్యను చేయాలని భావించి ఆ పనిని తావూస్, మునీర్లకు అప్పగించారు. కాగా సుపారీ గ్యాంగ్తో పనిపూర్తి చేయించాలని నగరానికి చెందిన కిషన్ సింగ్ అలియాస్ పప్పును వీరు కలిసి విషయం చెప్పారు. సుపారీ కింద రూ.15 లక్షలు చెల్లించారు. హత్య బాధ్యతను కవాడిగూడకు చెందిన సింగూరి అభిజీత్ అలియాస్ నాని, వినయ్, మణిదీప్ లకు అప్పగించి రూ.10 లక్షలు చెల్లించాడు. ఈ ముగ్గురూ పప్పుతో కలిసి కారు కొని, రెక్కీ చేసి పథకం ప్రకారం శనివారం మొయిజుద్దీన్ను రెడ్ హిల్స్ శాంతినగర్ ల్లో హత్య చేశారు.

**అభిజిత్ గుర్తింపు:** స్టంట్స్ చేయడంలో అనుభవం ఉన్న అభిజిత్ ఆ రోజు కారు నడిపాడు మణిదీప్, వినయ్ అందులో కూర్చున్నారు. డ్రైవింగ్ నైపుణ్యం కారణంగానే ఇతడు నడిపిన, మొయిజుద్దీన్ ఎక్కబోయిన కార్లలో ఏదీ దెబ్బతినలేదు. ఈ హత్య చేసే సమయంలో కారుకు నెంబర్ ప్లేట్ లేకపోయినా వివిధ ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలను టాస్క్ ఫోర్స్ పోలీసులు అధ్యయనం చేశారు. వీటి ఆధారంగా అభిజిత్ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఇతడిచ్చిన సమాచారంతో మణిదీప్, వినయ్లను పట్టుకున్నారు. పరారీలో ఉన్న తావూస్, మునీర్, కిషన్ సింగ్ కోసం మూడు రాష్ట్రాల్లో గాలిస్తున్నారు

**కాంగ్రెస్ నేత ఆలంఖాన్ అరెస్ట్:** వక్ఫ్ బోర్డు ప్యానల్ న్యాయవాది ఖాజా మొహిజుద్దీన్ హత్య కేసు కొలిక్కి వచ్చింది. ఈ హత్యకు భూవివాదాలే కారణమని, బర్కత్ పూరా ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ నేత సూత్రధారి అని తేలింది. ఆయనతో సహా నలుగురిని హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నరు. మొహిజుద్దీన్ కొన్నేళ్లుగా వర్ఫ్ భూముల పరిరక్షణకు పోరాడుతున్నారు. ఓ భూమికి సంబంధించి బర్కత్ పూరా కు చెందిన కీలక కాంగ్రెస్ నేతతో విభేదాలు వచ్చాయి. తమ ఆధీనంలో ఉన్న ఈ భూమి విషయంలో జోక్యం చేసుకోవద్దంటూ ఆనేతతోపాటు ఆయన కుమారుడు సైతం మొహిజు ద్దీన్, ఆయన కుమారుడు ఫర్వాన్ లను పలుమార్లు ఒత్తిడి తీసుకువచ్చారు.

**సివి ఆనంద్ స్పందన:** సంచలనం సృష్టించిన న్యాయవాది మొయిజుద్దీన్ హత్య కేసుపై రాష్ట్ర డీజీపీ సివి ఆనంద్ స్పందించారు. ఈసందర్భముగా వారు మాట్లాడుతూ నగరంలో సంచలనం సృష్టించిన న్యాయవాది మొయిజుద్దీన్ హత్య వెనుక రాజకీయ కారణాలులేవని స్పష్టం చేసారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ త్వరలో మీడియా సమావేశం నిర్వహించి వెల్లడిస్తారని చెప్పారు.

# విద్యుత్ ఒప్పందాలపై సీబీఐ దర్యాప్తు

### రాష్ట్ర సర్కార్ గ్రీన్‌సిగ్నల్, హోం శాఖకు విద్యుత్ శాఖ లేఖ

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంతో పాటు, వివిధ సంస్థలతో జరిగిన విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన తప్పిదాలపై సిబిఐ దర్యాప్తుకు మార్గం సుగమమైంది. గత ప్రభుత్వ హయంలో విద్యుత్ ఒప్పందాలు, ప్లాంట్ల నిర్మాణాలపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన సమ్మతిని తెలియజేసింది. ఈ మేరకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. కాగా దేశవ్యాప్తంగా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినప్పటికీ కాలం చెల్లిన సబ్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతోనే భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మించారని దానివల్ల వచ్చే పాతికేళ్లలో రాష్ట్ర ప్రజలపై రూ.9 వేల కోట్ల నిర్వహణ భారం అధికంగా పడుతుందని జస్టిస్ లోకూర్ కమిషన్ తేల్చింది. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందంలోనూ రూ.3,642 కోట్ల నష్టం జరిగిందని తెలిపింది. అప్పట్లో పోటీ బిడ్డింగ్‌కు వెళ్లడం వల్ల కేరళకు యూనిట్ కరెంట్ రూ.3.60లకే లభించిందని గుర్తు చేసింది. ఛత్తీస్‌గఢ్ ఒప్పందం మేరకు కరెంట్ అవసరంపోవడంతో బహిరంగ విపణిలో కొన్న విద్యుత్ వల్ల రూ.2 వేల కోట్ల అదనపు భారం పడిందని కమిషన్ నిర్ధారించింది. సత్తీస్‌గఢ్ ఇచ్చిన కొద్ది కరెంటుకు సకాలంలో చెల్లింపులు చేయని కారణంగా వడ్డీలతో పాటు, అందుకు పెనాల్టీ రూపంలో రూ.750 కోట్లు చెల్లింపులు చేశారని తెలిపింది. ఛత్తీస్‌గఢ్ కరెంటు తెచ్చుకోవడానికి పవర్ గ్రిడ్ కారిడార్ బుక్ చేసుకుంటే వాడుకోకపోయినా రూ.635 కోట్లు చెల్లించాలని పేర్కొంది. గోదావరి ఒడ్డున నీళ్లతో పాటు బొగ్గు నిల్వలు ఉన్నాయని, అక్కడే థర్మల్ ప్లాంట్లు కట్టాలని కేంద్ర విద్యుత్ అథారిటీ(సీఈఏ) చెప్పినా వినకుండా గనులకు 280 కిలోమీటర్ల దూరంలో యాదాద్రి ప్లాంట్ చేపట్టారని, దీనివల్ల ఏటా రవాణా ఖర్చు రూ.1600 కోట్లు ఉంటుందని కమిషన్ తేల్చింది. ఈ నేపథ్యంలో యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్‌ల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం విషయమై తీసుకున్న నిర్ణయాల్లో తప్పిదాలు చోటుచేసుకున్నాయని, దీనిపై జస్టిస్ లోకూర్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు కోరాలని ఇటీవల జరిగిన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దాన్ని అనుసరించి ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ హోంశాఖకు లేఖ రాశారు. దాని ఆధారంగా హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది.

# రేషన్ పంపిణిలో సంస్కరణలు

### ప్రజాపంపిణి వ్యవస్థ ఆధునీకరణకు రూ.25,530 కోట్లు

### 'సార్థక్- పిడిఎస్' మరో ఐదేళ్లు

### కేంద్ర కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన అశ్విని వైష్ణవ్



**న్యూఢిల్లీ, మే 27:** దేశవ్యాప్తంగా ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత ఆధునీకరించడానికి, పారదర్శకతను పెంచడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ) "రేషన్ రవాణా, నిర్వహణలో సహాయ పథకం పిడిఎస్‌లో ఆటోమేషన్‌తో ఆదాయం" (సార్థక్-పిడిఎస్) అనే కొత్త పథకం కార్యక్రమం కింద రెండు కీలక ఆహార పంపిణీ పథకాల కొనసాగింపునకు, వాటి ఏకీకరణకు ఆమోదం తెలిపింది. 16వ ఆర్థిక సంఘం కాలంలో ఈ పథకం అమలు కోసం కేంద్రం తన వాటాగా రాబోయే ఐదేళ్లలో రూ.25,530 కోట్లు ఖర్చు చేయనుంది. రాష్ట్రాల పరిధిలో ఆహార ధాన్యాల రవాణాకు, ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ఆధునీకరణకు రాష్ట్ర ఏజెన్సీలకు ఈ నిధులు సహాయపడతాయి. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ పథకం ఏప్రిల్ 2026 నుండి మార్చి 2031 వరకు, ఐదేళ్ల పాటు అమలు చేయబడుతుంది.

**నిబంధనల సవరణ:** రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో ఆహార ధాన్యాల రవాణా, నిర్వహణ కోసంకేంద్రం అందించే సహాయానికి సంబంధించిన నిబంధనలను సిసిఇఎ సవరించింది. అలాగే, ప్రస్తుతం ఉన్న నిధుల నమూనాను యథాతథంగా కొనసాగిస్తూనే, రేషన్ దుకాణాల (ఎఫ్‌పిఎస్) డీలర్ల కమీషన్ విషయంలోనూ సవరణలకు ఆమోదం తెలిపింది. 'సార్థక్-పిడిఎస్' పథకం ఒక సమగ్ర పథకంగా రూపొందించబడింది. ఇది ప్రస్తుతం అమలులో ఉన్న రెండు పథకాలను 'ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కింద రాష్ట్రాల పరిధిలో ఆహార ధాన్యాల రవాణా, ఎఫ్‌పిఎస్ డీలర్ల కమీషన్ కోసం రాష్ట్ర ఏజెన్సీలకు సహాయం", "ప్రజా పంపిణీ వ్యవస్థలో సాంకేతికత ద్వారా ఆధునీకరణ, సంస్కరణల పథకం (సార్థక్- పిడిఎస్)" ఒకే గొడుగు కిందకు తీసుకువస్తుంది.

**ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ అమలు:** ఆర్థిక సహాయం, సాంకేతిక ఆధునీకరణ అంశాలను ఒకే పరిపాలనా చట్రం కిందకు తీసుకురావడం ద్వారా, జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) అమలును సమగ్రంగా బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన లక్ష్యం. "లబ్ధిదారుల ఎంపిక నుండి ఆహార ధాన్యాల రవాణా వరకు, పౌరుల నుండి క్రియాశీలక అభిప్రాయాన్ని సేకరించడం నుండి రవాణా దూరాన్ని తగ్గించడం వరకు ఈ కార్యకలాపాలన్నింటికీ ఐదేళ్ల కాలానికి గాను రూ. 25,530 కోట్ల వ్యయంతో ఆమోదం లభించింది" అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు. పిడిఎస్ దుకాణాలకు ఆహార ధాన్యాలను రవాణా చేసే ఖర్చును భరించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ పథకం కింద ఆ రవాణా ఖర్చుకు కేంద్రం మద్దతు అందిస్తుందని, అంతేకాకుండా ఎఫ్‌పిఎస్ డీలర్ల పారితోషికం కూడా పెంచబడుతుందని వైష్ణవ్ తెలిపారు.

# ఎల్ఐసినుంచి రెండు కొత్త పాలసీలు

### భార్యాభర్తలిరువురికీ జాయింట్ పాలసీ



**హైదరాబాద్, మే 27:** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసి తాజాగా మరో రెండు కొత్త పాలసీలను తీసుకొచ్చింది. భార్యాభర్తలిద్దరికీ బీమా అందించేలా వీటిని అందుబాటులోకి తెచ్చింది. కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తూ భార్యాభర్తలిద్దరూ కలిపి ఒకే పాలసీ తీసుకోవాలని అనుకునే వారి కోసం రెండు సరికొత్త జాయింట్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్స్‌ను ఎల్ఐసి డిజైన్ చేసింది న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం, న్యూ జీవన్ సాథీ లిమిటెడ్ ప్రీమియం పాలసీలను ప్రకటించింది. బీమా ప్లస్ పొదుపు మిళితంగా తెచ్చిన ఎల్ఐసీ కొత్త పాలసీలు జూన్ 1 నుంచి కొనుగోలుకు అందుబాటులోకి రానున్నాయి. ఈ పాలసీలు తీసుకున్నవారికి బీమా హామీతో పాటు కట్టిన డబ్బుకు గ్యారెంటీడ్ అడిషన్ కింద కొంత మొత్తం అదనంగా చెల్లిస్తారు. వీటిల్లో మెచ్యూరిటీ బెన్‌ఫిట్ కూడా పొందవచ్చు. ఎల్ఐసీ న్యూ జీవన్ సాథీ సింగిల్ ప్రీమియం పాలసీ నాన్ పార్టిసిపేట్ నాన్ మార్కెట్ లింక్డ్‌ప్లాన్. భార్యాభర్తలకు వ్యక్తిగత జీవిత బీమాతో పాటు పొదుపు అందించడమే. ఇది తీసుకున్నవారు ఒకేసారి ప్రీమియం మొత్తం కట్టాల్సి ఉంటుంది. పాలసీ టర్మ్‌లో ప్రతి రూ.1000కు గానూ 70 రూపాయలు చొప్పున గ్యారెంటీ అడిషన్ కింద చెల్లిస్తారు. మెచ్యూరిటీ లేదా డెత్ బెనిఫిట్ మొత్తాలను ఇన్‌స్టాల్‌మెంట్ రూపంలో తీసుకునే సౌలభ్యం కూడా ఉంది. ఈ పాలసీ తీసుకున్నవారికి రుణ సదుపాయం అవకాశం ఉంది. బేసిక్ సమ్ అష్యూర్డ్ రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గరిష్ఠ మొత్తంపై ఎలాంటి పరిమితి లేదు. సింగిల్ ప్రీమియంపై 10 రెట్లు బీమా హామీ లభిస్తుంది. పది, 15, 20, 25 ఏళ్ల కాలపరిమితి ఉంది. భార్యాభర్తల్లో ఒకరికి రిస్క్ జరిగితే సమ్ అష్యూర్డ్ చెల్లిస్తారు. రెండో వ్యక్తి కూడా మరణిస్తే నామినీకి ఆ మొత్తం కంపెనీ పే చేస్తుంది. ఎల్ఐసీ తీసుకొస్తున్న ఈ పాలసీ కూడా నాన్‌పార్టిసిపేట్, నాన్‌లింక్డ్ ప్లాన్. ఇందులో 5, 10, 15 ఏళ్ల పాటు ప్రీమియం కట్టాలి. ప్రీమియం చెల్లించే కాలవ్యవధిలో మొదటి పర్సన్‌కు ఏదైనా రిస్క్ జరిగితే మిగిలిన ప్రీమియంలు కట్టాల్సిన పని లేదు. పాలసీ కంటిన్యూ అవుతుంది. పాలసీ ఫోర్స్‌లో ఉన్నంత వరకు ప్రతి రూ.1000కు రూ.70 చొప్పున గ్యారెంటీ అడిషన్ అందు తుంది. డెత్ బెనిఫిట్ ప్రయోజనాలు వచ్చేసి ఆప్షన్ కింద బేసిక్ సమ్ అష్యూర్డ్ లేదా చెల్లిం చిన ప్రీమియం మొత్తం, రెండో ఆప్షన్ కింద వార్షిక ప్రీమియానికి 10.5 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్ లభిస్తుంది. పాలసీ టర్మ్ వచ్చేసి 10, 15, 20, 25 ఏళ్లుగా ఉంది. ఇక కనీస బీమా హామీ మొత్తం వచ్చేసి రూ.3 లక్షలు ఉండగా, గరిష్ఠ మొత్తంపై ఎలాంటి పరిమితి లేదు. కుటుంబంలోని భార్యాభర్తలిద్దరికీ భవిష్యత్తుప్రయోజనాలిచ్చే పాలసీలని ఎల్ఐసి ఎండి సిఇఓఆర్ దొరైస్వామి వెల్లడించారు. బుధవారమే ప్రారంభించిన ఈ పాలసీలు జూన్ ఒకటవ తేదీనుంచి అందుబాటులోకి వస్తాయి.

# సంక్షేమ గురుకులాల్లో ప్రతి సీటు భర్తీ కావాల్సిందే

## ఖాళీలపై ప్రత్యేక అధ్యయనం

### సకాలంలో పుస్తకాలు, యూనిఫాం: డి.సిఎం భట్టి



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంక్షేమ గురుకులాలు జూన్ నెలలో ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం సంక్షేమ గురుకుల, హాస్టళ్లపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గురుకులాల్లో అడ్మిషన్లు పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీట్లు పూర్తిగా భర్తీ కాని గురుకులాలలపై ప్రత్యేకంగా అధ్యయనం చేసి కారణాలు గుర్తించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గురుకులాలు ప్రారంభానికి ముందే అవసరమైన మరమ్మతులు, మౌలిక వసతుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సంక్షేమ గురుకులాల్లో డైట్ ఛార్జీలు, మెనూ వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. గురుకులాలకు జిల్లా అధికారిని ఇన్‌చార్జిగా నియమించి, వారు ప్రతి నెల పాఠశాలలను సందర్శించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లా అధికారులు రెగ్యులర్‌గా సందర్శించి తనిఖీ నివేదికలు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. అలాగే వైద్యులు కూడా నెల నెలా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని తెలిపారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల భవనాల పనులను వేగవంతం చేయాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో ఎన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, యంగ్ ఇండియా పాఠశాలలు పూర్తయ్యాక ఎన్ని తరలించవచ్చో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ప్రాంతీయ సమన్వయకర్తలు వచ్చే 12 రోజుల్లో అన్ని సంక్షేమ గురుకులాలను చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని చెప్పారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం లు విద్యార్థులకు సకాలంలో అందించడాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, భారీగా నిధులు వెచ్చిస్తున్న నేపథ్యంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, అద్దెల చెల్లింపులు ప్రభుత్వం క్రమం తప్పకుండా చెల్లిస్తున్నదని వివరించారు. మరమ్మతుల నిధులు కూడా విడుదల చేస్తున్న నేపథ్యంలో పనులు క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల బిల్లుల చెల్లింపులకు డీఎంఎఫ్‌టీ నిధులను కూడా వినియోగిస్తామని చెప్పారు. విద్యా సంస్థ లకు ఉచిత విద్యుత్ అందుతున్న నేపథ్యంలో స్వంత భవనాల్లో నడుస్తున్న సంక్షేమ గురుకులాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు కోసం కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# బక్రీద్‌కు రాష్ట్ర వ్యాప్తంగా బందోబస్తు

### అక్రమంగా జంతువుల తరలింపును అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల ఏర్పాటు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** ముస్లింలు భక్తి శ్రద్దలతో నిర్వహించే బక్రీద్ పండగ గురువారం జరగనుంది. ఈ నేపథ్యంలో జంట నగ రాలు, శివారు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బక్రీద్ అంటేనే జంతువుల విక్రయాలతో ఎక్కడ చూసినా సందడిగా వుండడం తెలిసిందే. జంతువుల విక్రయ కేంద్రాలలో దేశ విదేశాలకు చెందిన మేలు రకాలకు చెందిన లక్షలాది మేకలు, గొర్రెలు సందడి చేశాయి, పాకిస్తాన్, ఇరాన్, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ ఇలా అనేక ఆసియా దేశాల నుంచి మేకలు, గొర్రెలు తరలి రావడం గమనార్హం. ఇక బక్రీద్ కోసం వారం పది రోజుల ముందుగానే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఏర్పాటైన జంతువుల విక్రయ కేంద్రాల వద్ద అమ్మకందారులు, కొనుగోలుదారులతో పెద్ద సందడి నెలకొంది. ఇక జంతువుల విక్రయ కేంద్రాలకు తీసుకువచ్చే జంతువులు ఆరోగ్యంగా వుంటేనే తేవాలని పోలీసులు, పౌర విభాగం అధికారులు చెబుతుండడంతో విక్రయ దారులు ఈ విషయంలో జాగ్రత్తగా వుండసాగారు. అనారోగ్యంతో వున్న జంతు వులను విక్రయదారులు తేవడం లేదు. ఇక అక్రమంగా జంతువులను తరలించడాన్ని అడ్డుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో చెక్ పో స్టులను పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. జంట నగరాలు, శివారు ప్రాంతాలలో ఈ చెక్‌పోస్టులు ఎక్కువగా వుండడం విశేషం. జంట నగరాలు, శివారు ప్రాంతాలకు దారితీసే అవుటర్ రింగు రోడ్డుతో పాటు ఇతర రహదారులపై ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో కనీసం నాలుగైదు చెక్ పోస్టు లు ఏర్పాటు చేశారు. ప్రతీ చెక్ పోస్టు వద్ద ఐదారుగురు పోలీసులు 24 గంటల పాటు విధుల్లో వుండసాగారు. జంతువులను తరలించే వాహనం కనిపించగానే చెక్‌పోస్టుల్లో విధుల్లో వున్న పోలీసులు ఒకటికి పదిసార్లు తనిఖీ చేసి, అన్నీ సవ్యంగా వుంటేనే అనుమతిస్తున్నారు. రాజస్తాన్ నుంచి ఏటా వందలాది ఒంటెలను హైదరాబాద్‌కు తరలించి, కొద్ది రోజుల పాటు వీధు ల్లో తిప్పి, ఆనక వాటిని వధిస్తూ మాంసాన్ని విక్రయిస్తున్న విషయమై హైకోర్టు సర్కారుకు మొట్టికాయలు వేయడం విదితమే. ఒంటెల వధను అడ్డుకోవాలని, ఇలాంటి పనులకు పాల్పడే వారిని అరెస్టు చేయాలని, ఒంటెలను తరలించే వారిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించడంతో పోలీసులు కూడా కఠినంగా వుండసాగారు. కాగా గురువారం నాడు బక్రీద్ పండగ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రార్థనా స్థలాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే సమయంలో ప్రార్థనల సమయంలో హైదరాబాద్ సహాఅనేకచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

**జంతువుల వ్యర్థాలను వెంటనే తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు:** ఇదిలావుండగా బక్రీద్ పండగ వేళ జంతువుల వ్యర్థాలు వేలాది టన్నులు వుంటుండడం తెలిసిందే. ప్రతీయేటా బక్రీద్ నాడు జంతువుల వ్యర్థాలను ఆయా ప్రాంతాలలో పౌర విభాగం అధికారులు ప్రత్యేక వాహానాలలో డంపింగ్ యార్డులకు తరలిస్తుంటారు. ఈసారి కూడా ఇదే విధంగా ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండగ సందర్భంగా ఆయా ప్రాంతాలలో జంతువుల వ్యర్థాలను వెంటనే తొలగించి, శానిటైజేషన్ చేయాలని అధికారులు ఆదేశించారు.

# 29 నుంచి పిజిఈసెట్ పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** రాష్ట్రంలో ఎం.టెక్, ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పిజి ఇంజనీరింగ్ సెట్(టిజి పిజిఇసెట్) పరీక్షలు శుక్రవారం (మే 29) నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 1 వరకు రోజుకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు టిజి పిజిఇసెట్ కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 26,085 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 29న ఉదయం సెషన్ లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఇసి), బయో టెక్నాలజీ(బిటి), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఇ) పరీక్షలు, మధ్యాహ్నం సెషన్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(సిఎస్) పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 30న ఉదయం సెషన్‌లో ఇన్‌స్ట్రుమెంటర్ ఇంజనీరింగ్(ఇఐ), కెమికల్ ఇంజనీరింగ్(సిహెచ్), టెక్స్‌టైట్ టెక్నాలజి(టిఎక్స్), మైనింగ్ ఇంజనీరింగ్(ఎంఎన్) పరీక్షలు, మధ్యాహ్నం సెషన్‌లో ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ (ఎఆర్), బయోమెడికల్ ఇంజనీరింగ్(బిఎం), మెటలర్జికల్ ఇంజనీరింగ్(ఎంటి) పరీక్షలు, ఈ నెల 31న ఉదయం సెషన్‌లో ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్(ఇఎం), మధ్యాహ్నం సెషన్‌లో నానోటెక్నాలజీ(ఎన్‌టి) పరీక్షలు, జూన్ 1న సివిల్ ఇంజినీరింగ్(సిఇ), ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్(ఇఇ), ఫుడ్ టెక్నాలజీ(ఎఫ్‌టి), ఏరోస్పేస్ ఇంజినీరింగ్(ఎఎస్) నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందు అంటే ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 12:30 గంటలకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామని కన్వీనర్ తెలిపారు.

# తెలుగువారి ఆత్మవిశ్వాసం పసుపు పండుగ

### దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ టిడిపికే, విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పాం, మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యం, భావితరాల కోసం పనిచేయడమే టిడిపి లక్ష్యం: మహానాడు ప్రారంభ ప్రసంగంలో ఎపి సిఎం చంద్రబాబు



బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రారంభమైన మహానాడు వేడుకల్లో జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు, మాజీ స్పీకర్ యనమల, మంత్రులు అచ్చెన్నాయుడు, అనిత, లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు

**విజయవాడ,మే27,ప్రభాతవార్తప్రతినిధి:** మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరి రోజు అని నిరూపించామన్నారు. మహానాడును మహిళలకు అంకితం చేశామన్నారు. గంజాయి, డ్రగ్స్‌పై అత్యంత కఠినంగా ఉన్నామన్నారు. సోషల్ సైకోల తాటతీసి మహిళల గౌరవాన్ని కాపాడతాం. ఆడబిడ్డలకు ఆర్థిక, సామాజిక గౌరవమిస్తున్నామన్నారు.

ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆస్తి హక్కు కల్పించాం. తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాం. మహానాడు అంటే కార్యకర్తల పండుగ అని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు అన్నారు. రెండు రోజుల పాటు హైబ్రీడ్ పద్ధతిలో జరిగే మహానాడు2026 బుధవారం ప్రారంభం అయింది. టిడిపి కార్యా లయం వద్ద తెలుగుదేశం జెండావిష్కరించిన టిడిపి అధినేత చంద్రబాబు, పార్టీ కేంద్ర కార్యాలయంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళుల ర్పించారు, ఎన్టీఆర్ విగ్రహానికి పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు. నివాళులర్పించారు. మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అమరవీరులకు టిడిపి అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్, పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు అంజలి ఘటించారు. చంద్రబాబు జ్యోతి ప్రజ్వలనతో పార్టీ కేంద్ర కార్యాలయంలో మహానాడు ప్రారంభమైంది.

కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ వర్చువల్ వల్ల వాహనాల జోష్ తగ్గిందే కానీ మీలో జోష్ తగ్గలేదు. క్లస్టర్ల నుంచి లక్షలాది మంది పాల్గొన్నారు. మారింది మీటింగ్ విధానమే, మహానాడు విధానాలు కాదు. మహానాడు అన్ని అంశాలపై చర్చించుకుందాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను పరిచయం చేసింది టిడిపి అని వెల్లడించారు. తెలుగుదేశం పుట్టుక, ప్రయాణం, ప్రస్తానం అన్నీ అద్భు తాలేనని చంద్రబాబు అన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం అని, పసుపు జెండా చూస్తే ధైర్యం, నమ్మకం, భరోసా కలుగుతుందన్నారు.

# డిజిటల్‌గా గిరిజన మ్యూజియం

### క్యూఆర్ కోడ్‌తో వివిధ భాషలతో కథనాలు

**హైదరాబాద్, మే 26, ప్రభాతవార్త :** రాష్ట్రానికే తలమానికం కాబోతూ త్వరలో ప్రారంభం కానున్న కొత్త రాంజీ గోండ్ గిరిజన మ్యూజియం అద్యాంతం అధునాత డిజిటల్‌తో రూపుదిద్దుకుంటోంది. అంతేకాకుండా దీనికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానం చేయడం ద్వారా ప్రతిష్టాత్మకం కాబోతోందని గిరిజన మ్యూజియం క్యూరేటర్ డి సత్యన్నారాయణ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం మ్యూజియం సందర్శకులు త్వరలో క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయడం ద్వారా తెలుగుతో పాటు, వివిధ దేశీయ భాషలలో రూపొందించిన కథనాలను వినవచ్చన్నారు. తద్వారా స్వాతంత్ర్య సమరయోధుడు కొమరం భీమ్‌తో సహా గొప్ప గిరిజన యోధుల చారిత్రక వాస్తవాలు, వారసత్వం గురించి తెలుసుకోవచ్చని తెలిపారు. వీటికి సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. చారిత్రక సేకరణలను ప్రజలకు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఈ కొత్త మ్యూజియంలో అధునాతన డిజిటల్ సాధనాలు మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానిస్తారు. అంతేకాకుండా, ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలు కొమరం భీమ్ వంటి ప్రముఖ చారిత్రక వ్యక్తులతో నిజమైన సంభాషణలను అనుకరించడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటాయి. ప్రధాన మంత్రి కార్యాలయం నిర్మాణాన్ని నేరుగా పర్యవేక్షిస్తోందని తెలిపారు. ప్రస్తుతం, తెలంగాణలో ప్రాంతీయ ఆచారాలు, చేతివృత్తులు, ఉత్సవాలు మరియు కళాఖండాలను నమోదు చేసే ఆరు విభిన్న గిరిజన మ్యూజియంలు ఉన్నాయని పేర్కొన్నారు.


# లాజిస్టిక్స్‌లో తెలంగాణ జోరు

### రేవంత్ సర్కార్‌పై కేంద్రం ప్రశంసలు

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:** లాజిస్టిక్స్ రంగంలో తెలంగాణ మరో కీలక మైలురాయిని చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతి సాధించి హై పెర్ఫార్మర్‌గా నిలిచింది. దేశంలోని పలు రాష్ట్రాల మధ్య పోటీలో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లీడ్స్ 2025 నివేదికలో తెలంగాణ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించింది. ప్రత్యేకంగా జలమార్గాల వినియోగంపై తెలంగాణ చూపుతున్న దృష్టిని కేంద్రం ప్రశంసించింది. గోదావరి, కృష్ణా, భీమా, మంజీరా, తుంగభద్ర వంటి జాతీయ జలమార్గాలను సరకు రవాణాకు ఉపయోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నివేదికలో ప్రస్తావించారు. పారిశ్రామిక పార్కుల్లో కనీసం ఐదు ఎకరాలను లాజిస్టిక్స్ మౌలిక వసతులకు కేటాయించే విధానాన్ని కూడా కేంద్రం ప్రశంసించింది. పరిశ్రమల అభివృద్ధితో పాటు రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక నిర్ణయంగా గుర్తించింది. గతంలో అచీవర్ కేటగిరీలో ఉన్న తెలంగాణ, ఈసారి మరింత మెరుగైన స్థాయికి చేరుకోవడం విశేషంగా మారింది. హర్యానా, ఛత్తీస్‌గఢ్, బిహార్ వంటి రాష్ట్రాలతో సమానంగా నిలవడంతో పాటు, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచినట్లు నివేదిక వెల్లడించింది.

### రిజిస్ట్రేషన్ల రద్దీకి చెక్.. ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక చర్యలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే27:** రాష్ట్రంలో భూముల విలువలను వాస్తవ మార్కెట్ ధరలకు అనుగుణంగా క్రమబద్ధీకరించాలన్న రాష్ట్ర మంత్రి వర్గ నిర్ణయంతో రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరిగిన నేపథ్యంలో.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ నెల 29వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు పని వేళలను ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించారు. రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకూడదని, ఎవరూ ఇబ్బందులు పడకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి గారు అధికారులను ఆదేశించారు.




డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలని అందజేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

## హైదరాబాద్‌ను విశ్వ నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి శ్రీధర్ బాబు

**కెపిహెచ్‌బి కాలనీ, మే 27, ప్రభాతవార్త :** హైదరాబాద్ నగరాన్ని విశ్వం నగరంగా తీర్థది తీర్చిదిద్దడమే లక్ష ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుకుందని తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందుకుగాను హైదరాబాద్ విశ్వ నగరంగా రూపొందాలంటే కలుషితంకాని త్రాగునీరు, రహదారులు, విద్యుత్తు డ్రైనేజీ వ్యవస్థ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాల్సి న అవసరం ఉందని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కైతలాపూర్‌లో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇళ్లను 62 మంది నిరుపేదలకు కేటాయించగా బుధవారం జరిగిన పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. దీనికి సంబంధించిన పట్టాలను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపేట వేయడం జరుగుతుందని ఇందులో భాగంగానే ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, పెట్రోల్ బంకుల కేటాయింపు, నూతనంగా కొనుగోలు చేసే బస్సులను మహిళా సంఘాలకు కేటాయించి తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు ఎన్నో పథకాలను చేపట్టిందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం తీసుకోవడం జరిగిందన్నారు. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎక్కువ శాతం నిరుపేదలే ఉన్నారని వారికి అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కట్టించాలని మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, కలెక్టర్ మను చౌదరి, జోనల్ కమిషనర్, ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసులో మరో ఇద్దరు అరెస్టు

**- 13కు చేరిన నిందితుల సంఖ్య - 49 ప్రదేశాల్లో సోదాలు - సిబిఐ అధికారుల వెల్లడి**



**న్యూఢిల్లీ, మే 27:** నీట్-యుజి 2026 పేపర్ లీక్ కేసు సంబంధించి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) బుధవారం మరో ఇద్దరిని అరెస్టు చేసింది. అధికారుల వివరాల ప్రకారం, అరెస్టు అయిన వారిలో లాతూరుకు చెందిన ఒక వైద్యుడు, పుణెలోని ఒక కోచింగ్ సంస్థలో భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఉన్నారు. 'రేణుకాయ్ కెమిస్ట్రీ క్లాసెస్' (ఆర్‌సిసి) కోచింగ్ సంస్థ వ్యవస్థాపకుడు శివరాజ్ మోటెగాంకర్ కుమారుడితో సహా ముగ్గురు విద్యార్థులకు, నీట్ పేపర్ సెట్టర్ శి.జు. కులకర్ణి నుండి రసాయనశాస్త్ర ప్రశ్నలను పొందేందుకు సహకరించడంలో కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలపై మనోజ్ శిరూరేను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. లాతూరులో ఆర్‌సిసి సంస్థను నడుపుతున్న మోటెగాంకర్, ఈ కేసులో ఇటీవలనే అరెస్టు అయ్యారు. పుణె కేంద్రంగా పనిచేసే 'డాక్టర్ అభంగ్ ప్రభు మెడికల్ అకాడమీ' (ఎపిఎంఎ)లో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉన్న తేజస్ హర్షద్‌కుమార్ షాను కూడా అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. 2026 నీట్-యుజి పరీక్షకు సంబంధించిన లీక్ అయిన భౌతికశాస్త్ర ప్రశ్నలను, ఇప్పటికే అరెస్టు అయిన నిందితురాలు మనీషా హవల్దార్ నుండి షా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ అరెస్టులతో, పేపర్ లీక్ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయిన వారి మొత్తం సంఖ్య 13కు చేరింది. ఈ కేసు వెనుక ఉన్న కుట్రను, అలాగే సంఘటనల క్రమాన్ని వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోందని సిబిఐ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 49 ప్రదేశాలలో సోదాలు నిర్వహించి, నేరానికి సంబంధించిన కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## విజయన్ ఇంట్లో ఇడి సోదాలు రాజకీయ దాడే: సిపిఎం పొలిట్ బ్యూరో

**మీడియా సమావేశంలో విజయరాఘవన్, బివి రాఘవులు**




సమావేశంలో పాల్గొన్న సిపిఎం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**చిక్కడపల్లి , మే 27 (ప్రభాతవార్త ):** కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ ఇంట్లో ఈడీ సోదాలు చేయడం పూర్తిగా బీజేపీ చేయిస్తున్న రాజకీయ దాడేనని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ విమర్శించారు. ప్రశ్నించే వ్యక్తులే టార్గెట్‌గా దాడులు చేయిస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కారు దుర్వినియోగం చేస్తోందని తప్పుబట్టారు. బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని ఎంబీభవన్ సిపిఎం రాష్ట్ర కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యురాలు జ్యోతిలతో కలిసి ఆయన మాట్లాడారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి సీపీ ఎం నేతలపై ఒక్క కేసు కూడా లేదని విజయరాఘవన్ నొక్కి చెప్పారు. తమది విలువలతో కూడిన నీతివంతమైన పార్టీ అని, కార్పొరేట్ సంస్థల నుంచి ఇతర పార్టీల మాదిరిగా బాండ్లు సేకరించలేదని స్పష్టం చేశారు. కేరళలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులపై ఆర్థిక రంగానికి సంబంధించిన కేసులున్నాయని గుర్తుచేశారు. ఈడీ దాడులను నిరసిస్తూ కేరళలో వేలాది మంది ప్రజలు రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారన్నారు. ఈ దాడులపై ప్రజలను సమీకరించి రాజకీయ, న్యాయ పోరాటాలు చేస్తామని ప్రకటించారు. మోడీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ గాడితప్పిందని, రూపాయి విలువ 12 శాతం మేర పడిపోయిందని విజయరాఘవన్ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్, డిజిల్ ధరలతో ప్రజలపై తీవ్ర భారం పడుతుంటే, ఆయిల్ కంపెనీలు మాత్రం భారీగా లాభాలు గడిస్తున్నాయని విమర్శించారు. అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు ఉన్నా చమురు నిల్వలను తగినట్టుగా ఉంచుకోవడంలో కేంద్రం విఫలమైందన్నారు. దేశ రాజధానిలోని మల్టీనేషనల్ కంపెనీల్లో కూడా కనీస వేతనాలు అమలు కావడం లేదని, రూ.10 వేలు, రూ.12 వేల జీతంతో పేదలు ఎలా బతకాలో పాలకులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ (నరేగా) చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ, క్షేత్రస్థాయిలో కూలీల పేర్లను పెద్ద ఎత్తున తొలగిస్తున్నారని మండిపడ్డారు.పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రతిపక్షాలపై మోడీ సర్కారు దాడులను తీవ్రం చేసిందని విమర్శించారు. తమిళనాడులో గవర్నర్‌ను అడ్డంపెట్టుకుని విజయ్ సర్కారు ప్రమాణ స్వీకారం చేయకుండా అడ్డుకున్న తీరును ఎండగట్టారు.

## తండ్రి మరణాన్ని తట్టుకోలేక ఉరి వేసుకుని మృతిచెందిన తల్లీ, కొడుకులు

**- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ఘటన**

**అబ్దుల్లాపూర్‌మెట్ మే, 27, ప్రభాతవార్త:** నగర శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి లష్కర్‌గూడ గ్రామ పంచాయతీ కనకదురా నగర్ కాలనీలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. ఆరు మాసాల క్రితం తండ్రి మృతిచెందడంతో తల్లితోకలిసి ఉంటున్న ఓ యువకుడు తీవ్ర మానసిక వేదనకు గురై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, కళ్ల ముందే తన కొడుకు ప్రాణాలు కోల్పోవడాన్ని తట్టుకోలేక తల్లి కూడా చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాద ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం... లష్కర్‌గూడలోని కనకదుర్గానగర్ కాలనీలో పసుల కళావతి (45) అనే మహిళ ఆమె కుమారుడు శివ (20)తో కలిసి నివాసముంటోంది. అయితే గత ఆరు మాసాల క్రితం కళావతి భర్త కళాధర్ మృతిచెందడంతో అప్పటి నుంచి కళావతి, శివకుమార్‌లు మానసిక వేదనకు గురవుతున్నారు. అయితే బుధవారం ఉదయం శివకుమార్ ఫ్యాన్‌కుఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, తన కళ్లముందే తన కుమారుడు తనువు చాలించడాన్ని చూసి తట్టుకోలేక పక్కనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీ లించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తల్లి, కొడుకు ఒకే సారి ఆత్మహత్యకు పాల్పడడంతో స్థానికంగా విషాధం నెలకొన్నది.

# ఆస్తుల కొనుగోలుపై ప్రభుత్వోద్యోగులకు చెక్

**న- హౌసింగ్ బోర్డు, సొసైటీ ఇళ్లకు నో - వివిధ అడ్వాన్స్ రుణాలు కట్**

**- ఉద్యోగుల లోన్స్‌పై కొత్త నిబంధనలు - తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం**

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అందించే వివిధ రకాల అడ్వాన్స్ రుణాల విషయంలో తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఊహించని షాక్ ఇచ్చింది. హౌసింగ్ అడ్వాన్స్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త నిబంధన అమలు కానున్నాయి. హెచ్‌ఎండిఎ, తెలంగాణ హౌసింగ్ బోర్డు, సహకార గృహ నిర్మాణ సొసైటీల ద్వారా ఇళ్లు లేదా ప్లాట్లు కొనుగోలు చేసే ప్రభుత్వ ఉద్యోగులకు హౌసింగ్ అడ్వాన్స్ రుణాలు మంజూరు చేయకూడదని ఆర్థిక శాఖ మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బును మరింత జాగ్రత్తగా వినియోగించటం, బడ్జెట్ నియంత్రణల లక్ష్యంగా పటిష్ట నిబంధనలు అమలుకానున్నాయి. ఈ ఉత్తర్వులు ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం ఏప్రిల్, మే, జూన్ కోసం వివిధ కేటగిరీల అడ్వాన్స్ రుణాల నిధులను విడుదల చేస్తూ జారీ చేయబడ్డాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తులు లేదా సంస్థల నుంచి ఇళ్లు కొనుగోలు చేస్తే మాత్రమే హౌసింగ్ అడ్వాన్స్ పొందవచ్చు. గృహ అడ్వాన్స్ రుణాల రూల్స్ ఇవే ప్రభుత్వ సంస్థల ఆస్తులపై ఈ సౌకర్యం అందుబాటులో ఉండదు. గృహ అడ్వాన్స్ రుణాల కోసం తొలి త్రైమాసికానికి ఇప్పటికే రూ.50 కోట్లు విడుదల చేయబడ్డాయి. నిధుల పంపిణీలో రూల్స్ చాలా ఎక్కువగా ఉన్నాయి. జిల్లా, ప్రాంతీయ కార్యాలయాల ఉద్యోగుల కోసం కేటాయించిన నిధులను సచివాలయం లేదా హెడ్ ఆఫీసు సిబ్బందికి ఎట్టి పరిస్థితుల్లోనూ మళ్లించరాదు. ముఖ్యంగా నాలుగో తరగతి ఉద్యోగులకు అడ్వాన్స్ మంజూరు చేసేటప్పుడు వారి ఆర్థిక సామర్థ్యాన్ని పరిశీలించాలి. అడ్వాన్స్ ఇచ్చే విషయంలో అడుగడుగునా పరిశీలన ఇంటి నిర్మాణం, మరమ్మత్తులకు అవసరమైన మొత్తంలో అడ్వాన్స్ తప్ప మిగిలిన భాగాన్ని ఉద్యోగి స్వయంగా ఏర్పాటు చేసుకోగల సామర్థ్యం ఉందా లేదా అని చెక్ చేసి మాత్రమే అనుమతి ఇవ్వనుంది. రుణాల రికవరీ విషయంలో కూడా కఠిన నిబంధనలు విధించింది. మంజూరైన మొత్తాన్ని నిర్ణీత గడువులోగా ఉద్యోగి వేతనం నుంచి తిరిగి వసూలు చేయడం హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ బాధ్యతగా పేర్కొంది. ఉద్యోగులపై ఆర్థిక భారం తగ్గించేలా కూడా నిర్ణయాలు ఇంటి రుణాలతో పాటు ఇతర అవసరాలకు కూడా నిధులు కేటాయించింది. కొత్త కార్ల కొనుగోలుకు రూ.12.50 కోట్లు, ద్విచక్ర వాహనాలకు రూ.2.50 కోట్లు, కంప్యూటర్ల కొనుగోలుకు రూ.50 లక్షలు విడుదల చేసింది. పిల్లల ఉన్నత విద్య, అత్యవసర ఖర్చుల కోసం రూ.2 కోట్లు కేటాయించింది. విద్యా రుణాల రికవరీని గతంలో 8 నుంచి 10 నెలలకు పెంచడం ద్వారా ఉద్యోగులపై ఆర్థిక భారం తగ్గించే చర్య తీసుకుంది. ప్రభుత్వ ఆస్తులకు బదులుగా ప్రైవేట్ ఆప్షన్లకు ప్రాధాన్యత ఇచ్చి వాటినే పరిశీలించాలి. ఈ నిర్ణయాలు ప్రభుత్వ ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించడం, అనవసరమైన ఖర్చులను నియంత్రించడం, అర్హులైన ఉద్యోగులకు మాత్రమే సౌకర్యాలు అందించడం లక్ష్యంగా పని చేస్తాయి.

ఈ చర్యలు దీర్ఘకాలికంగా ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయని అధికారులు భావిస్తున్నారు.

## వ్యవసాయ ఎగుమతుల్లో భారత్‌కు ఎనిమిదో స్థానం

**2024లో రూ.3.8 లక్షలకోట్ల విలువైన ఎగుమతులు**

**న్యూఢిల్లీ, మే 27:** వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి దేశాల జాబితాలో అమెరికా, బ్రెజిల్, చైనా అగ్రస్థానంలో నిలిచాయి. 2024 సంవత్సరానికి చెందిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) గణాంకాల ఆధారంగా రూపొందించిన ఈ ర్యాంకింగులలో భారత్ టాప్ 10లో చోటు దక్కించుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఆహార సరఫరా గొలుసు కొద్ది దేశాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. 2024లో 181.3 బిలియన్ డాలర్ల ఎగుమతులతో అమెరికా మొదటి స్థానంలో నిలవగా, 144.4 బిలియన్ డాలర్లతో బ్రెజిల్ రెండో స్థానం, 74.8 బిలియన్ డాలర్లతో చైనా మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఇక 45.5 బిలియన్ డాలర్లు దాదాపు రూ. 3.8 లక్షల కోట్లు విలువైన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసిన భారత్, ఈ జాబితాలో 8వ స్థానంలో నిలిచింది. ప్రపంచ మొత్తం ఎగుమతుల్లో భారత్ వాటా 3 శాతంగా ఉంది. ప్రపంచ ఆహార ఎగుమతుల మార్కెట్ విలువ సుమారు 1.5 ట్రిలియన్ డాలర్లు కాగా, ఇందులో 80 శాతానికి పైగా వాటా కేవలం 30 దేశాలదే కావడం గమనార్హం. ముఖ్యంగా అమెరికా, బ్రెజిల్, కెనడా, మెక్సికో దేశాలు కలిపి దాదాపు 30 శాతం వాటాను కలిగి ఉన్నాయి. పెరుగుతున్న రవాణా, ఎరువుల ఖర్చులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆహార ఎగుమతులు వ్యూహాత్మకంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. భారీ స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తులను పండించే చైనా, అధికశాతం దేశీయ అవసరాలకే వినియోగించుకోవడం వల్ల ఎగుమతుల్లో వెనుకబడింది. ఈ నివేదిక ప్రకారం ప్రపంచంలోని టాప్ 15 ఆహార ఎగుమతిదారుల జాబితా నుచూస్తే అమెరికా: 181.3 బిలియన్ డాలర్లు, బ్రెజిల్: 144.4 బిలియన్ డాలరు, చైనా 74.8 బిలియన్ డాలర్లు, కెనడా 66.3 బిలియన్ డాలర్లు, మెక్సికో 49.9 బిలియన్ డాలర్లు ,ఇండోనేషియా: 49.7 బిలియన్ డాలర్లు ఆస్ట్రేలియా 45.8 బిలియన్ డాలర్లు.

## నైజీరియాలో 317 ఉగ్రవాదుల హతం!

**అబూజా,మే 27:** నైజీరియాలో ప్రభుత్వ దళాలు ఉగ్రవాదులను ఊచకోత కోశాయి. మే నెలలో ఇప్పటి వరకు 317 మంది అనుమానిత ఉగ్రవాదులను హతమార్చినట్లు నైజీరియా మిలిటరీ పేర్కొన్నది. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో సుమారు 314 మందిని అరెస్టు చేసినట్లు కూడా మిలిటరీ వెల్లడించింది. నెలవారీ మీడియా సమావేశంలో మిలిటరీ ప్రతినిధి మైఖేల్ ఓంజా మాట్లాడుతూ తమ ఆపరేషన్ ద్వారా అపహరణకు గురైన సుమారు 221 మంది బాధితులను రక్షించినట్లు చెప్పారు. మరో 18 మంది అనుమానిత ఉగ్రవాదులు సరెండర్ అయినట్లు పేర్కొన్నారు. త్రివిధ దళాలకు చెందిన బృందాలు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్‌లో పాల్గొన్నట్లు ఓంజా తెలిపారు. ఉగ్రవాదుల నుంచి 93 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా నిర్వహిస్తున్న మూడు ఆయిల్ రిఫైనరీ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు చెప్పారు.

## పళనిస్వామి చెంతకు చేరిన రెబెల్ ఎమ్మెల్యేలు!

**ఇపిఎస్‌కే పూర్తి మద్దతిస్తామని ప్రకటన**

**చెన్నై, మే 27:** అసెంబ్లీలో బలపరీక్ష సందర్భంగా పార్టీ విప్‌ను ధిక్కరించి పలువురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించడం, నలుగురు ఎమ్మెల్యేల రాజీనామాతో ఉక్కిరిబిక్కిరవుతున్న అన్నాడీఎంకెకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. మాజీ మంత్రులు షణ్ముగం, వేలుమణి నేతృత్వంలోని అన్నాడీఎంకే తిరుగువర్గం నేతలు బుధవారంనాడు పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిస్వామితో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. పళనిస్వామికి మద్దతు ప్రకటించారు.

అయితే షణ్ముగం మాత్రం ఈ సమావేశంలో పాల్గొనలేదు. అనంతరం అసెంబ్లీలో కలిసే పనిచేస్తామంటూ ఒక లేఖను స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌కు తిరుగుబాటు వర్గం ఎమ్మెల్యేలు అందజేశారు.

## కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఇవి బస్సులు దోహదపడతాయి : మంత్రి పొన్నం ప్రభాకర్




ఇవి బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**కెపిహెచ్‌బి కాలనీ, మే 26, ప్రభాతవార్త** కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఇకపై ఈవీ బస్సు లు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో కూకట్‌పల్లి డిపోకు చెందిన 60 ఎలక్ట్రికల్ బస్సు లను బుధవారం మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కూకట్‌పల్లి డిపో విస్తరణలో భాగంగా ఐదు ఎకరాల స్థలంలో కొత్త డిపో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. కూకట్‌పల్లి ప్రాంతాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా మార్చేందుకు ఇకపై ఈవీ బస్సు లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలోనే కార్మికుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. టిపిసిసి ఉపాధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో అనేక సంస్కరణలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో 545 ఈవీ బస్సు లు నడుస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 2,200 ఈవీ బస్సు లను ప్రవేశపెట్టేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నగరంలో కొత్త కాలనీలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బండి రమేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వసుధైక కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలి : కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాష్



వివిధ ప్రతిష్టాత్మక అవార్డులతో సంస్థ సభ్యులను సత్కరిస్తున్న బండ ప్రకాష్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తదితర ప్రముఖ అతిథులు

**రవీంద్రభారతి, మే 27 ప్రభాతవార్త :** ప్రపంచంలోకెల్లా భారతీయ వసుధైక కుటుంబ వ్యవస్థ ఎంతో గొప్పనైనది, ప్రతీఒక్కరూ ఆచరించి కాపాడుకోవాల్సి ందేనని తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డా. బండ ప్రకాష్ అన్నారు. అప్పుడే సమాజంలోని కుటుంబాలలో ఆనందోత్సా హాలతోపాటు మానవీయ విలువలు పెంపొందుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు తోడ్పతుడున్న తెలంగాణ మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పాటుపడాల్సి న అవసరం ఉందని సూచిస్తూ మ్యారేజ్ బ్యూరో రంగ సేవలను ప్రశంసించారు. సమాజసేవలో తమవంతు పాత్ర పోషిస్తున్న సభ్యులందరినీ అభినందించి మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచాఛ్చారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్రాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో జరిగిన సంస్థ 5వ వార్షికోత్స వ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన బండ ప్రకాష్ విశిష్ట అతిథులు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తదితర ప్రముఖులతో కలిసి మ్యారేజ్ బ్యూరో రంగంలో విశిష్ట సేవలంది స్తున్న నిర్వాహకులు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన ప్రముఖులు, సేవాకార్య క్రమాల్లో ముందుండే ప్రము ఖులను ప్రతిష్టాత్మక మహా నంది, గౌతమ బుద్ధ సేవా రత్న, నటరాజ్, మ్యారేజ్ బ్యూరో ఐకాన్, మ్యారేజ్ బ్యూరో రత్న, ఉత్తమ సేవారత్న, శ్రమశక్తి అవార్డులను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు. ఈ సందర్భంగా బుర్ర శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షోపన్యాసంలో సభ్యులు సంవత్స ర కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 1800లకుపైగా వివాహాలు విజయవంతంగా నిర్వహించడం విశేషంగా నిలిచిందన్నారు. సభ్యుల ఐక్యత, సేవాభావం, పరస్పర సహకారంతో సంస్థ మరింత బలోపేత మౌతుందని తెలిపారు. మెరుగైన సమాజ నిర్మాణంలో బాధ్యతయుతంగా పనిచేస్తున్న అసోసియేషన్ సభ్యుల సమస్యలను ప్రభుత్వం తీర్చాలని కోరారు.

## ఉచిత డిస్కం లైసెన్స్ తిరస్కరించాలి

**విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు మాజీ మంత్రి హరీష్ లేఖ**



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త** కొత్తగా ఏర్పాటు చేసిన మూడో విద్యుత్ పంపిణీ సంస్థకు లైసెన్సు ను మంజూరు చేయవద్దని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత టి హరీష్‌రావు కోరారు. ఆర్థిక అంచనాలు, అప్పుల సర్దుబాట్లు, ప్రభుత్వ సబ్సిడీల వివరాలు లేకుండా లైసెన్స్ మంజూరు చేయడం సమంజసం కాదన్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు లేఖ రాశారు. రాష్ట్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో విద్యుత్తు రంగాన్ని సంక్షోభంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. మూడో డిస్కం ఏర్పాటు చేస్తామని ప్రకటించడం ద్వారా అన్ని వర్గాల ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోందన్నారు. ఆచరణ సాధ్యం కాని విధానాలతో విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా నడిపించే కుట్ర జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కమిషన్ బహిరంగ విచారణ పూర్తి కాకముందే జూన్ 2 నుంచి రైతు డిస్కం ప్రారంభమవుతుందని ప్రభుత్వం ప్రకటించడం, విచారణ పూర్తికాకముందే తీర్పు చెప్పినట్లుగా కనిపిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎవరూ ప్రతిపాదించకుండా, కోరకుండా ఆర్థిక పరమైన అంశాలు జి.ఓ.44లో పేర్కొంటూ మూడో డిస్కం ఏర్పాటు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అలాగే యావరేజ్ బిల్లింగ్ రేటు, యావరేజ్ కాస్ట్ ఆఫ్ సర్వీస్ లో వ్యత్యాసం ఉందని, దీని వల్ల డిస్కంలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని చెప్పారు. మూడో డిస్కం వంటి కీలక నిర్ణయం అసెంబ్లీలో చర్చించకపోవడం మరింత అనుమానాలకు బలం చేకూర్చుతోందని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల విద్యుత్తు వినియోగదారులపై ప్రభావం చూపే ఈ నిర్ణయంపై బహిరంగ విచారణను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయడం సమంజసం కాదని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో రైతులు, ఉద్యోగులు, వినియోగదారులతో బహిరంగ విచారణలు నిర్వహించాలని కమిషన్‌ను కోరుతున్నట్లు పేర్కొన్నారు. రైతు డిస్కం అయితే ఇందులో ప్రభుత్వ సర్వీసులు, మిషన్ భగీరథ, నీటి ఎత్తిపోతల పథకాలు, మున్సిపల్ మంచినీటి సరఫరా పథకాలను ఎందుకు చేర్చారని ప్రశ్నించారు.

## దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో రూ. కోటి 22 లక్షల నగదు సీజ్

**ఆపరేషన్ సతర్క్ - నార్కోస్‌లో ఆర్పీఎఫ్ ఘన విజయం**

**రూ.1.22 కోట్ల అక్రమ నగదు స్వాధీనం.. రూ.41.5 లక్షల గంజాయి రాకెట్ ఛేదన**

**తార్నాక, మే 27 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలటో భారీగా హవాలా నగదు పట్టుబడింది. ముంబై నుంచి సికింద్రాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న కోటి 22 లక్షల 70 వేల నగదును రైల్వే జీఆర్‌పి, ఆర్‌పీఎఫ్ సిబ్బంది కలిలి పట్టుకున్నారు. మే 26న ముంబై నుంచి హైదరాబాద్ వస్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలులో.. బోల్లారం, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ల మధ్య తనిఖీ చేపట్టారు అధికారులు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్) ఆపరేషన్ సతర్క్, ఆపరేషన్ నార్కోస్ట్ కింద చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో విశేష ఫలితాలు సాధించింది. మే 25, 26 తేదీల్లో నిర్వహించిన ఈ ఆపరేషన్లలో భారీ మొత్తంలో అక్రమ నగదు, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితులను అదుపులోకి తీసుకుంది. ఆపరేషన్ సతర్క్‌లో భాగంగా హైదరాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ సిబ్బంది రైలు నం.17057 దేవగిరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. క్లెయిమ్ ప్రివెన్షన్ అండ్ డిటెక్షన్ స్క్వాడ్ (సీపీడీఎస్) అధికారులు అతని ప్రవర్తనలో అసాధారణతను గమనించి తనిఖీలు నిర్వహించగా, రెండు సంచుల్లో రూ.1,22,70,000 విలువైన లెక్కచూపని నగదు లభ్యమైంది. ప్రాథమిక విచారణలో ఈ నగదును ముంబై జవేరీ బజార్ నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్లు గుర్తించారు. అనంతరం నగదు, అనుమానితుడిని తదుపరి విచారణ నిమిత్తం జీఆర్పీకి అప్పగించారు. ఈ విషయాన్ని ఆదాయపు పన్ను శాఖ, ఇంటెలిజెన్స్ బ్యూరో దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఐసీజేఎస్, ఆర్పీఎఫ్ సైబర్ సెల్ ద్వారా డిజిటల్ విశ్లేషణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఇక ఆపరేషన్ నార్కోస్ట్‌లో భాగంగా హైదరాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. రైలు నం.20809 నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో సాధారణ నిఘా తనిఖీల సమయంలో ఓ ప్రయాణికుడి అనుమానాస్పద ప్రవర్తనను గమనించిన సీపీడీఎస్ బృందం తనిఖీలు చేపట్టింది. ప్రారంభంలో వ్యక్తిగత తనిఖీగా ప్రారంభమైన ఈ చర్య, భారీ అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల ముఠా బట్టబయలు.

# భావితరాలకు ఆదర్శం ప్రవక్తల జీవితం

నేడు బక్రీద్

ముస్లింలు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే రెండు పండగల్లో రెండవది బక్రీద్. త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండగను జరుపుకుం టారు. లక్షలాది మంది హజ్‌యాత్రను చేస్తారు. బక్రీద్ అంటే మరో అంశం. అదే ఖుర్బాని.

**ఖుర్బానీ ప్రాధాన్యత:** ముస్లిం సొదరులు ప్రపంచ



వ్యాప్తంగా జరుపుకునే పండగల్లో రెండు ప్రధానమైనవి రంజాన్. బక్రీద్. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్నబిడ్డను సైతం తన చేతులతో బలి (ఖుర్బానీ) ఇచ్చిన రోజూ బక్రీద్ అంటారు. మానవుడు ఆచరించాల్సి న నాలుగు ధర్మాలను పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించగా ఐదవది అయిన హజ్ సందర్శనం బక్రీద్‌లో ఆచరిస్తారు. 'బక్రీ' అంటే మేక అని ఈద్ అంటే 'పండగ' అని అర్థం. బక్రీద్ అంటే దైవాజ్ఞను పాటించే భక్తులు దేనైనా సమర్పిస్తారు ( ఖుర్బానీ )అనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మానవుని సృష్టించిన దేవుడు ప్రపంచంలో అన్ని విధాల సదుపా యాల్ని కల్పించి వాటిని అనుభ విస్తూ తనను ధ్యానం చేయమని ఆదేశించాడు. ఈ ఆదేశాలను ఆచరించిన ప్రవక్తల జీవితాలను భావి తరా లకు అందిం చేందుకు పవిత్ర ఖుర్ ఆన్‌లో పలు సంఘటనలను పొందుపరచారు. ఇబ్ర హీం సొలైఅలా అలాహో సొల్లాం భగవంతుని ఆజ్ఞతో తన కన్న బిడ్డను బలి ఇవ్వటం గమనిస్తే 'త్యాగనిరతి'కి నిదర్శ నంగా చెప్పవచ్చు,

**బక్రీద్ ప్రాధాన్యత :** బక్రీద్ అంటే మేకను బలి ఇవ్వటం అని చెబుతారు.ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం ఖలీలుల్లా భగవంతుని మార్గంలో నడుస్తుండే వారు. ఇబ్రహీం ఖలీలుల్లాను 'దేవుని మిత్రుడనే' పేరు కూడా ఉంది. ఆతన్ని భగవంతుడు పరీక్షించ దల చారు. 80 సంవత్స రాల వయస్సు వరకు ఇబ్రహీం ఖలీలుల్లాకు సంతతి లేదు. తరు వాత మగసంతానం కల్గటంతో ఇబ్రహీం ఖలీలుల్లా వారి భార్యలు సారా సొల్లే అలాహో సొల్లాం, హాజీరాలు ఎంతో ప్రేమాను రాగాలతో చూసుకునే వారు. అయితే దేవుడు ఆయన్ను పరీక్షించదలచి దైవదూత జిబ్రాయిల్ ద్వారా ఓ సందేశాన్ని పంపారు. జన్మించిన చిన్నారిని, పురిటిలో ఉన్న భార్య హాజిరాను నేటి జమ్ జమ్ బావి ఉన్న చోట నాడు మనుషులే కాదు. కనీసం పక్షులు కూడా సంచరించని ఎడారిలో కనీసం నీటి చుక్క కంటికి కనబడని ప్రాంతంలో వదలి పెట్టారు. ఆమెతో పాటు ఇష్కఇజా(చర్మపు సంచి)లో ఖర్జూరపు కాయలు, కొంత నీటిని మాత్రమే ఉంచారు. ఎడారిలో పెద్ద కొండ వెనుక వదలి పెట్టారు. చిన్నారి పాలకోసం ఏడుస్తూ నేలమీద కాలు రువ్వగా వచ్చిన నీటి కొలనే నేడు 'జమ్ జమ్' అంటారు. హాజిరా నీటి కోసం ఆహారం కోసం పరితపించిన ప్రాంతాన్నే 'నేడు హజ్‌కు వెళ్ళు యాత్రికులు' సంచరించే సఫా, మరువా మైదానాలం టారు. భగవంతుడు మరోసారి ఇబ్రాహీం ఖలీలుల్లాకు పరీక్ష పెట్టారు. అన్నింటి కన్నా అత్యంత ప్రీతిపాత్రమై నది తన బిడ్డ ఇస్మాయిల్. కాబట్టి దైవాజ్ఞ తన బిడ్డను బలి కోరుతోందని నిర్ణయించుకున్నారు. సతీమణిని ఇస్మాయిల్‌ను తన సే స్నేహితుని మిలాఖత్( కలపటానికి) కోసం తీసుకెళుతున్నాను చక్కగా అలంకరించాలని సూచిస్తారు. భర్త మాటను జవదాటని హాజిరా ఇస్మాయిల్‌ను ముస్తాబు చేసారు. అయితే 'సైతాన్' హాజీరాను, ఇస్మాయిల్‌ను పలుమార్లు రెచ్చగొడుతూ ఇ బ్రహీం భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారని భగ్నపరచుటకు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ చిన్నారి ఇస్మాయిల్‌ను సైతాన్ నిన్ను మీ తండ్రి భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారన్నపుడు దేవుని ఆజ్ఞను పాటించటం కన్నా తనకు ఏం కావాలని ప్రశ్నించటం గమనించ దగ్గ విషయం. ఇబ్రహీం చేతిలో తాడు కత్తి కళ్ళ నుంచి నీరు పెల్లు బుతుండగా గుండె నిండా విషాదంతో మైదానం లోకి తీసుకెళ్ళారు. అయితే తండ్రి తనను బలి ఇచ్చే టప్పుడు ఆయన చేతులు వణుకుతాయని తాను గిల గిల్లాడే సమయంలో ఓర్చుకోలేరు కాబట్టి తండ్రీ! నన్ను బలి ఇచ్చేటప్పుడు మీరు కళ్ళకు గంతలు కట్టుకోండి. నా కాళ్ళు చేతులు కట్టిపడేయండి, తనన్ను బోర్లా పడుకోబెట్టండి అని సూచించటం ఆ తండ్రి గుండెల్ని పిండివేసింది. ఆ తండ్రి కొడుకుల త్యాగనిరతి భావిత రాలకు మార్గదర్శకంగా మారింది. అయితే బలి ఇచ్చే సమయంలో కత్తి తెగకపోవటం ఇబ్రాహీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటం కత్తి నుంచి అశరీర వాణి 'ఇబ్రహీం నేను నీ ఆజ్ఞను పాటిం చాలా? దేవుని ఆజ్ఞను పాటించాలా? అని' ప్రశ్నించటం సత్యసంధతకు నిదర్శనంగా నిలి చింది. దేవుడు తన మిత్రుని దైవాజ్ఞ పాలనను మెచ్చి జిబ్రాయిల్ ద్వారా స్వర్గం నుంచి ఓ దుంబా( మంచి జాతి పొట్టేలు లాంటిది)ను పంపటం కత్తి దాని మెడమీద తెగటం జరిగింది. దీనినే ఖుర్బానీ అంటారు. ఈ సంఘటనకు నిదర్శనంగా నేడు 'బక్రీద్'పండగను జరుపుకుంటున్నారు.

- ఎస్.రహంతుల్లా

# ఋతు స్రావంలోనూ పరిశుభ్రత మెండుగా !

నేడు ఋతుస్రావ పరిశుభ్రతా దినోత్సవం



పీరియడ్స్ అనేది స్త్రీ ప్రతి నెలా జరిగే సహజ ప్రక్రియ. ఈ సమయంలో వారు కూడా అనేక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అనుభవిం,ఊ బాధ కూడా తక్కువేం కాదు. పీరియడ్స్ సమయంలో మహిళలు కూడా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించడమూ అవసరమే. ఎందుకంటే పరి శుభ్రత లేకపోవడం వల్ల చాలా సార్లు తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయి. ఇటువంటి పరిస్థితిలపై అవగాహన కల్పించడానికే ప్రతి సంవత్స రం మే 28నప్రపంచ ఋతుక్రమ పరిశుభ్రత దినోత్స వం జరుపుకుంటారు. నీరు పారిశుద్ధం, పరి శుభ్రత రంగానకి చెందిన 'వాష్ అనే ఒక జర్మనీ సంస్థ 2014లో ఈ దినోత్స వానికి శ్రీకారం చుట్టింది. ఋతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతల పట్ల అవగాహనను పెంచి అపోహలను తొలగించడమే రుతుక్రమ పరిశుభ్రతా దినోత్స వం ప్రధాన ఉద్దేశం. నేటికీ ఋతుస్రావం గురించి అనేక రకాల అపోహలు వ్యాప్తి చెందుతాయి. దీనికి సంబంధించి సాంప్రదాయిక ఆలోచనల బాధితులుగా ఉన్నారు. అంతే కాకుండా పీరియడ్స్‌కు సంబంధించిన ముఖ్యమైన విషయాలపై అవగాహన లేని మహిళలు గ్రామాల్లోనే కాకుండా నగరాల్లో కూడా చాలా మంది ఉన్నారు. గురించి కొంచెం గర్భాశయ క్యాన్సర్ లేదా యోని ఇన్ఫెక్షన్ వంటి తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. మహిళలో ఋతుస్రావ సమయంలో పరిశుభ్రత కోసం శ్రద్ధ వహించాలనే జరుపుకుంటారు. ప్రత్యేకించి పీరియడ్‌కి సంబంధించిన ముఖ్యమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడం, తద్వారా మహిళలు ఇతర వ్యాధుల బారిన పడకుండా ఉంటారు. వాస్తవానికి చాలా మంది స్త్రీలు ఒక నెలలో 5 రోజులు వారి పీరియడ్స్ సమయం. సగటు పీరియడ్ సైకిల్ 28 రోజులు. అందుకే ప్రతి సంవత్స రం మే 28న రుతుక్రమ పరిశుభ్రత దినోత్స వాన్ని జరుపుకుంటారు. మహిళల శరీరంలో ఉత్పత్తయ్యే హార్మోన్లలో మార్పుల ఫలితంగా గర్భాశయ నుంచి విడిపోతుంది. ఈ క్రమంలో విచ్ఛిన్నమైన రక్తనాళాల నుంచి వెలువడిన రక్తంతో కలిసి రుతుస్రావం అయిపోతుంది సాధారణంగా 21 నంచి 35 రోజుల మధ్య జరిగే ఈ ప్రక్రియ యవ్వనం నుంచి మెనోపాజ్ వరకూ కొనసాగుతుంది. ఆడపిల్లలకు నెలసరి పట్ల అవగా హన ఇంటి నుంచే మొదలవ్వాలి. మొదటి నెలసరికి ముందే అవగాహన కల్పిం చాలి. అర్థం లేని భయాలు, అపోహ లను తొలగించి శరీర నిర్మాణం నెలసరి ప్రయోజనాలు గురించి వివరిం చాలి. శానిటరీ ప్యాడ్స్ టాపూన్స్, మెన్‌స్ట్రువల్ కప్స్ ప్యాడ్స్ ప్రతి నాలుగు గంటలకో సారి మార్చు కుంటూ ఉండాలి. మార్చే ముందు తర్వాత ప్రతిసారీ చేతులు శుభ్రపరుచుకోవాలి. జననేంద్రియాలను శుభ్రం చేసుకోడా నికి శుభ్రమైన నీళ్ల వాడుకోవలి. ఉపయోగించిన సాధ నాలను పర్యావరణానికి హాని కలగని రీతిలో విసర్జించాలి. ◻

# 'పానీపూరీ'ని గప్‌చిప్‌గా ..!



'పానీపూరీ'ని గప్‌చిప్‌లని కూడా అంటారు తెలుసా జనం వదల్లేని స్ట్రీట్ ఫుడ్. రోజూ తిన్నా విసుగే యదు. పానీపూరీ ఇంట్లో కూడా చేసుకోవచ్చు. మీ పిల్లలకైతే పూరీల ప్యాకెట్ బయట కొనుక్కోవచ్చు కానీ.. పానీ తేలిగ్గా ఇంట్లోనే చేసు కోవచ్చు. రెండున్నర టేబుల్ స్పూన్ల ఎండిన పుదీనా ఆకుల పొడి, రెండు టేబుల్ స్పూన్ల వేయించిన జీల కర్ర,చెంచా చొప్పున మిరి యాల పొడి, సైంధవ లవణం, ధనియాల పొడి, అర చెంచా చొప్పున శొంఠి పొడి, ఆమ్‌చూర్ పౌడర్, పంచదార, కాస్త ఇంగువ, చిటికెడు సిట్రిక్ యాసిడ్ క్రిస్టల్స్‌ను తీసు కోవాలి. చేయడం కూడా మహా సులభం.. వీటన్నిటినీ కలిపి గ్రైండ్ చేస్తే చాలు ఘుమఘుమలడే 'పానీపూరీ మసాలా' తయారై పోతుంది. పొడిని చాలా మెత్తగా తయారుచేసుకోండి. దీన్ని తడిలేని సీసాలో మాత్రం బరకగా లేకుండా చాలా మెత్తగా ఉంచాలి. లేదంటే సరిగ్గా కలవదు. దీన్ని తడి లేని సీసాలో భద్రం చేసుకుంటే పానీపూరీ తినదలచినప్పుడు కప్పు నీళ్లల్లో అర చెంచా చొప్పున కలిపితే సరిపోతుంది. ఎంత తినాలనా, ఎన్నిసార్లు తినాలన్నా ఎంతో ఇష్టంగా పూరీతో జుర్రేయచ్చు. ◻

చెలి


సామాజిక పరిణామంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.

ఈ మెయిల్:Cheli@vaartha.com

# వ్యథ: శిక్ష కాదు, సహనంతో మార్చండి !

ప్రశ్న: మా అమ్మాయికి ఏడేళ్ల వయస్సు. ఎప్పుడూ ఏదో ఒకటి తింటూనే ఉంటుంది. ఏదీ దొరక్క పోతే వక్కపొడి నములుతూ ఉంటుంది. ఎప్పుడు పడితే అప్పుడు తినకూడదు అంటే వినడం లేదు. నేను భయ పెట్టి చూసాను. మావారు ఒక్కో సారి బాగా కొట్టినా ఆమెలో మార్పు రాలేదు. ఇలా తినడాన్ని బులిమియా అని ఎప్పుడో చదివిన గుర్తుంది. దీనిని రుగ్మతగా భావించాలా లేక ప్రవర్తనా లోపం అనుకోవాలా ? మా అమ్మాయిని కౌన్సెలింగ్ ద్వారా మార్చవచ్చా లేక సైకియాట్రిస్ట్ ద్వారా చికిత్స చేయించాలా? ఈ సమస్యకు కారణాలు పరిష్కార మార్గాలు సూచించండి. - ఒక సోదరి, తిరుపతి

జవాబు: ఏడేళ్ల పిల్లల్లో తరచూ తినాలనిపించడం ఒక్కటే చూసి వెంటనే 'బులిమియా" అని నిర్ణయించడం సరైంది కాదు. ఇది చాలా సందర్భాల్లో ప్రవర్తన, అలవాటు, భావోద్వేగ ఆకలి, ఆందోళన, బోర్ ఫీలింగ్ లేదా శారీరక కారణం కావచ్చు. భయపెట్టడం, కొట్టడం వల్ల ఈ అలవాటు తగ్గదు. అలా చేస్తే మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉంది.దీనికి ఒత్తిడి, భయం, ఆందోళన, సరైన టైమ్‌కు పూర్తి భోజనం లేకపోవడం,చాక్లెట్లు, జంక్ ఫుడ్ ఎక్కువగా ఇవ్వడం, నిద్ర లేమి వల్ల ఈ సమస్య రావచ్చు. కొన్నిసార్లు ఐరన్ లోపం, థైరాయిడ్ వంటి శారీరక సమస్యలు కారణం కావచ్చు. పెన్సిల్, చాక్, పొడి వంటి వస్తువులు నములుతూ ఉంటే తప్పకుండా డాక్టరును కలవాలి. అమ్మాయికి రోజుకు మూడుసార్లు భోజనాలు, రెండు ఆరోగ్యకరమైన స్నాక్స్ అలవాటు చేయండి. ఇంట్లో జంక్ ఫుడ్ నిల్వ తగ్గించండి. చాక్లెట్లు, బిస్కెట్లు ఇవ్వడం కంటే పండ్లు ఇవ్వడం అలవాటు చేయండి. 'తినొద్దు' అని పదే పదే చెప్పడానికి బదులు దారి మళ్లించండి. ఆటలు, శారీరక వ్యాయామాలు, సమతుల ఆహారం, సరైన నిద్ర అల వాటు చేయండి. ఖాళీగా ఉండకుండా ఇష్టమైన పనులు చేసేలా ప్రోత్స హించండి. సెల్ ఫోన్, టివి, ఇంటర్ నెట్ లాంటి వాటికి దూరంగా ఉంచండి. ఆమెతో సరదాగా గడపడానికి ప్రయత్నం చేయండి. తల్లితండ్రులు ఇద్దరు ఒకేలా చెప్పండి ఆందోళన కోపం, భయం, ఒంటరి తనం ఉంటే పదేపదే తినాలనే ఆలోచన ఆపుకోలేకపోతే స్కూల్‌లో కూడా ఇదే అలవాటు ఉంటే సైకాలజిస్ట్‌ను కలవండి. కౌన్సెలింగ్ ద్వారా మార్పు ఉంటుంది. బరువు చాలా వేగంగా పెరగడం లేదా తగ్గడం రాత్రిళ్లు దాచుకుని తినడం వాంతులు చేసుకోవడం, తినకపోతే తీవ్ర ఆగ్రహం చదువులో, ప్రవర్తనలో పెద్ద మార్పులుపొడి, చాక్, మట్టి వంటి తినరాని వస్తువులు పదేపదే తినడం చేస్తుంటే సైకియాట్రిస్ట్‌ను కలవండి.శిక్ష కంటే సహనం, నియమం, కౌన్సెలింగ్ ఎక్కువ ప్రయోజనం ఇస్తాయి.



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# ఘనంగా ప్రారంభమైన 'లఫూట్ గ్యాంగ్'



ఎల్‌ఆర్‌ఎస్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై కొండాపూర్ లక్ష్మీకాంత్ రెడ్డి నిర్మాతగా అనురాగ్ అధర్వ రాజు రచనా దర్శకత్వం లో వర్ధన్ మయూర్ కొయ్యాడ సినిమా టోగ్రాఫర్‌గా ప్రారంభ మైన చిత్రం లఫూట్ గ్యాంగ్. ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్ఆర్ ధృవన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా టి సి ప్రసన్నకుమార్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. వెంకటేష్ అత్తిలి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి శ్రీనివాస్ కంటైపాలెం, రాంబాబు కుశ రైటర్స్ గా పనిచేస్తున్నారు. హైదరాబాదులోని రామానాయుడు స్టూడియోస్‌లో పూజ కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ప్రారంభమైన ఈ చిత్రం ప్రారంభానికి దర్శకుడు పవన్ సాధినేని, నిర్మాత బివిఎస్ రవి, ప్రముఖ నటులు రాజ్ తరుణ్, ఆకాష్ పూరి, అలీ, రాహుల్ విజయ్, నటి దీప్శిక, అర్చన అయ్యర్, దర్శక నిర్మాత అనిల్ కడియాల తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ చిత్రానికి నటుడు అలీ క్లాప్ కొట్టగా దర్శకుడు పవన్ సాధినేని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నటులు రాజ్‌తరుణ్, ఆకాష్ పూరి చేతుల మీదుగా స్క్రిప్ట్ అందించారు. రాఖీ, రిత్విక్, అభినవ్, నందు, ఆంటోనీ కార్తిక్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ టాలీవుడ్ సీనియర్ నటీనటులు కీలకపాత్రలు పోషించుకున్నట్లు చిత్ర బృందం తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు అనురాగ్ మాట్లాడుతూ... "మా చిత్ర ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన . 1990ల నాటి రోజులలో జరిగే ఒక మంచి ఎంటర్టైనింగ్ చిత్రం. ఇప్పటికీ ఆ టైం పీరియడ్ లో ఎన్నో కథలు వచ్చినప్పటికీ ఈ కథ ఖచ్చితంగా మిమ్మల్ని ఎంటర్టైన్ చేస్తుంది" అన్నారు. నిర్మాత కొండాపూర్ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... మా చిత్ర ఓపెనింగ్ కార్యక్రమానికి వచ్చిన అందరికీ థాంక్స్.


# తెర

# 'సందిగ్ధం' ప్రి రిలీజ్ ఈవెంట్



'సందిగ్ధం' ప్రీ రిలీజ్ ఈవెంట్ లో తమ్మారెడ్డి భరద్వాజ్.. సంధ్య తిరువీధుల నిర్మాణంలో తీర్థ క్రియేషన్స్ బ్యానర్‌పై పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో రానున్న చిత్రం 'సందిగ్ధం'. ఈ మూవీలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి మెయిన్ లీడ్స్‌లో నటించగా, విలన్ రోల్ లో తెర చేప ఫేమ్ నవీన్ సంకరపు నటించారు. ఈ సినిమాని మే 29న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, సాంగ్స్, ట్రైలర్ అందరినీ ఆకట్టుకున్నాయి. తమ్మారెడ్డి భరద్వాజ్ మాట్లాడుతూ.. 'సందిగ్ధం' అనే టైటిల్ చాలా బాగుంది. ఈ మధ్య అసలు టైటిల్స్ ఎలా ఉంటు న్నాయో అందరం చూస్తున్నాం. ఈ సినిమాకి మాత్రం అచ్చమైన తెలుగులో టైటిల్ పెట్టారు. అడవుల్లో ఎంతో కష్టపడి మూవీని చేశారని టీజర్, ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ.. .. 'సందిగ్ధం' విషయంలో మీడియా మాకు ఎప్పుడూ సపోర్ట్‌గా నిలుస్తూనే ఉంది. మా కోసం ఇక్కడకు వచ్చిన తమ్మారెడ్డికి థాంక్స్. ఈ ప్రయాణంలో నిర్మాత, నా భార్య సంధ్య ఎంతో సహకరించారు. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ ఈ చిత్రంలో అద్భుతంగా నటించారు. నిహాల్ మాట్లాడుతూ.. .. 'సందిగ్ధం'లో అవకాశం ఇచ్చిన పార్థుకి థాంక్స్. ప్రియా దేశ్ పాగ్ మాట్లాడుతూ.. .. 'సందిగ్ధం' మూవీలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. కాజల్ తివారి మాట్లాడుతూ.. 'సందిగ్ధం' సినిమాకు పని చేయడం ఆనందంగా ఉంది. అర్జున్ సిహెచ్ మాట్లాడుతూ.. ..'సందిగ్ధం' సినిమాలో నాకు ఇంత మంచి పాత్రను ఇచ్చిన పార్థు అన్నకి, సంధ్యకి థాంక్స్. నటుడు ఆనంద్ మాట్లాడుతూ.. .. 'సందిగ్ధం' మూవీని సంధ్య, పార్థు గొప్పగా తెరకెక్కించారు. నటుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ.. .. 'సందిగ్ధం' చిత్రంలో నేను ప్రతి నాయకుడిగా నటించాను. మా కోసం వచ్చిన తమ్మారెడ్డి గారికి థాంక్స్. చిన్న సినిమాలకు ఆయనెప్పుడూ సపోర్ట్‌గా ఉంటారు.

# 'పెద్ది'లో అప్పలసూరి పాత్ర నా కెరీర్‌లో నంబర్ వన్ : జగపతిబాబు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది', బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన ట్రైలర్ తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్నాయి. 'పెద్ది'లో అప్పలసూరి పాత్ర చాలా కొత్తగా కనిపిస్తోంది.. అది ఎలా సాధ్యమైంది?ఆ క్రెడిట్ మొత్తం డైరెక్టర్ బుచ్చిబాబుకే దక్కుతుంది. ఆయన ఆ పాత్రను అలా ఉండాలని కోరుకున్నారు. నేషనల్ అవార్డు విన్నింగ్ మేకప్ ఆర్టిస్ట్ రషీద్‌తో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అప్పలసూరి లుక్‌ని డిజైన్ చేశారు. నాకు ఈ పాత్ర రావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఎమోషనల్‌గా, పెర్ఫార్మెన్స్ పరంగా, గెటప్ పరంగా అన్నింటిలోనూ నాకు చాలా నచ్చిన పాత్ర ఇది. లెజెండ్ తర్వాత చాలా సినిమాలు చేశాను. కానీ వాటిలో గుర్తుపెట్టు కునేవి ఓ ఆరు వుంటాయి. ఆ జాబితాలో'పెద్ది'లో చేసిన అప్పలసూరి పాత్ర నా కెరీర్‌లో నెంబర్ వన్: జగపతిబాబు లో చేసిన అప్పలసూరి నంబర్ వన్ స్థానంలో ఉంటుంది.

# 'సమ్మర్ హాలిడేస్' టీజర్ లాంచ్



పిల్లలు, ఫ్యామిలీస్ థియేటర్స్‌కు వెళ్లి ఎంజాయ్ చేయాలని "సమ్మర్ హాలిడేస్" సినిమా ప్రొడ్యూస్ చేశా నిర్మాత ధీరజ్ మొగిలినేని.... మంచి కథల్ని నమ్మి ప్యాషనేట్‌గా సినిమాలు ప్రొడ్యూస్ చేస్తున్న గట్స్ ఉన్న ప్రొడ్యూసర్ ధీరజ్‌కు హ్యాట్సాఫ్ డైరెక్టర్ సాయి రాజేశ్.. కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ గా, డిస్ట్రిబ్యూటర్‌గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తున్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇంత సందడిగా మరే సినిమా ఈవెంట్ జరగలేదు. ధీరజ్ వంశీ పైడిపల్లి కజిన్. రెస్టారెంట్ బిజినెస్ రన్ చేసేవాడు. ధీరజ్‌తో పాటు ఈ సినిమా చేసిన గిరికి కూడా ఆల్ ది బెస్ట్. ఇవాళ ఇండస్ట్రీ బ్యాడ్ పొజిషన్ లో ఉంది. కొత్త దర్శకులు చాలా మంది ఈ ఈవెంట్‌కు వచ్చారు. చిన్న చిత్రాలతో వారు సాధిస్తున్న విజయాలు ఇండస్ట్రీకి బలంగా నిలబడుతున్నాయి. రైటర్ కొండల్ రావు మాట్లాడుతూ నేను గతంలో కమిటీ కుర్రాళ్ల చిత్రానికి రైటింగ్ టీమ్‌లో ఉన్నాను. ఇప్పుడు ఈ మూవీకి రచన చేశాను. లిరిసిస్ట్ కిట్టు విస్సప్రగడ మాట్లాడుతూ ఈ కథ పూర్తిగా చదివాకే పాటలు రాశాను. మ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లా డుతూ సమ్మర్ హాలిడేస్ మూవీ నాకు చాలా స్పెషల్ ఫిలిం. బాలనటి ఖుషి మాట్లా డుతూ సమ్మర్ హాలిడేస్ చిత్రంలో నటించడం హ్యాపీగా ఉంది. ఈ అవకాశం కల్పించిన నిర్మాత ధీరజ్‌కి థ్యాంక్స్. అన్నారు

# 'నేనెవరు' 29న విడుదల



నటకిరీటి డా.రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో, 'నువ్వేకావాలి", 'ప్రేమించు" వంటి సూపర్ హిట్ చిత్రాల ఫేమ్ సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్యపాత్రల్లో యువ ప్రతిభాశాలి చిరంజీవి తన్నీరు దర్శకత్వంలో తెరకెక్కిన సందేశభరిత వినోదాత్మక చిత్రం నేనెవరు?" మే 29న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, టీజర్, ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడంతో సినిమాపై పాజిటివ్ బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్ తన అనుభవంతో కూడిన ప్రత్యేకమైన పాత్రలో కనిపించనుండగా, కుటుంబ ప్రేక్షకులతో పాటు యువతను ఆకట్టుకునే అంశాలు సినిమాలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. భావోద్వేగాలు, వినోదం, సస్పెన్స్ మేళవింపుతో దర్శకుడు చిత్రాన్ని రూపొందించినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ప్రతి వ్యక్తి జీవితానికి సంబంధించిన ప్రశ్నను ప్రతిబింబించేలా నేనెవరు?" అనే టైటిల్‌కు తగ్గట్టుగా ఆసక్తికరమైన కథనాన్ని సిద్ధం చేసినట్లు మేకర్స్ పేర్కొన్నారు. టెక్నికల్‌గా కూడా సినిమా మంచి స్థాయిలో రూపొందిందని, సంగీతం, సినిమాటోగ్రఫీ, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చిత్రానికి ప్రత్యేక బలంగా నిలుస్తాయని చిత్రబృందం వెల్లడిం చింది. ఇప్పటికే ఇండస్ట్రీ ప్రముఖుల నుంచి ప్రివ్యూ షోల అనంతరం ప్రశం సలు అందుకున్న ఈ చిత్రం విడుదల రోజున మంచి స్పందన అందుకుంటుం దని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. మే 29న థియే టర్లలో విడుదల కానున్న నేనెవరు?" చిత్రం ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశాన్ని అందించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా నిలు స్తుందని చిత్ర యూనిట్ విశ్వాసం వ్యక్తం చేసింది.

# 'కాటాలన్' ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే సినిమా



'కాటాలన్'లో ఇప్పటివరకు నేను చేయని ఒక విభిన్నమైన పాత్రను పోషించాను. ఇది యూనివర్సల్‌గా ప్రతి ప్రేక్షకుడికీ కనెక్ట్ అయ్యే సినిమా. అద్భుతమైన యాక్షన్, బలమైన ఎమోషన్స్‌తో థియేటర్లలో ఒక గొప్ప అనుభూతిని అందిస్తుంది: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నటుడు సునీల్ క్యూబ్స్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ ముహమ్మద్ నిర్మించిన గ్రాండ్ యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ 28న భారీ పాన్‌ఇండియా విడుదలకు రెడీ అవుతుంది. ఈ చిత్రంలో ఆంటోనీ వర్గీస్ ప్రధాన పాత్రను పోషిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ మార్కో మేకర్స్ నుంచి వస్తున్న ఈ చిత్రానికి కొత్త దర్శకుడు పాల్ జార్జ్ దర్శకత్వం వహించారు. దుషార విజయన్, కబీర్ దుహాన్ సింగ్, టాలీవుడ్ నటుడు సునీల్, బాలీవుడ్ నటుడు పార్థ్ తివారీ, మలయాళ నటులు జగదీష్, సిద్దిక్, వ్లాగర్‌గాయకుడు హనన్ షా, రాపర్ బేబీ జీన్, హిప్జుర్ వంటి భారీ తారాగణం ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సలార్ ఫేం రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నటుడు సునీల్ మాట్లాడుతూ: పుష్ప తర్వాత నా లైఫ్ ఒక సర్‌ప్రైజింగ్ మోడ్‌లో పడింది. ఏ భాష నుంచి, ఎప్పుడు, ఎలాంటి క్యారెక్టర్ వస్తుందో నిజంగా నాకు తెలియడం లేదు. జైలర్ సినిమా చూసిన తర్వాత కేరళకు వెళ్లినప్పుడు కూడా నాకు తమిళ్‌లో సీన్ పేపర్లు ఇచ్చారు. (నవ్వుతూ) ఈ సినిమాలో నేను 'మార్తి' అనే కీలక పాత్ర చేస్తున్నాను. ఆజాద్ మాట్లాడుతూ... మార్కో తర్వాత ఈ సినిమాను మీ ముందుకు తీసుకురావడం చాలా ఆనందంగా ఉంది. నటుడు కబీర్ దుహాన్ సింగ్ మాట్లాడుతూ: మార్కో తర్వాత క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేస్తున్న రెండో సినిమా ఇది.

### ఆసియా ఛాంపియన్‌షిప్‌లో..

# భారత్ ఫ్రీస్టైల్ రెజ్లర్లకు 9 పతకాలు

**న్యూఢిల్లీ:** అండర్23 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో భారత ఫ్రీస్టైల్ రెజ్లర్లు తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించారు. వియత్నాంలోని నాంగ్‌లో జరుగుతున్న ఈ పోటీల నాలుగో రోజున ఈ బృందం పలు పతకాలను కైవసం చేసుకుంది.



కుమార్ మోహిత్, చందర్‌మోహన్ తమతమ వెయిట్ కేటగిరీలలో స్వర్ణ పతకాలు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కాగా భారత్ రజత, కాంస్య పతకాలను కూడా గెలుచుకుని తన మొత్తం పతకాల సంఖ్యను పటిష్టం చేసుకుంది. 65 కేజీల విభాగంలో పోటీపడిన మోహిత్, ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఓస్కోన్‌బాయ్ అబ్దిసమాటోవ్‌ను 12-4 తేడాతో ఓడించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఆ తర్వాత, హోరాహోరీగా జరిగిన 79 కేజీల ఫైనల్‌లో కజకిస్థాన్‌కు చెందిన యెర్ఖాన్ అబిల్‌పై 7-6 తేడాతో చందర్‌మోహన్ విజయం సాధించి, భారత్‌కు మరో టైటిల్‌ను అందించాడు. 61 కేజీల విభాగంలో, కజకిస్తాన్‌కు చెందిన నూర్దానాత్ ఐతానోవ్‌తో హోరాహోరీగా జరిగిన ఫైనల్‌లో 4-4తో డ్రా చేసుకున్న దీపక్ రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. 74 కేజీల విభాగంలో, తుర్క్‌మెనిస్తాన్‌కు చెందిన వతన్ అన్నెరజోవ్‌పై 10-0 తేడాతో తిరుగులేని విజయం సాధించిన దీపక్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఫైనల్‌లో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన ఉలుక్‌బెక్ సూరోంబేకోవ్ చేతిలో ఓడిపోయిన తర్వాత, 92 కేజీల విభాగంలో కుమార్ పునిత్ రజత పతకం సాధించడంతో భారతదేశ పతకాల సంఖ్య మరింత పెరిగింది.

# సింగపూర్ ఓపెన్‌లో ప్రణయ్ విజయం

## మహిళల విభాగంలో మాళ్విక నిష్క్రమణ







**న్యూఢిల్లీ:** భారత స్టార్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ 2026 సింగపూర్ ఓపెన్ సూపర్750 టోర్నమెంట్ ప్రారంభ రౌండ్‌లో భారీ విజయాన్ని నమోదు చేయగా, మహిళల సింగిల్స్‌లో మాళ్విక బన్సోద్ ఓటమి చెందింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో అతను వెనుకబడి ఉన్నప్పటికీ ఇండోనేషియాకు చెందిన ప్రపంచ 5వ ర్యాంకర్ జోనాటన్ క్రిస్టీని మూడు గేమ్‌లలో 10-21, 21-12, 21-18 తేడాతో ఓడించి సంచలనం సృష్టించి రౌండ్ ఆఫ్ 16కు చేరుకున్నాడు. మొదటి గేమ్‌లో వైఫల్యం చెందినా రెండవ గేమ్‌లో అద్భుతంగా పుంజుకుని ఆధిపత్యం చెలాయించి, నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. మూడవ గేమ్‌లో, ఇద్దరి మధ్య పోరు జరిగినా చివరికి ప్రణయ్ చివరి మూడు పాయింట్లు గెలుచుకుని మ్యాచ్ గెలిచాడు. వీరిద్దరి మధ్య జరిగిన ముఖాముఖి పోరులో క్రిస్టీ 7-2తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, ఐదేళ్ల తర్వాత ప్రణయ్ ఎట్టకేలకు అతనిపై విజయం సాధించాడు. మరోవైపు, భారత మిక్స్‌డ్ డబుల్స్ జోడీ ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టో కూడా మూడు గేమ్‌ల విజయంతో రెండో రౌండ్‌కు చేరుకున్నారు. వారు మలేషియాకు చెందిన వాంగ్ టియెన్ సి మరియు సీన్ లిమ్ చీవ్ జోడీని 21-14, 20-22, 21-13 తేడాతో ఓడించి, జపాన్ జోడీతో రెండో రౌండ్ పోరుకు సిద్ధమయ్యారు. ఇక మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి మాళ్విక బన్సోద్ చైనీస్ తైపీకి చెందిన హ్సియాంగ్ టి లిన్ చేతిలో 11-21, 21-19, 12-21 తేడాతో ఓడిపోయి మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించింది.





ఆట

### అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

# జావెలిన్‌లో సుమిత్ వరల్డ్ రికార్డ్

**న్యూఢిల్లీ:** పారాలింపిక్ ఛాంపియన్ సుమిత్ అంటిల్ పురుషుల జావెలిన్‌లో కొత్త ప్రపంచ రికార్డును నెలకొ ల్పాడు. బెంగళూరులో బుధవారం జరిగిన ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ఎఫ్64 జావెలిన్ త్రో ఈవెంట్‌లో తన సొంత ప్రపంచ రికార్డును మెరుగు పరిచాడు. అతను తన ఐదవ ప్రయత్నంలో 74.82 మీటర్ల భారీ త్రోవిసిరి, తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన, మునుపటి ప్రపంచ రికార్డు అయిన 73.29 మీటర్లను మెరుగుపరిచి టైటిల్ గెలుచుకున్నాడు. సుమిత్ చివరిసారిగా చైనాలో జరిగిన 2023 ఆసియా పారా గేమ్స్‌లో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు. మూడేళ్ల తర్వాత, అతను ఇప్పుడు 1.5 మీటర్ల భారీ మెరుగుదలతో తన సొంత ప్రపంచ రికార్డును ఏడవసారి మెరుగుపరిచాడు. అలాగే గతేడాది న్యూఢిల్లీలో జరిగిన స్వదేశీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తన ప్రపంచ రికార్డును మెరుగుపరచుకోవాలని సుమిత్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. కానీ భుజం గాయం నుంచి కోలుకుంటున్నందున అతను వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన సాధించలేకపోయాడు. అయితే, అతను 71.37 మీటర్ల కొత్త ఛాంపియన్‌షిప్ రికార్డుతో తన మూడవ ప్రపంచ టైటిల్‌ను గెలుచుకున్నప్పటికీ, తాను ఆశించిన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనను అందుకోలేకపోయాడు. తాజాగా మరోసారి తన సత్తాను చాటాడు.

# క్లైమాక్స్‌కు ఆరెంజ్ క్యాప్ రేస్

## హీటెక్కుతున్న పరుగుల వేట!





**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ లీగ్ దశ ముగిసి, ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు ప్రారంభమవడంతో టోర్నమెంట్ అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ఈ 19వ ఎడిషన్‌లో భారీ స్కోర్లు, సిక్సర్లు, ఫోర్ల వర్షం కురుస్తున్నాయి.

ఒకవైపు జట్లు ట్రోఫీ కోసం పోటీ పడుతుంటే మరోవైపు ప్రతిష్టాత్మక ఆరెంజ్ క్యాప్ కోసం బ్యాటర్ల మధ్య పోరు క్లైమాక్స్‌కు చేరింది. ఈ సీజన్‌లో ఇప్పటికే బ్యాటర్లు ఏకంగా 9 సెంచరీలు బాదడం విశేషం. ఈ సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ రేసులో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్ సాయి సుదర్శన్ 652 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. లీగ్ దశ ముగిసే సమయానికి 14 మ్యాచ్‌ల్లో 46.57 సగటుతో, 157.86 స్ట్రైక్ రేట్‌తో 638 రన్స్ చేసిన సుదర్శన్, క్వాలిఫైయర్ 1 మ్యాచ్‌లో మరో 14 పరుగులు జోడించి మొత్తం 652 పరుగులతో టాప్‌లో కొనసాగుతున్నాడు. 2025 సీజన్‌లో కూడా ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతను ఈసారి కూడా దాన్ని నిలబెట్టుకుని బ్యాక్‌టుబ్యాక్ టైటిల్స్ సాధించాలని కసితో ఉన్నాడు. ఇక గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సీజన్‌లో కెప్టెన్సీ బాధ్యతలను సక్సెస్‌ఫుల్‌గా నిర్వహిస్తూనే, బ్యాటింగ్‌లోనూ దుమ్మురేపుతున్నాడు. గిల్ ఇప్పటివరకు 159.27 స్ట్రైక్ రేట్‌తో 6 హాఫ్ సెంచరీలు బాది 618 పరుగులతో 2వ స్థానంలో నిలిచాడు. మిగిలిన మ్యాచ్‌ల్లో గిల్ భారీ స్కోర్లు సాధిస్తే ఆరెంజ్ క్యాప్ అందుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. అలాగే సన్‌రైజర్స్ హైదరాబాద్ మిడిల్ ఆర్డర్ వెన్నుముక, సౌతాఫ్రికా క్లాస్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ 3వ ప్లేస్‌లో ఉన్నాడు.

ఈ సీజన్‌లో 159.47 స్ట్రైక్ రేట్‌తో, 6 హాఫ్ సెంచరీల సాయంతో 606 పరుగులు చేశాడు. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుకు బ్యాక్‌టుబ్యాక్ ట్రోఫీలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 600 పరుగులు పూర్తి చేశాడు. అతని ఐపీఎల్ కెరీర్‌లోనే బెస్ట్ అనదగ్గ రీతిలో 164.38 స్ట్రైక్ రేట్‌తో ఈ పరుగులు సాధించాడు. లీగ్ దశ ముగిసేసరికి రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 583 పరుగులు సాధించాడు. టాప్5ని బ్యాటర్ల కంటే ఇతని స్ట్రైక్ రేట్ (232.27) అత్యధికంగా ఉంది.

# భారత్ హాకీ మహిళా జట్టు ఓటమి

## 2-1 తేడాతో ఆస్ట్రేలియా విజయం

**న్యూఢిల్లీ:** భారత, ఆస్ట్రేలియా మహిళల హాకీ జట్ల మధ్య నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి రోజు హోరాహోరీగా జరిగిన పోరులో హాకీ రూస్ (ఆస్ట్రేలియా) జట్టు 2-1 తేడాతో అతిథి జట్టుపై స్వల్ప విజయం సాధించింది. పెర్త్‌లో జరిగిన తొలి క్వార్టర్‌లో భారత్ మొదట గోల్ చేసింది. నవనీత్ కౌర్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలచి తన జట్టుకు ఆరంభంలోనే ఆధిక్యం అందించింది. తొలి అర్ధభాగంలో భారత జట్టు పటిష్టంగా నిలబడి, రెండవ క్వార్టర్ అంతటా తమ ఆధిక్యాన్ని విజయవంతంగా కొనసాగించింది. అయితే, రెండవ అర్ధభాగంలో ఆట గమనం మారింది. ఆస్ట్రేలియాకు చెందిన అబ్బీ విల్సన్ 2 పెనాల్టీకార్నర్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, 3, 4 క్వార్టర్లలో స్కోర్ చేసి, ఆతిథ్య జట్టుకు పునరాగమన విజయాన్ని అందించింది. ఈ ఏడాది ఆరంభంలో అర్జెంటీనాలో జరిగిన 4 మ్యాచ్‌ల సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత, ప్రపంచ నంబర్ 2 జట్టుతో జరిగిన సిరీస్‌ను 2-2తో సమం చేసి ప్రోత్సాహకరమైన ప్రదర్శన కనబరిచిన భారత జట్టు ఆస్ట్రేలియాతో తలపడుతోంది. 22 మంది సభ్యులున్న భారత జట్టులో వర్ధమాన ప్రతిభావంతులైన సోనమ్, హినా బానో, లల్తాంత్లువాంగి తమ అవకాశం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 9వ స్థానంలో ఉన్న భారత జట్టు, 8వ ర్యాంక్‌లో ఉన్న తమ ప్రత్యర్థులకు సవాలు విసరడానికి సర్వశక్తులు ఒడ్డడానికి సిద్ధంగా ఉంది.



# స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ





**ముంబయి, మే 27:** దేశీయ ఈక్విటీసూచీలు బుధవారం స్వల్పనష్టాలు ఎదుర్కొన్నాయి. అమెరికా ఇరాన్ టెన్షన్లతోపాటు విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు విత్‌డ్రాలు పెరగడంతో ఎంపికచేసిన సూచీల్లో ఒత్తిళ్లు పెరిగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 141.90 పాయింట్లు క్షీణించి 75,867.80 నపాయింట్లవద్ద ట్రేడింగ్ ముగిస్తే ఎన్ఎస్ఇ నిఫ్టీకూడా 6.55 పాయింట్లు క్షీణించి 23,907,15 పాయింట్లవద్దట్రేడింగ్ నిలిపివేసింది. కీలక కంపెనీల్లో ఓఎన్‌జిసి 4.94శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.54శాతం, ఐటిసి 0.48శాతం క్షీణించి నిఫ్టీపై ఒత్తిడిని పెంచాయి. మార్కెట్లలో బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.83శాతంపెరిగితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.49శాతం పెరిగింది. బిఎస్‌ఇలో మొత్తం 2275 కంపెనీల షేర్లుపెరిగి 1945 కంపెనీలు క్షీణించాయి. 182 మాత్రం యథాతథంగా కొనసాగాయి. దేశీయ మార్కెట్లు గురువారం బక్రిద్‌కారణంగా మార్కెట్లకు సెలవు. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్ రూపాయి డాలరుతో చెలామణి 95.70గా నడిచింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు కూడా రూ.1,56,194గా కొనసాగింది. అమెరికా పదేళ్ల బాండ్లు 4.464శాతం రిటార్నులు నమోదుచేస్తే కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు జులై నెల సెటిల్‌మెంట్లకుగాను 3.34శాతం క్షీణించి 96.24 డాలర్లుగా కొనసాగింది. అమెరికా డౌజోన్స్ 224 పాయింట్లుపెరిగింది. యూరోపియన్ షేర్లు బుధవారం ఎగువస్థాయిలోనే ముగిసాయి. ఇరాన్ వివాదంపైనే అప్రమత్తంగా వ్యవహరిస్తూ ట్రేడింగ్ కొనసాగించారు. ఇక అమెరికాలో రాత్రికిరాత్రే వాల్‌స్ట్రీట్‌షేర్లు పెరిగాయి. ఎస్అండ్‌పి 500, నాస్‌డాక్ కాంపోజిట్ ఇంట్రాడేల్లో రికార్డు గరిష్టాలకు చేరాయి. ఎస్అండ్‌పి500 0.61శాతం, నాస్‌డాక్ 1.19శాతంచొప్పున పెరిగాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు మాత్రం 118.02 పాయింట్లుక్షీణించింది. ఇక షేర్లపరంగాచూస్తే జీ ఎంటర్‌టైన్‌మెంట్ 10.49శాతం, టైమెక్స్‌గ్రూప్ ఇండియా13.07శాతం, ప్రాక్టర్ అండ్ గాంబుల్ హెల్త్ 10.53శాతం, జెకె టైర్ అండ్ ఇండస్ట్రీస్ 4.86శశాతం, గిల్లెట్ ఇండియా 4.85శాతం, ఫినోలెక్స్ 7.74శాతం, గాంధార్ ఆయిల్‌రిఫైనరీ0.22శాతం అద్వైత్ ఎనర్జీ 0.54శాతం, కిల్బుమ్ ఇంజినీరింగ్ 3.61శాతంపెరిగాయి.

# దేశీయ రూట్లలో సర్వీసులు కుదిస్తున్న ఎయిరిండియా





**ముంబయి, మే 27:** పశ్చిమాసియా ఉద్రిక్తతల పుణ్యమా అని ఎయిరిండియా ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులను తగ్గించాలని సంస్థ నిర్ణయించింది. దీనికితోడు విమాన ఇంధన ధరలు భారీగా పెరగడం కూడా ఒక కారణమే. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. దీంతో ఎయిరిండియా జులై, ఆగస్టు నెలల్లో తన దేశీయ విమాన సర్వీసులను 15 నుంచి 20 శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే రూట్లను పూర్తిగా రద్దు చేయకుండా కేవలం విమానాల ఫ్రీక్వెన్సీని మాత్రమే తగ్గించాలని సంస్థ భావిస్తోంది. ఈ మార్పులపై ఎయిరిండియా అధికారిక ప్రతినిధి స్పందించారు. ఇంధన ధరల ప్రభావం వల్లే కొన్ని దేశీయ రూట్లలో సర్వీసులను తాత్కాలికంగా క్రమబద్ధీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ పాత షెడ్యూల్ ప్రకారం అన్ని విమానాలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ప్రయాణికుల డిమాండ్, మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తామని ఎయిరిండియా వెల్లడించింది. షెడ్యూల్ మార్పుల వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు పూర్తి సాయం అందిస్తామని విమానయాన సంస్థ హామీ ఇచ్చింది. టికెట్లు బుక్ చేసుకున్న వారికి ప్రత్యామ్నాయ విమానాల్లో సీట్లు కేటాయించడం, ఎలాంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీలను మార్చుకునే అవకాశం కల్పించడం లేదా పూర్తి డబ్బును రిఫండ్ చేయడం వంటి ఆప్షన్లను అందిస్తామని తెలిపింది. రాబోయే రెండు నెలల్లో ప్రయాణించే వారు ముందే ఫ్లైట్ షెడ్యూల్స్ తనిఖీ చేసుకోవాలని సూచించింది.

### నాలుగో త్రైమాసికంలో ఈక్విటీ సంపద

# రూ.12.6 లక్షల కోట్లు ఆవిరి

వాణిజ్యం



**ముంబయి, మే 27:** భారతీయ కుటుంబాల ఈక్విటీ సంపదకు మార్చి త్రైమాసికంలో భారీ దెబ్బ తగిలింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ పెట్టుబడిదారుల నిరంతర అమ్మకాల ఒత్తిడి కారణంగా సుమారు రూ.12.6 లక్షల కోట్ల సంపద ఆవిరైందని తాజా ఎన్ఎస్ఇ మార్కెట్ పల్స్ నివేదిక వెల్లడించింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో నిఫ్టీ 10 శాతానికి పైగా పతనమైంది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల ఎఫ్‌పిఐలు భారీ నిధుల ఉపసంహరణలు, ప్రపంచ పెట్టుబడులు తైవాన్, దక్షిణ కొరియా వంటి కృత్రిమ మేధస్సు ఆధారిత మార్కెట్ల వైపు మళ్లడం కూడా భారత మార్కెట్లపై ఒత్తిడిని పెంచినట్లు పల్స్‌నివేదిక స్పష్టంచేసింది. నష్టాలు ఎదురయినా 2020 ఏప్రిల్ నుంచి భారతీయ కుటుంబాల ఈక్విటీ సంపద సృష్టి మొత్తం రూ.44 లక్షల కోట్లకు చేరింది. 2026 ఆర్థిక సంవత్సరంలో నాల్గవ త్రైమాసిక పతనం కారణంగా రూ.2.5 లక్షల కోట్ల తగ్గుదల నమోదైంది. మార్చి 2026 నాటికి కుటుంబాల మొత్తం ఈక్విటీ సంపద .రూ.76.5 లక్షల కోట్లకు చేరగా మార్చి 2020 నుంచి ఇది వార్షిక సమ్మిళిత వృద్ధి రేటు29.6 శాతంగా ఉంది. ఇక వ్యక్తిగత పెట్టుబడిదారుల కలిపిన వాటాలు ఆరు వరుస త్రైమాసికాలుగా విదేశీ పెట్టుబడిదారుల వాటాలను అధిగమించడం విశేషం. అయితే వ్యక్తిగత పెట్టుబడిదారుల ప్రత్యక్ష ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్ల కనిష్ఠం అంటే 9.1 శాతానికి పడిపోయాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో ద్వితీయ మార్కెట్లలో నికర అమ్మకాలు నమోదవడం గత ఏడు సంవత్సరాల్లో ఇదే మొదటిసారి. ఇక విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు 2026 ఆర్థిక సంవత్సరంలో 19.6 బిలియన్ డాలర్లమేరవిత్‌డ్రాచేసారు. వారి వాటా ఎన్ఎస్ఇ లిస్టెడ్ కంపెనీల్లో 17 ఏళ్ల కనిష్ఠ స్థాయి 15.8 శాతానికి పడిపోయింది. దేశీయ మ్యూచువల్ ఫండ్ల వాటా రికార్డు స్థాయి 11.4 శాతానికి పెరిగింది. నిరంతర సిప్‌పెట్టుబడులు, రిటైల్ పెట్టుబడిదారుల స్థిరమైన భాగస్వామ్యం దీనికి ప్రధాన కారణాలుగా నివేదిక తెలిపింది. మొత్తంగా చూస్తే, భారతీయ కుటుంబాల పెట్టుబడి ధోరణిలో నిర్మాణాత్మక మార్పు చోటుచేసుకుంటోందని, ప్రత్యక్ష ఈక్విటీల కంటే మ్యూచువల్ ఫండ్ల ద్వారా పరోక్ష పెట్టుబడులు మరింత స్థిరత్వాన్ని చూపుతున్నాయని ఎన్ఎస్ఇ మార్కెట్ పల్స్ స్పష్టంచేసింది.

# ఆసియా-పసిఫిక్ డేటా హాబ్‌గా భారత్

## టాప్ సెకండరీ మార్కెట్‌గా హైదరాబాద్!

**ముంబయి, మే 27:** భారత డేటా సెంటర్ల మార్కెట్ అత్యంత వేగంగా విస్తరిస్తూ గ్లోబల్ డిజిటల్ మౌ సదుపాయాల రంగంలో హబ్‌గా మారుతోంది. ఆసియాపసిఫిక్ ప్రాంతంలోనే రెండో అతిపెద్ద డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ నిలిచింది. ప్రస్తుతం దేశంలో 1.6 గిగావాట్ల కార్యాచరణ సామర్థ్యం ఉండగా మరో 3.1 గిగావాట్ల సామర్థ్యం నిర్మాణం, ప్రణాళిక దశల్లో ఉంది. ప్రముఖ ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఈ వివరాలు వెల్లడించింది. దేశంలో కృత్రిమ మేధ వినియోగం పెరగడం, హైపర్‌స్కేల్ క్లౌడ్ విస్తరణ, సంస్థల నుంచి డిమాండ్ అధికమవ్వడం వంటి కారణాలతో భారత్ డిజిటల్ మౌలిక సదుపాయాలకు కేంద్రంగా మారుతోందని నివేదిక పేర్కొంది. ఈ వృద్ధికి ముంబై, హైదరాబాద్, చెన్నై, ఢిల్లీఎన్‌సిఆర్, పుణె, బెంగళూరు వంటి నగరాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఈ మార్పుపై కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ సరాఫ్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ డేటా సెంటర్ రంగం వృద్ధిలో కొత్త దశకు చేరుకుంది. ఇక్కడ డిమాండ్‌తో పాటు విద్యుత్ లభ్యత, మౌలిక సదుపాయాల సంసిద్ధత, నిర్మాణ సామర్థ్యం అత్యంత కీలకంగా మారాయని వివరించారు. భారత డేటా సెంటర్ల మార్కెట్‌కు ముంబై నగరం కేంద్రంగా నిలిచింది. 2026 చివరి నాటికి ఈ నగరం 1 గిగావాట్ కార్యాచరణ సామర్థ్యాన్ని అధిగమిస్తుందని అంచనా. హైదరాబాద్, చెన్నై, ఢిల్లీ ఎన్సీఆర్, పుణె వంటి ద్వితీయ శ్రేణి మార్కెట్లు వృద్ధిలో ఉన్నాయి. హైదరాబాద్ ఆసియాపసిఫిక్ ప్రాంతంలోనే టాప్ సెకండరీ మార్కెట్‌గా, ప్రపంచవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో నిలిచిందని నివేదిక ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఇది డేటా సెంటర్ల ల్యాండ్‌స్కేప్‌లో హైదరాబాద్ ప్రాముఖ్యతను స్పష్టం చేస్తోంది. మరోవైపు బెంగళూరును తృతీయ శ్రేణి మార్కెట్‌గా నివేదిక వర్గీకరించింది.

### చిప్ డివిజన్ లాభాలతో ఉద్యోగులకు

# శాంసంగ్ భారీ బోనస్

**సియోల్, మే 27:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ తమ ఉద్యోగులకు భారీ కానుక ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నెలకొన్న అనూహ్యమైన వృద్ధి కారణంగా కంపెనీ చిప్ విభాగం లాభాల ర్యాలీ తీయడంతో ఉద్యోగులకు భారీ నజరానా ప్రకటించింది. చిప్ డివిజన్‌లోని ప్రతి ఉద్యోగికి సగటున 3.40 లక్షల డాలర్లు (దాదాపు రూ. 3.25 కోట్లు) బోనస్‌గా అందనుంది. ఈ మేరకు కంపెనీ యాజమాన్యానికి, కార్మిక సంఘానికి మధ్య కుదిరిన ఒప్పందానికి ఉద్యోగుల నుంచి ఆమోదం లభించింది. తాజాగా జరిగిన ఓటింగ్‌లో కంపెనీ అతిపెద్ద కార్మిక సంఘం ఈ భారీ బోనస్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఈ ఓటింగ్‌లో 95 శాతానికి పైగా అర్హులైన సభ్యులు పాల్గొనగా, వారిలో 73.7 శాతం మంది ఒప్పందానికి అనుకూలంగా ఓటు వేశారు. ప్రస్తుతం ఎఐ డేటా సెంటర్ల కోసం మెమరీ చిప్‌లకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ప్రపంచంలోనే అతిపెద్ద మెమరీ చిప్ తయారీదారుల్లో ఒకటైన శాంసంగ్ ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంది. దీంతో గడిచిన త్రైమాసికంలో కంపెనీ చిప్ విభాగం ఆదాయం ఏకంగా 49 రెట్లు పెరిగింది.





ఈ నేపథ్యంలోనే ఉద్యోగులకు లాభాల్లో వాటా ఇవ్వాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఈ బోనస్ శాంసంగ్ ఉద్యోగులందరికీ కాకుండా కేవలం ప్రాసెసర్లు, మెమరీ చిప్‌లను తయారు చేసే చిప్ విభాగానికే వర్తింపచేసింది. ఈ డివిజన్‌లో సుమారు 78,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఒప్పందం ప్రకారం సెమీకండక్టర్ విభాగం ఆపరేటింగ్ ప్రాఫిట్‌లో 10.5 శాతాన్ని ఉద్యోగులకు షేర్ల రూపంలో, మరో 1.5 శాతాన్ని నగదు రూపంలో చెల్లిస్తారు. ఈ బోనస్ చెల్లింపుల కోసం కంపెనీ సుమారు 26.5 బిలియన్ డాలర్లు ఖర్చు చేయనుందని అంచనా. తైవాన్‌కు చెందిన టిఎస్ఎంసి తర్వాత ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను దాటిన రెండో ఆసియా కంపెనీగా శాంసంగ్ నిలిచింది.